సెప్టెంబర్
2020

173

సంపుటి : 15 సంచిక : 4 వెల రు. 10/-

## ఈ సంచికలో........

రెడ్ సెల్యూట్ కామ్రేడ్ రాజయ్య
కరోనా కాలంలో దళితులపై పెరిగిన దాడులు
భారత్-చైనా సరిహద్దు వివాదం
సంస్కృత భాష: ప్రాచీనత, వాస్తవ చరిత్ర
ఏది దేశభక్తి, ఏది జాతీయవాదం?
బొలీవియాలో నిరంకుశంగా
నయా-ఉదారవాదం పునరుద్ధరణ
ప్రత్యామ్నాయ విధానాలే పరిష్కారం
శ్రామికవర్గాన్ని విముక్తి చేయటమే కమ్యూనిస్టుల లక్ష్యం
నూతన విద్యా విధానం2020: సిపిఐ(ఎం) వైఖరి
సాహసోపేతమైన వర్లి ఆదివాసుల తిరుగుబాటు

నివాళి

# రెడ్ సెల్యూట్ కామ్రేడ్ రాజయ్య

**(గిరిజన నేత, ఆంధ్ర, తెలంగాణాల్లో గిరిజన హక్కుల కోసం జరిగిన అనేక పోరాటాల్లో ధీరోధాత్తంగా పోరాడిన యోధుడు, సిపిఐ(ఎం) ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కామ్రేడ సున్నం రాజయ్య ఇటీవల కరోనా మహమ్మారి బారిన పడి అసువులు బాసారు. ఆయనకు నివాళులర్పిస్తూ జరిగిన ఆన్‌లైన్ బహిరంగ సభలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు కామ్రేడ్ బృందా కరత్ చేసిన ప్రసంగాన్ని దిగువ ఇస్తున్నాం... సంపాదకుడు)**

**బృందా కరత్**

కామ్రేడ్స్!

మనం ఇప్పుడు చాలా విచార కరమైన సందర్భంగా సమావేశమవు తున్నాం. మన ప్రియతమ నేత కామ్రేడ్ సున్నం రాజయ్య ఇంత తొందరగా మనకు దూరమవుతారని మనం ఊహించలేదు. కామ్రేడ్ రాజయ్య గురించి బాగా తెలిసిన మీ అందరితోపాటు, ఆంధ్ర, తెలంగాణాల్లోని మన కామ్రేడ్స్ అందరితోపాటు నేనూ ఆయన మృతికి ప్రగాఢ సంతాపం తెలుపుతున్నాను. ఆయన కుటుంబ సభ్యుల్లో చాలా మంది విప్లవకారుల పేర్లు పెట్టుకున్నారు. కుటుంబ సభ్యులందరికీ నా సానుభూతి తెలుపుతున్నాను. కామ్రేడ్ రాజయ్య మృతి మనకు బాధా కరమే అయినప్పటికీ కమ్యూనిస్టులుగా, అణగారిన వర్గాల ప్రజల హక్కుల కోసం, పెట్టుబడిదారీ సమాజానికి వ్యతిరేకంగా పోరాడుతున్న మన మంతా కామ్రేడ్ రాజయ్యను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు పోవాలి. 1978లో పార్టీ సభ్యత్వం తీసుకున్న రాజయ్య ఈ కాలమంతా సమాజంలో తీవ్రమైన అణచివేతకు గురవుతున్న గిరిజన ప్రజల హక్కుల కోసం పోరాడుతూ కింది స్థాయి నుండి పని చేసి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో తిరుగులేని గిరిజన నేతగా ఎదిగారు. రాష్ట్ర విభజన తరువాత కూడా ఆయన రెండు రాష్ట్రాల్లో ఆదరణగల నాయకుడిగా గుర్తింపు పొందారు. ఈనాడు కరోనా మహమ్మారి ప్రపంచ మంతటా విజృంభించిన సమయంలో మనకు పెట్టుబడిదారీ, సోషలిస్టు వ్యవస్థల మధ్య తేడా ఏమిటో స్పష్టంగా తెలుస్తోంది. కరోనా మహమ్మారిని కట్టడిచేయడంలో సోషలిజం ఆదర్శవంతమైన కృషి చేస్తోంది. అటువంటి సోషలిస్టు సిద్ధాంతంతో స్ఫూర్తి పొందిన కామ్రేడ్ రాజయ్య జీవిత చరమాంకం వరకు పీడిత ప్రజల విముక్తి కోసం పోరాడారు.

కామ్రేడ్ రాజయ్యతో కలిసి పనిచేసిన కామ్రేడ్స్ అందరూ ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో పనిచేసే ఆయన సహచరులు పెట్టుబడిదారీ వ్యవస్థ ఏ విధంగా మానవ



ఆంధ్ర, తెలంగాణా గిరిజన పోరాట నేత
కామ్రేడ్ సున్నం రాజయ్య

విలువలను ధ్వంసం చేస్తున్నదో చూస్తున్నారు. ముఖ్యంగా ఈనాడు కరోనా మహమ్మారి సందర్భంగా ఈ విధ్వంసం మరీ విపరీతంగా జరుగుతున్నది. గిరిజన నేతల పేరుతో కొందరు తమ స్వంత ఉద్యమాలను 'పెట్టుబడిదారీ దేవుళ్లకు' బేరం పెట్టి అమ్మేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కామ్రేడ్ రాజయ్య సోషలిజంతోనూ, మార్క్సిస్టు సిద్ధాంతంతోనూ స్ఫూర్తి పొంది నిజమైన గిరిజన నేతగా ప్రజల్లో స్ఫూర్తిదాయకమైన, నిజాయితీతో కూడిన కృషి చేశారు. మన జీవితాలను నాశనం చేస్తున్న బూర్జువా విలువలకు వ్యతిరేకంగా ఎర్రజెండా నీడన జీవితాంతం పోరాడారు.

ఈ రోజు బిజెపి కేంద్ర ప్రభుత్వం నయాఉదారవాద విధానాలను ఉధృతంగా అమలు చేయడం కోసం కరోనా లాక్‌డౌన్‌ను ఉపయోగించుకుంటున్నది. అందులో భాగంగా అది ఆదివాసీలపై దాడిని ఎక్కుపెట్టింది. ఆదివాసీ ప్రజలు గనులు సమృద్ధిగా లభించే ప్రాంతాల్లో నివసిస్తారు. కాబట్టి వారి భూములను కొల్లగొట్టడానికి ప్రభుత్వం అడవులపై వారికి గల హక్కులపై దాడి చేస్తోంది. ఆంధ్ర, తెలంగాణాలోని మీకు ఏజెన్సీ ప్రాంతాల్లో బాక్సైడ్ నిక్షేపాల తవ్వకాలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాల గురించి తెలుసు. పోలవరం, ఇతర ప్రాజెక్టులు కట్టినప్పుడు ఆదివాసీ ప్రజల జీవితాలను, వారి జీవనాన్ని, వారి సంస్కృతిని కనీసం పరిగణనలోకి కూడా తీసుకోకుండా ప్రభుత్వాలు వ్యవహరించిన విషయం మీకు బాగా తెలుసు. ఈ రోజుకూ ప్రభుత్వాలు అవే విధానాలను అనుసరిస్తున్నాయి. దేశంలో ఆదివాసీల జనాభా 9 శాతం మాత్రమే. కానీ ప్రాజెక్టుల వల్ల నిరాశ్రయులవుతున్న ఆదివాసీల సంఖ్య 40 శాతం ఉంటుందంటే వారు ఎంతగా నిరాదరణకు లోనవుతున్నారో అర్థమవుతుంది.

మనం ఏ విధానాల కోసమైతే పోరాడి సాధించుకున్నామో వాటిని, 5వ షెడ్యూల్ ఏరియా, రాజ్యాంగ గ్యారంటీలు, అటవీ హక్కుల చట్టం వంటి వాటన్నిటినీ నేడు వారు మార్చేస్తున్నారు. ఆదివాసీల హక్కులను హరించి వేస్తున్నారు. ఈ హక్కుల కోసం, చట్టాల కోసం గతంలో జరిగిన ప్రతి పోరాటంలోనూ కామ్రేడ్ రాజయ్య చాలా ముఖ్యమైన పాత్ర నిర్వహించారు. కామ్రేడ్ రాజయ్యతో కలిసి నేను పోలవరంలో నిర్వాసితుల గ్రామాలను సందర్శించాను. ఆ సందర్భంగా గిరిజన ప్రజలు ఆయనను ఎంతగా గౌరవించేవారో, ఎంతగా ప్రేమించేవారో, ఎంతగా ఆయనకు తమ సమస్యలు చెప్పుకునే వారో నేను చూశాను. ఒక శాసన సభ్యునిగా కూడా ఆయన ప్రజల హక్కుల కోసం, ప్రజలకు కొన్ని సదుపాయాలు సమకూర్చడం కోసం తీవ్రంగా కృషి చేశారు. ఆ విధంగా ఒక శాసన సభ్యునిగా, ఒక పోరాట యోధుడిగా, ఒక కమ్యూనిస్టుగా కామ్రేడ్ రాజయ్య ఆదివాసీ పోరాటాల సమున్నత సంప్రదాయాన్ని కొనసాగించారు.

కేంద్రంలోని మోడీ ప్రభుత్వ విధానాల కారణంగా ఇటీవలి కాలంలో

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


**1. రెడ్ సెల్యూట్ కామ్రేడ్ రాజయ్య**

బృందా కరత్............. 2

**2. కరోనా కాలంలో దళితులపై పెరిగిన దాడులు**

సుభాషిణి అలి ............ 4

**3. భారత్–చైనా సరిహద్దు వివాదం**

జాన్ చెరియన్ ........... 8

**4. సంస్కృత భాష: ప్రాచీనత, వాస్తవ చరిత్ర**

ఎంవిఎస్ శర్మ ......... 12

**5. ఏది దేశభక్తి, ఏది జాతీయవాదం?**

ఎన్‌సి ఆస్తానా .......... 14

**6. బొలీవియాలో నిరంకుశంగా నయా-ఉదారవాదం పునరుద్ధరణ**

ప్రొ॥టి రవీంద్రన్ ........ 16

**7. ప్రత్యామ్నాయ విధానాలే పరిష్కారం**

ఎ కోటిరెడ్డి............ 21

**8. శ్రామికవర్గాన్ని విముక్తి చేయటమే కమ్యూనిస్టుల లక్ష్యం**

ఫ్రెడరిక్ ఏంగెల్స్‌తో ఇంటర్వ్యూ ...24

**9. నూతన విద్యా విధానం2020: సిపిఐ(ఎం) వైఖరి**.......27

**10. సాహసోపేతమైన వర్లి ఆదివాసుల తిరుగుబాటు** ............................... 33



**సంపాదకుడు:**

**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**

**పాటూరు రామయ్య**

**బి.వి. రాఘవులు**

**తమ్మినేని వీరభద్రం**

**ఎస్. వీరయ్య**

**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు:**బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్. వెంకట్రావు
**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**ఫోన్: ఎడిటర్ : 9490099333**
**మేనేజర్:కె.హరికిషోర్:9490098977, 9494101091**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org


# జి ఎస్ టి

భారత రాజ్యాంగంలోని మొట్టమొదటి అధికరణం భారత దేశాన్ని రాష్ట్రాల సమాఖ్యగా వర్ణించింది. "ఇండియా, అంటే, భారత్ రాష్ట్రాల సమాఖ్యగా ఉంటుంది" అని పేర్కొంది. ఇందులో కీలకమైన పదాలు చూడండి, 'ఇండియా', 'భారత్', 'రాష్ట్రాలు', 'సమాఖ్య'. అంటే రాష్ట్రాలు లేకపోతే సామాఖ్య లేదు. అంటే కేంద్రం లేదు. కానీ ఈ రోజు కేంద్రంలో అధికారం చెలాయిస్తున్న బిజెపి ప్రభుత్వం ఆ సమాఖ్య స్ఫూర్తిని పూర్తిగా దెబ్బతీస్తోంది. రాష్ట్రాలకు రావలసిన జిఎస్‌టి బకాయిలు ఎగ్గొట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం ఆడుతున్న నాటకం దీనికి సరికొత్త నిదర్శనం.

జిఎస్‌టి కింద రాష్ట్రాలు అనేక రకాల వస్తువులపై పన్నుల వేసే అధికారాలను కేంద్రానికి వదిలిపెట్టినందుకు గాను వాటికి పరిహారం చెల్లిస్తామని కేంద్ర ప్రభుత్వం చట్టం చేసింది. జిఎస్‌టి (రాష్ట్రాలకు పరిహార) చట్టం కింద 2015-16 నుండి 2021-22 వరకు అయిదేళ్ల పాటు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాలకు ఏడాదికి 14 శాతం వార్షికాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఆదాయాన్ని సమకూర్చాలి. సిగరెట్లు, మద్యం, విలాస వస్తువులపై వేసే పన్నులపై రాష్ట్రాలకు రావలసిన పన్నువాటా పరిహారం కింద రెండు మాసాలకు ఒకసారి రాష్ట్రాలకు చెల్లింపులు చేయాలి. గత అక్టోబరు నుండి జిఎస్‌టి పరిహారం చెల్లింపుల్లో జాప్యం చేస్తూ వచ్చిన మోడీ ప్రభుత్వం ఇప్పుడు ఏకంగా రాష్ట్రాలకు 2.35 లక్షల కోట్ల మేరకు ఎగనామం పెట్టింది. ఆగస్టు 27న జరిగిన 41వ జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ కోవిడ్-19 వ్యాధి 'దేవుడు కల్పించింది' కాబట్టి కేంద్రం ఏమీ చేయలేదు, కావాలంటే రాష్ట్రాలు ఈ మేరకు అప్పులు తెచ్చుకోవచ్చు అని చెబుతూ రాష్ట్రాల ముందు అప్పులు తెచ్చుకోడానికి రెండు మార్గాలు సూచించారు. ఈ రెంటిలో ఏదో ఒకదాన్ని ఎంచుకోవచ్చని చెప్పారు. అసలే అప్పుల ఊబిలో కూరుకుపోయి ఉన్న రాష్ట్రాలకు ఆమె ప్రతిపాదన తల బద్దలు కొట్టుకోడానికి రెండు రాళ్లలో ఏదో ఒకటి ఎంచుకోమన్నట్లుంది.

నిజానికి జిఎస్‌టి అనేది ప్రపంచ బ్యాంకు ప్రతిపాదన. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రపంచంలోని అన్ని దేశలకూ అడ్డూఅదుపూ లేకుండా వెళ్లి ప్రజలను దోపిడీ చేయాలంటే ఆయా దేశాల్లో రకరకాల పన్నుల వ్యవస్థలు ఉండడం దానికి అడ్డంకిగా ఉంటుంది. అందుకనే నయా-ఉదారవాద ఆర్థిక విధానాల్లో భాగంగా ఒక్క భారత దేశంలోనే కాకుండా పెట్టుబడిదారీ దేశాలన్నిటిలోనూ జిఎస్‌టి తరహా పన్ను విధానాన్ని ఆయా ప్రభుత్వాలపై ఒత్తిడి చేసి ప్రవేశపెట్టింది. మన దేశంలో మోడీ ప్రభుత్వం అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి ఊడిగం చేసే ఈ పన్ను విధానానికి 'దేశభక్తి' ముసుగు వేసి 'ఒకే దేశం, ఒకే పన్ను' పేరుతో అమలు చేసింది. అనేక వస్తువులపై పన్నులు వేసే అధికారాన్ని రాష్ట్రాల నుండి కేంద్రం తీసుకుంటున్నందుకు వాటికి పరిహారం చెల్లిస్తామని పార్లమెంటులో చట్టం చేసింది. ఇప్పుడు కుంటి సాకులతో తను చేసిన చట్టాన్ని తనే ఉల్లంఘించి రాష్ట్రాలకు ద్రోహం చేస్తోంది. "దేవుడు కల్పించిన" కోవిడ్ కష్ట సమయంలో కార్పొరేట్లను ఆదుకోడానికి లక్షల కోట్ల రూపాయల ప్యాకేజీలు ప్రకటించిన ఆర్థిక మంత్రి రాష్ట్రాలకు మాత్రం మొండి చెయ్యి చూపుతున్నారు. కార్పొరేట్ సేవలో సదా మునిగిపోయిన ప్రభుతవం ఇది.

కేంద్ర ప్రతిపాదనను బిజెపి యేతర రాష్ట్రాలైన కేరళ, పంజాబ్, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌ఘర్, ఝార్ఖండ్, మహరాష్ట్ర, రాజస్థాన్, తెలంగాణా, పాండిచెరి, డిల్లీ వ్యతిరేకించాయి. బిజెపి, ఎన్డీఏ కూటమిలోని రాష్ట్రాలు సైతం మింగలేక, కక్కలేక అవస్థలు పడుతున్నాయి. రాష్ట్రాలకు చట్టపరంగా రావలసిన పన్ను బకాయిలు ఎగవేయడం అంటే ప్రజలకు ద్రోహం చేయడమే. కేంద్ర ప్రభుత్వ ఈ నిరంకుశ, విద్రోహపూరిత చర్యలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలకు ప్రజల మద్దతు కూడగట్టాలి.


**చందా వివరాలు**

విడిప్రతిక: **రూ.10**, సంవత్సర చందా:**రూ.100**, పోస్టు ద్వారా రూ. **120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

ఈ మాసం ముఖ్యాంశం

# కరోనా కాలంలో దళితులపై పెరిగిన దాడులు



రచయిత దళిత్ షోషణ్ ముక్తి మంచ్ జాతీయ ఉపాధ్యక్షులు

సుభాషిణి అలి

భారత దేశ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా మనం ఒక విషయాన్ని గుర్తించాలి. అదేమంటే మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 73 సంవత్సరాలు అయినప్పటికి కూడా ఈ దేశంలోని మెజారిటీ ప్రజానీకానికి ఆ స్వాతంత్ర్య ఫలాలు అందడంలేదు. దేశంలోని కార్మికులు, పేద ప్రజలు ముఖ్యంగా మహిళలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, ఇతర బలహీన వర్గాలు వీరందరూ స్వాతంత్ర్య ఫలాలే కాదు, స్వాతంత్రం వల్ల వారికి లభించాల్సిన హక్కులను కూడా పొందడం లేదు. అందువల్ల స్వాతంత్ర్యం కోసం నాడు ఎంతగా పోరాడామో ఈనాడు ఈ సెక్షన్ల ప్రజల కోసం అంతగానూ పోరాడాల్సిన అవసరం ఉంది.

### కరోనా మహమ్మారి పూర్వరంగంలో దళితులపై దాడులు

కరోనా మహమ్మారి సందర్భంగా ఏ ప్రభుత్వమైనా ప్రజలను ఐక్యంగా ఉంచి, వారికి ముఖ్యంగా పేద ప్రజలకు, దళితులకు రక్షణ కల్పించాలి. కాని నేడు మన దేశంలో దానికి భిన్నంగా జరుగుతున్నది. కేంద్ర ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించిన మొదటి రోజు నుండి నేటి వరకు దేశంలో దళితులు విభిన్నమైన తరహా దాడులకు గురవుతున్నారు. కరోనా పరిస్థితిని ఉపయోగించుకుని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తన మనువాద ఎజెండాను ముందుకు తీసుకుపోయేందుకు ఈ దాడులు చేస్తోంది. బిజెపి-ఆర్ఎస్ఎస్ 'హిందూ రాష్ట్ర' ఎలా ఉండబోతుందో తెలుసుకోవాలంటే మనం ఆగస్టు 5న అయోధ్యలో జరిగిన రామమందిర నిర్మాణానికి భూమి పూజను ఒక సారి పరిశీలించాలి. ఆ కార్యక్రమం మొత్తంలో పాల్గన్న వారు ఒక్క ప్రధాన మంత్రి తప్ప మిగిలిన వారంతా బ్రాహ్మణ కులానికి చెందిన వారే. మొత్తం కార్యక్రమం నిర్వహించింది అగ్రకులానికి చెందిన వారే. వేదిక మీద కూర్చున్న వారిలో ఒక్క ప్రధాని తప్ప అందరూ దళితులే. కానీ ఈ కార్యక్రమంలో ఒక్క దళిత వ్యక్తికి కూడా స్థానం లేదు. ఈ భూమి పూజ కార్యక్రమం దరిదాపుల్లోకి దళితులను రానీయలేదు. 'హిందూ రాష్ట్ర' పేరుతో ఆర్ఎస్ఎస్-బిజెపిలు మన దేశం మీద రుద్దబోయే పరిస్థితి ఇదే.

### పారిశుధ్య కార్మికులపై దాడులు

నేను చెప్పినది ఒక్క ఉదాహరణ మాత్రమే. ఈ కరోనా కాలంలో దళితుల మీద జరిగిన దాడిని గురించి నేను సెక్షన్ల వారీగా వివరిస్తాను. ముందుగా కరోనాపై యుద్ధంలో ముందుపీఠిన నిలబడి పనిచేస్తున్న వారిని (ఫ్రంట్‌లైన్ వర్కర్స్) తీసుకుందాం. ఫ్రంట్‌లైన్ వర్కర్స్ అనగానే మనం డాక్టర్లు, నర్సుల గురించి మాట్లాడతాం. కానీ కరోనా మహమ్మారి ప్రారంభం నుండి తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న వారు పారిశుధ్య కార్మికులు. కరోనాపై ముందుండి పోరాడుతున్న వీరికి ఎటువంటి పరికరాలూ ఇవ్వలేదు. వారికి పిపిఇ కిట్లుగానీ, మాస్కులుగానీ, శానిటైజర్లుగాని ఇవ్వలేదు. వారు చాలా ప్రమాదకరమైన పరిస్థితుల్లో పనిచేస్తున్నారు. వారు నగరాలు, పట్టణాలను శుభ్రం చేయాలి. చెత్త సేకరించాలి. కరోనాతో మరణించిన వారి మృత దేహాలను తీసుకుపోయి అంత్యక్రియలు జరిపించాలి. ఇంతటి ప్రమాదకర పనులు చేస్తున్న వీరికి ఎటువంటి రక్షణ పరికరాలు ఇవ్వలేదు. అందువల్లనే కరోనా వల్ల మరణించిన తొలి ఫ్రంట్‌లైన్ కార్మికుడు ఢిల్లీలోని ఒక ఆసుపత్రిలో మరణించిన పారిశుధ్య కార్మికుడే అయ్యాడు. ఆ తరువాత అనేక మంది పారిశుధ్య కార్మికులు మరణించారు. కానీ వారి సమస్యలను మాత్రం పట్టించుకోలేదు.

గత నాలుగు మాసాలుగా దేశంలోని అనేక రాష్ట్రాల్లో, ముఖ్యంగా తమిలనాడు, ఉత్తర ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో 200 మందికి పైగా పారిశుధ్య కార్మికులు కరోనాతో మరణించారు. వారికి పరిహారం ఇచ్చారో లేదో తెలియదు. కానీ పారిశుధ్య కార్మికుల పట్ల ఎలా వ్యవహరిస్తున్నారో చెప్పేందుకు ఉత్తర ప్రదేశ్‌లోని ఒక గ్రామంలో జరిగిన ఉదాహరణ చెబుతాను. ఆ గ్రామంలో శానిటైజర్ స్ప్రే చేస్తున్న ఒక పారిశుధ్య కార్మికుడు పొరపాటున అగ్రకులానికి చెందిన ఒక వ్యక్తి కాలు తొక్కాడు. దాంతో ఆ అగ్రకులదురహంకారి రెచ్చిపోయి శానిటైజర్‌ను పారిశుధ్య కార్మికుని నోట్లో స్ప్రే చేశారు. దాంతో ఆ కార్మికుడు మరణించాడు. దేశంలో పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న పరిస్థితికి ఇది ఒక మచ్చు తునక మాత్రమే. ఇటువంటి అత్యాచారాలు వారిపై నిత్యం జరుగుతున్నా వాటిగురించి చర్చ జరుగుతున్నది చాలా తక్కువ. చాలా చోట్ల కరోనాతో చనిపోయేవారి మృత దేహాలను తీసుకుపోవడానికి వారి బంధువులే ముందుకు రావడం లేదు. అటువంటప్పుడు ఆ దేహాలను పారిశుధ్య కార్మికులే శ్మశాన వాటికలకు తీసుకుపోయి ఎంతో ప్రమాదాన్ని ఎదుర్కొని కూడా మృతదేహాలకు అంత్య క్రియలు జరిపిస్తున్నారు.

### కరోనా కాలంలో దళితులపై పెరిగిన అత్యాచారాలు

కోనా కాలంలో ప్రజలు ఒకరికొకరు సహకరించుకోవాల్సిన తరుణంలో కూడా దళితుల మీద అత్యాచారాలు తగ్గాల్సింది

పోయి పెరిగాయి. తమిళనాడు, ఉత్తర ప్రదేశ్‌లాంటి రాష్ట్రాల్లో పరువు హత్యలు జరిగినట్లు వార్తలచ్చాయి. ఆంధ్ర, తెలంగానా రాష్ట్రాల నుండి కూడా ఇటువంటి వార్తలచ్చాయి. ఈ రాష్ట్రాలే కాదు దేశం మొత్తంగా పరువు హత్యలు పెరిగాయి. కులాంతర వివాహాలు చేసుకోడానికి ముందుకొచ్చిన యువకులు హత్యలకు గురవుతున్నారు. అందువల్ల ప్రజల మధ్య సహకారం పెరగాల్సిన ఈ కాలంలో కూడా దళితులపై దాడులు తగ్గలేదు సరికదా కరోనా పరిస్థితిని ఉపయోగించుకుని వారిపై మరింత క్రూరమైన దాడులు చేస్తున్నారు.

మన దేశంలో డాక్టర్లు కూడా కులతత్వ క్రూరత్వం నుండి మినహాయించబడలేదు. ఢిల్లీలోని ఎయిమ్స్ వంటి సంస్థలో దళిత యువతిపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆమె ఫిర్యాదు చేశారు. గత రెండు సంవత్సరాలుగా ఆమెపై సీనియర్ అధికారి వేధింపులకు పాల్పడుతున్నారు. ఆమె దళిత యువతి కనుకనే ఆమె గోడు ఎవరూ వినిపించుకోలేదు. చివరికి కొన్ని పౌర సంఘాల చొరవతో కేసులో కొంత పురోగతి ఉన్నప్పటికీ ఆమెపై లైంగిక వేధింపులకు పాల్పడిన అధికారిపై ఇప్పటికీ ఎటువంటి చర్యలూ తేసుకోలేదు. ఇది మన దేశంలో దళిత డాక్టర్లపైన అందునా దేశ రాజధాని ఢిల్లీలో ఎయిమ్స్ వంటి కేంద్ర సంస్థలో జరుగుతున్న అఘాయిత్యాలు. నేటికీ ఉత్తర ప్రదేశ్‌లో ప్రతి రోజూ దళిత మహిళలపై రేప్‌లు, ఘోరమైన అత్యాచారాలు జరుగుతున్నాయి. ఇదే పరిస్థితి తెలంగాణా, ఆంధ్ర ప్రదేశ్‌లతో సహా దేశంలోని అన్ని ప్రాంతాల్లో ఉంది.

### ఉద్యోగాలు కోల్పోయిన వారిలో దళితులే ఎక్కువ

పారిశుధ్య కార్మికులు, దళిత మహిళలపై దాడులు కరోనాకు ముందునుండీ ఉన్నాయి. ఈ కాలంలో పెరిగాయి. కానీ మనం కరోనా కాలంలోనే ప్రత్యేకంగా దళితులపై పెరిగిన దాడుల గురించి కూడా తెలుసుకోవాలి. కరోనా కాలంలో లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోయిన విషయం మనందికీ తెలుసు. దీనిపై ఇద్దరు ప్రొఫెసర్లు అశ్వినీ దేశ్ పాండే, రామచంద్రన్‌లు చేసిన సర్వే వివరాలు వారం రోజుల క్రితమే వెల్లడయ్యాయి. అగ్రకులాల వారి కన్నా దళితులు, ఎస్సీలు ఎక్కువగా ఉద్యోగాలు కోల్పోయారని వారి సర్వేలో తేలింది. 2020 మార్చి నుండి 7 శాతం మంది అగ్రకులాల వారు ఉద్యోగాలు కోల్పోతే దళితుల్లో 21 శాతం మంది కోల్పోయారని వారి సర్వే తెలిపింది.

**❝ పారిశుధ్య కార్మికుల పట్ల ఎలా వ్యవహరిస్తున్నారో చెప్పేందుకు ఉత్తర ప్రదేశ్‌లోని ఒక గ్రామంలో జరిగిన ఉదాహరణ చెబుతాను. ఆ గ్రామంలో శానిటైజర్ స్ప్రే చేస్తున్న ఒక పారిశుధ్య కార్మికుడు పొరపాటున అగ్రకులానికి చెందిన ఒక వ్యక్తి కాలు తొక్కాడు. దాంతో ఆ అగ్రకులదురహంకారి రెచ్చిపోయి శానిటైజర్‌ను పారిశుధ్య కార్మికుని నోట్లో స్ప్రే చేశారు. దాంతో ఆ కార్మికుడు మరణించాడు. దేశంలో పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న పరిస్థితికి ఇది ఒక మచ్చు తునక మాత్రమే. ❞**


**కోవిడ్‌పై ముందుండి పోరాడుతూ అనేక విధాలా దాడులకు గురవుతున్న పారిశుధ్య కార్మికులు**

దళితులు ప్రధానంగా కాంట్రాక్టు కార్మికులుగా, దినసరి కూలీలుగా పనిచేయడమే దీనికి ప్రధాన కారణమని సర్వే తెలిపింది. అయితే దళితులే ఎక్కువగా కాంట్రాక్టు కార్మికులుగా, దినసరి కూలీలుగా ఎందుకు పనిచేస్తున్నారు? ఎందుకంటే వారి విద్యా ప్రమాణాలు చాలా తక్కువ కాబట్టి. వారి విద్యా ప్రమాణాలు ఎందుకు తక్కువగా ఉన్నాయంటే వారు దళితులు కాబట్టే. వారి పౌష్టికాహార ప్రమాణాలు తక్కువ. వారిలో చాలా మంది పాఠశాల విద్య కూడా పూర్తి చేయలేకపోతున్నారు. అందువల్ల దళితులు అనేక విధాలా వివక్షకు గురవుతున్నారు గనుకనే నేడు కరోనా సమయంలో వారే ఎక్కువగా ఉద్యోగాలు కోల్పోయి, నిరుద్యోగులుగా మారారు.

### వలస కార్మికులూ దళితులు

కరోనా సమయంలో నిరుద్యోగంతోపాటు మనకు కనిపించిన మరో పెద్ద సంక్షోభం వలస కార్మికులది. వలస కార్మికులు కోట్ల సంఖ్యలో ఉన్నారు. ఎవరీ వలస కార్మికులు? అతక్యధిక వలస కార్మికులు ఆదివాసీలు, దళితులేనని సూరత్, అహమ్మదాబాద్ నగరాల్లో చేసిన సర్వేల్లో తేలింది. అందువల్ల మనం వలస కార్మికుల సమస్యను ఆదివాసీ, దళిత కార్మిక సమస్యగానే, వారి బాధలుగానే చూడాలి. ఉదాహరణకు స్వగ్రామాలకు నడిచి వెళుతూ మధ్య ప్రదేశ్‌లో రైలు కింద పడి చనిపోయిన 16 మంది వలస కార్మికులు 'కోల్' తెగకు చెందిన ఆదివాసీలు. అలాగే ఝార్ఖండ్‌లోని తన స్వగ్రామానికి తిరిగి వెళుతూ ఆహారం లేక మరణించిన మహిళ కూడా ఆదివాసీ మహిళే. ఎన్నో బాధలకు ఓర్చుకుని వారు వందల కిలోమీటర్లు నడిచి ప్రయాణించారు. ఆహారం, మంచినీరు అందక మరణించారు. భూ స్వాముల వేధింపులకు తాళలేక పట్టణాలకు వచ్చిన ఆదివాసీలు, దళిత కార్మికులే నేడు ఇలా బాధల పాలయ్యారు.

గ్రామాలకు తిరిగి వచ్చిన వలస కార్మికులను క్వారంటైన్ కేంద్రాల్లో పెట్టారు. ఇక్కడ కూడా దళితులు, ఆదివాసీలు వివక్షకు గురయనట్లు సర్వేల్లో తేలింది. గ్రామాలకు వచ్చిన అగ్రకుల వలస కార్మికులను వారి ఇళ్లల్లో ఉండడానికి అనుమతిచ్చిన అధికారులు దళితులను, బలహీన వర్గాల వారిని మాత్రం అమానుషమైన పరిస్థితులున్న క్వారంటైన్ కేంద్రాలకు బలవంతంగా తరలించారు. ఆ కేంద్రాల్లో సరైన ఆహారం లేదు, సరైన పారిశుధ్యం లేదు. ఆ విధంగా దళితులు స్వగ్రామాలకు వచ్చిన తరువాత కూడా బాధలు పడాల్సి వచ్చింది.

వలస కార్మికుల్లో సర్వే చేసినప్పుడు వారిలో అనేకమందికి రేషన్ కార్డులు గానీ, ఆధార్ కార్డులు గానీ సరైన గుర్తింపు కార్డులు కానీ లేవని తేలింది. అందువల్ల వారికి రేషన్ కూడా అందలేదు. కేంద్ర ప్రభుత్వం వద్ద గోదాములలో పెద్ద ఎత్తున ఆహారధాన్యాల నిల్వలు మూలుగుతున్న విషయం మనందరికీ తెలుసు. కానీ ఆ ధాన్యాలను పేద ప్రజలకు ఉచితంగా పంచడానికి మాత్రం ప్రభుత్వానికి చేతులు రాలేదు. దళితులు, ఆదివాసీలకు సరైన గుర్తింపు

> **“ కరోనా వల్ల దళిత ప్రజలు ఎదుర్కొంటున్న మరో సమస్య దళిత పిల్లల చదువుల సమస్య. మన దేశంలోని పేద ప్రజల్లో ఒక సర్వే చేసినప్పుడు 20 మంది ఉన్నత కుల పేదలకు ఇంటర్నెట్ అందుబాటులో ఉంటే దళితుల్లో కేవలం 10 శాతం మందికి మాత్రమే ఇది అందుబాటులో ఉందని తేలింది. దీనర్థం ఏమిటి? మన దేశంలోని విస్తారమైన పేద ప్రజల, మరింత విస్తారమైన దళిత ప్రజల పిల్లలు ఆన్‌లైన్ చదువులకు దూరంగా ఉన్నారని అర్థమవుతుంది. ”**

కార్డులు లేవు కాబట్టి వారే ఎక్కువ మంది ప్రభుత్వ రేషన్ పొందలేకపోయారు. వలస కార్మికుల్లో మహిళలు కూడా ఉన్నప్పటికీ ప్రధానంగా పురుషులు ఎక్కువ మంతి ఉంటారు. వలస కార్మికుడు అంటే ఒక వ్యక్తి మాత్రమే కాదు మొత్తం కుటుంబం అతని మీద ఆధారపడి ఉంటుంది. అందువల్ల వలస కార్మికుని ఉద్యోగం పోయినా, వారికి రేషన్ అందకపోయినా బాధపడేది ఒక వ్యక్తి మాత్రమే కాదు, మొత్తం కుటుంబాలు బాధల పడతాయి, ఆకలి పాలవుతాయి.

**ఆన్‌లైన్ చదువులకు దూరం**

కరోనా వల్ల దళిత ప్రజలు ఎదుర్కొంటున్న మరో సమస్య దళిత పిల్లల చదువుల సమస్య. మన దేశంలోని పేద ప్రజల్లో ఒక సర్వే చేసినప్పుడు 20 మంది ఉన్నత కుల పేదలకు ఇంటర్నెట్ అందుబాటులో ఉంటే దళితుల్లో కేవలం 10 శాతం మందికి మాత్రమే ఇది అందుబాటులో ఉందని తేలింది. దీనర్థం ఏమిటి? మన దేశంలోని విస్తారమైన పేద ప్రజల, మరింత విస్తారమైన దళిత ప్రజల పిల్లలు ఆన్‌లైన్ చదువులకు దూరంగా ఉన్నారని అర్థమవుతుంది. ఈ ఏడాది మార్చి నుండి విద్య అంతా ఆన్‌లైన్‌లో జరుగుతోంది. అంటే స్మార్ట్ ఫోన్‌లేనివారు, ఇంటర్నెట్ కనెక్షన్ లేనివారు విద్యకు దూరమై పోతారు. అయితే కొన్ని రాష్ట్రాలు ఈ విషయంలో కొన్ని చర్యలు తీసుకున్నాయి. కేరళల్లో పిల్లలందరికీ ఆన్‌లైన్ విద్య అందించేందుకు పెద్ద ప్రయత్నం జరిగింది. ఆ రాష్ట్రంలో ప్రతి గ్రామం, ప్రతి పంచాయితీలో టెలివిజన్ ఏర్పాటు చేశారు. ప్రతి విద్యార్థి ఆన్‌లైన్ విద్యకు హాజరయ్యేట్లు ప్రయత్నించారు. కొన్ని స్థానిక చానళ్లు కూడా విద్యాబోధనలో పాల్గన్నాయి. అందువల్ల కేరళలో దాదాపు పిల్లలందరికీ ఆన్‌లైన్ విద్య అందించబడింది. కానీ భారత దేశంలోని ఇతర రాష్ట్రాల్లో ముఖ్యంగా వెనుకబడిన బీహార, ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్‌లలో పరిస్థితి ఈ విషయంలో దయనీయంగా ఉంది. దేశం మొత్తం మీద చూసినప్పుడు దాదాపు 90 శాతం మంది దళిత పిల్లలు ఆన్‌లైన్ విద్యకు దూరమైపోయారు. దీనికి ప్రభుత్వాలేమి చేస్తాయి అని కొంతమంది మాట్లాడుతున్నారు. కానీ ప్రభుత్వాలు పేదలకు, దళితులకు టివీ, ఇంటర్‌నెట్ అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలి. అలా చేయడం అసాధ్యమేం కాదు. బిజెపి బీహార్ ఎన్నికల్లో ప్రచారం కోసం ప్రతి గ్రామంలో ఒక టివి తెర ఏర్పాటు చేసింది. దాని ఎన్నికల ప్రచారం కోసం చేసింది కానీ ఆ గ్రామాల్లో పిల్లల చదువుల కోసం మాత్రం ఆ పనిచేయలేకపోయింది. అదీ బిజెపి విధానం. వారికి ప్రజల విద్య ప్రధానం కాదు, దాని ఎన్నికల ప్రచారం ప్రధానం. అందువల్ల ఈ రోజు దళిత పిల్లలకు చదువు దూరం కావడం అనేది ఒక పెద్ద సమస్య. దేశంలోని దళిత గ్రూపులు, సంస్థలు ఈ విషయం మీద దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

**దళిత వ్యతిరేక నూతన విద్యా విధానం**

కరోనా మహమ్మారి పరిస్థితిని అనుకూలంగా తీసుకుని బిజెపి కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని ప్రకటించింది. గతంలో నూతన విద్యా విధానం ముసాయిదాపై లక్షలాది సూచనలు వచ్చాయి. కానీ వాటిలో ఎన్నిటిని పరిగణనలోకి తీసుకున్నారోగానీ చివరికి నూతన విద్యా విధానాన్ని ప్రకటించారు. ఈ విధానలోని అన్ని అంశాల జోలికి పోవడం లేదు. కానీ అది దళిత వ్యతిరేక విధానం అని మాత్రం చెప్పగలను. దళిత వ్యతిరేకమైనదే కాదు, ఆదివాసీ వ్యతిరేకమైనది చివరిగా నేను చెప్పేదేమంటే అది పూర్తిగా మనువాది విద్యా విధానం. ఎందుకంటే అది ప్రభుత్వ విద్య గురించి మాట్లాడలేదు. భవిష్యత్తులో మన ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఎలా ఉంటుందో పేర్కొనలేదు. వాళ్లు ఎంతసేపూ విద్య ప్రయివేటీకరణ గురించి మాట్లాడారు. ప్రయివేటు విద్య ప్రజలకు పేదలకు అందుబాటులో ఉండదు. నూతన విద్యా విధానంలో వాళ్లు దళిత, గిరిజన విద్యార్థులకు, వెనుకబడిన తరగతులు పిల్లలకు స్కాలర్‌షిప్పుల గురించి పేర్కొనలేదు. రిజర్వేషన్ల గురించి అందులో ఒక్క మాట కూడా చెప్పలేదు. కానీ విద్యలో రెండు రకాల ప్రవాహాల గురించి పేర్కొన్నారు. మొదటి ప్రవాహం మామూలు విద్య, రెండవది వృత్తి విద్య. పాఠశాల స్థాయిలోనే రెండు ప్రవాహాలు ఉంటాయి. అంటే మన దేశంలో ఎప్పటినుండో వస్తున్న విధంగా దళితులు, ఆదివాసీలు, ఓబీసి విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే వృత్తి విద్యలోకి నెట్టబడతారు. ఆ విధంగా మనువాద సిద్ధాంతాన్ని నూతన విద్యా విధానం రూపంలో ప్రజలపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారు. ఇటువంటి ప్రమాదాలు దాగి ఉన్న నూతన విద్యా విధానంతో దళితులకు, పేదలకు తీవ్రమైన నష్టం పొంచి ఉన్నది.

ఆ విధంగా కరోనా సమయంలో బిజెపి ప్రభుత్వం విద్యారంగంలో తెచ్చిన రెండు అంశాలు దళితులను విద్యకు దూరం చేసే ప్రమాదాన్ని తెచ్చిపెట్టాయి. మొదటిది, ఆన్‌లైన్ విద్య వల్ల దళితులు, ఆదివాసీలు, పేద వర్గాల ప్రజల పిల్లలు విద్యకు దూరమవుతారు. రెండవది, నూతన విద్యా విధానం వీరిని విద్యకు దూరం చేసే విధంగా ఉన్నది కనుక దళితుల అభ్యున్నతి మరింత దెబ్బతింటుంది. ఎందుకంటే పేద వర్గాలు కాస్తో కూస్తో పైకి రావాలంటే విద్య ఒక్కటే వారికి మార్గం. ఆ విద్య దూరమైనాక వారికి అభివృద్ధి చెందే అవకాశాలే లేకుండా పోతాయి.

**రిజర్వేషన్లపై దాడి**

బిజెపి ప్రభుత్వం అటు ఉద్యోగాల్లోనూ, ఇటు చదువుల్లోనూ రిజర్వేషన్లపై కూడా పెద్ద ఎత్తున దాడులు చేస్తోంది. బిజెపి అధికారంలోకి వచ్చింది మొదలు దళితులు ఉన్నత విద్యలోకి రాకుండా దాడులకు పాల్పడుతున్న విషయం మనకు తెలుసు. తెలంగాణాలో రోహిత్ వేముల ఉదంతాన్ని చూస్తే ఈ ప్రభుత్వం ఉన్నత విద్యలో దళిత, ఆదివాసీ, పేద విద్యార్థుల కెరీర్‌ను ఎలా సంస్థాగతంగా హత్య చేస్తున్నదో అర్థమవుతుంది. ఇది రోహిత్ వేములతో ఆగిపోలేదు. అనేక రాష్ట్రాల్లో దళిత విద్యార్థులకు తగిన సమయంలో స్కాలర్‌షిప్పులు ఇవ్వకుండా చేశారు. సరైన సమయంలో వారికి అడ్మిషన్లు ఇవ్వకుండా చేశారు. వారికి ఉన్న హక్కులు

వారు అనుభవించకుండా చేశారు. ఇదంతా అన్ని రాష్ట్రాల్లో జరుగుతూనే ఉంది. కరోనా కాలంలో కోర్టులు ఇస్తున్న తీర్పులు, ప్రభుత్వం జారీ చేసిన కొన్ని ఆదేశాలు ఈ దాడుల తీవ్రతను తెలియజేస్తున్నాయి. దళితులకు రిజర్వేషన్లు అమలు కాకుండా చేయడం కోసం ప్రభుత్వం అనేక మార్గాలు అనుసరిస్తోంది. వీటికి సంబంధించిన విషయాలు ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నాయి. ఉదాహరణకు దేశంలో ఐఎఎస్, ఐపిఎస్, ఐఆర్ఎస్ వంటి ఉన్నత ఉద్యోగాలకు ఎంపిక చేసే యుపిఎస్‌సి పరీక్షల్లో రాత పరీక్షలో దళిత విద్యార్థులు మంచి మార్కులు సంపాదించినప్పటికీ వారికి ఇంటర్వ్యూలో తక్కువ మార్కులు వేసి ఉద్యోగాలకు దూరం చేస్తున్నారు. ఇంటర్వ్యూ మార్కులు బయటకు చెప్పరు గనుక వారి ఆటలు సాగుతున్నాయి. అందుకే దళిత, గిరిజన, ఓబిసి విద్యార్థుల పట్ల వివక్ష సాగుతున్న దన్న భావన ఏర్పడింది కనుకనే రాత పరీక్షల మార్కులతోబాటు, ఇంటర్వ్యూ మార్కులు కూడా వెల్లడించాలన్న డిమాండ్ పెరుతోంది. రెండోది, బిజెపి ప్రభుత్వం యూనివర్శిటీల్లో రిజర్వేషన్లను తొత్తడం చేయడం ద్వారా దళిత, గిరిజనులు అధ్యాపకులుగా, ప్రొఫెసర్లుగా చేరకుండా పరిమితులు విధిస్తోంది. గతంలో లెక్చరర్లు, ప్రొఫెసర్ల నియామకాకు మొత్తం యూనివర్శిటీని యూనిట్‌గా తీసుకుని రిజర్వేషన్లు అమలు చేసేవారు. ఇప్పుడు దాన్ని ఆయా విభాగాల వారీగా విభజించడం వల్ల రిజర్వేషన్ల సంఖ్య తగ్గిపోయింది.

**❝ దళితులకు రిజర్వేషన్లు అమలు కాకుండా చేయడం కోసం ప్రభుత్వం అనేక మార్గాలు అనుసరిస్తోంది. ఉదాహరణకు దేశంలో ఐఎఎస్, ఐపిఎస్, ఐఆర్ఎస్ వంటి ఉన్నత ఉద్యోగాలకు ఎంపిక చేసే యుపిఎస్‌సి పరీక్షల్లో రాత పరీక్షలో దళిత విద్యార్థులు మంచి మార్కులు సంపాదించినప్పటికీ వారికి ఇంటర్వ్యూలో తక్కువ మార్కులు వేసి ఉద్యోగాలకు దూరం చేస్తున్నారు. ఇంటర్వ్యూ మార్కులు బయటకు చెప్పరు గనుక వారి ఆటలు సాగుతున్నాయి. ❞**

### దళితులకు వ్యతిరేకంగా కోర్టుతీర్పులు

ప్రభుత్వ చర్యలతో పాటు కోర్టులు కూడా ఇటీవలి కాలంలో రిజర్వేషన్లను నీరుగార్చే విధంగా తీర్పులు చెబుతున్నాయి. ఈ సంస్థలన్నిటిలో కేంద్ర ప్రభుత్వం అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించిన విషయం మనకు తెలుసు. ఈ రిజర్వేషన్లు పేద ప్రజలకు అందితే మంచిదే. కానీ ఇప్పుడిప్పుడే బయటపడుతున్న దేమంటే, దీన్ని ఉపయోగించుకుని ఎస్సీ, ఎస్టీ, ఓబిసి కోటాలను తగ్గించేస్తున్నారు. దీన్ని ప్రభుత్వం కొన్ని తప్పుడు మార్గాల్లో అమలు చేస్తోంది. ఇక కోర్టుల విషయానికి వస్తే ఆంధ్ర ప్రదేశ్‌లోని కొన్ని గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వం గిరిజన ఉపాధ్యాయులను నియమించింది. దీనిపై కొందరు కోర్టుకు వెళ్లారు. ఈ విషయం సుప్రీం కోర్టు వరకు వెళ్లింది. సుంప్రీకోర్టు ఈ సందర్భంగా చాలా ఆందోళన కలిగించే వ్యాఖ్యానాలు చేసింది. పిటిషన్‌ను కోర్టు కొట్టి వేస్తూనే రిజర్వేషన్ ప్రాథమిక హక్కు కాదని చెప్పింది. రిజర్వేన్లు ఇవ్వడం, ఇవ్వక పోవడం అనేది రాష్ట్రాల ఇష్టం అని పేర్కొంది. రిజర్వేషన్ రాజ్యాంగపరమైన ప్రాథమిక హక్కు కాదని వ్యాఖ్యానించింది. ఇది ఒక ప్రమాదకరమైన విషయం. రెండోది, క్రీమీ లేయర్ విధానాన్ని అమలు చేయాలని చెపుతూ ఎస్సీ, ఎస్టీలు అసమర్థులన్న విధంగా వ్యాఖ్యానించింది. సుప్రీం కోర్టు ఈ విధమైన వ్యాఖ్యలు చేస్తే ప్రజలు ఇంకెవరికి చెప్పుకోవాలి. ప్రభుత్వం ఒకవైపు రిజర్వేషన్లు తగ్గించడానికి ప్రయత్నిస్తుంటే కోర్టులు దానికి మద్దతిచ్చే విధంగా వ్యాఖ్యానాలు చేస్తున్నాయి. మొత్తం మీద చూసినప్పుడు ప్రభుత్వం రిజర్వేషన్లను మొత్తంగా ఎత్తేయాలనుకుంటున్నది అన్న విషయం స్పష్టం.

### దళితుల ప్రజాతంత్ర హక్కులపై దాడి

ఇంకో ఆందోళన కరమైన ధోరణి ఏమంటే, ప్రభుత్వం ప్రజల ప్రజాతంత్ర హక్కులపై తీవ్రమైన దాడులకు పాల్పడుతుంటే ప్రజలకు రక్షణగా నిలబడాల్సిన కోర్టులు ఆ పని చేయడం లేదు. ఏడాది క్రితం కేంద్ర ప్రభుత్వం కాశ్మీర్ రాష్ట్రాన్ని విభజించి 370వ అధికరణాన్ని రద్దు చేసిన విషయం మనకు తెలుసు. ఆ కేసు సుప్రీం కోర్టులో ఉంది. ఇప్పటి వరకు అది దాన్ని విచారణకు తీసుకోలేదు. సిఎఎ విషయంలో కూడా సుప్రీం కోర్టు ఇప్పటి వరకు కేసు విచారణకు స్వీకరించలేదు. కానీ భీమా కొరెగాం కేసు పేరుతో, సిఎఎకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్నారన్న సాకుతో ప్రజల ప్రజల తంత్ర హక్కులపై దాడులు దాడులు జరుగుతున్నప్పుడు మాత్రం సుప్రీం కోర్టుతో సహా అనేక కోర్టులు వీటికి మద్దతుగా తీర్పుఇస్తున్నాయి. ఈ కేసుల్లో బాధితులకు వ్యతిరేకంగా వాటి తీర్పులుంటున్నాయి. కామ్రేడ్ వరవరరావు పరిస్థితిని మనం చూశాం. ఆయన జైల్లో కరోనా వచ్చినప్పటికీ ఆసుపత్రిలో చేర్చకుండా ఎంతగా సతాయించారో చూశాం. ఆనంద్ తెల్తుంబ్లే, గౌతమ్ నవ్‌లఖా వంటి వారిని జైల్లో పెట్టి, హక్కులు నిరాకరించారు. వీళ్లందరినీ భీమా కొరెగాంవ్ కేసులో దళితుల పక్షాన నిలిచినందుకు అరెస్టు చేశారు. కానీ వాస్తవం ఏమిటంటే భీమా కొరెగాంవ్ ఉత్సవాల సందర్భంగా దళితుల మీద దాడి చేశారు. దళితుల మీద దాడి చేసిన వారిని వదిలిపెట్టి వారికి మద్దతుగా నిలిచిన వారిని కుట్ర కేసులో ఇరికించి నిర్బంధించారు. వారిపై నిరంకుశ చట్టాలు ప్రయోగించారు. అదే విధంగా ఢిల్లీలో సిఎఎకు వ్యతిరేకంగా శాంతియుతంగాఆందోళ చేసిన వారిపై దాడులకు తెగబడిన వారిని వదిలి పెట్టి దాడులకు గురైన వారిపై నిరంకుశ చట్టాలు ప్రయోగించారు. ఈ విధంగా దళితుల హక్కుల కోసం పోరాడే వారిపై నిరంకుశ చట్టాలు ప్రయోగించి వారి ప్రజాతంత్ర హక్కులను కాలరాస్తున్నారు. కరోనా పరిస్థితుల్లో దేశంలో దళితులు, ఆదివాసీలు, పేద ప్రజల ప్రజల ప్రజాస్వామిక హక్కులపై ఈ విధమైన దాడులు జరుగుతున్నాయి.


బిజెపి ప్రభుత్వం ఒకవైపు దళితులు, ఆదివాసీలు, ఇతర పేద ప్రజల హక్కులపై దాడులు చేస్తూ మరోవైపు తన అధికారాన్ని ఉపయోగించుకుని ఈ హక్కుల కోసం పోరాడుతున్న వామపక్షాలకూ, దళితులకూ మధ్య అంతరం సృష్టించడానికి ప్రయత్నిస్తోంది. కుల వివక్షవ్యతిరేక పోరాట సమితి (కెవిపిఎస్) వంటి సంస్థలు ఈ విషయాలను గమనించాలి. అటు వామపక్షాలకూ, దళిత సంఘాలకూ మధ్య ఐక్యత ఏర్పాటు చేయడానికి అవి ప్రయత్నించాలి. ఇక్కడ కెవిపిఎస్, తమిళనాడులో అస్పృశ్యతా నివారణ వేదిక, ఇంకా ఇతర రాష్ట్రాల్లోని ఇటువంటి సంఘాలు ఇటువంటి దాడుకు వ్యతిరేకంగా వామపక్షాలు, దళితులు ఇతర పేద ప్రజల మధ్య విశామైన ఐక్యత సృష్టించడానికి తీవ్రంగా కృషి చేయాల్సిన అవసరం ఉంది.

**(అనువాదం: ఎస్. వెంకట్రావు)**

ఈ మాసం ప్రత్యేం

# భారత్-చైనా సరిహద్దు వివాదం

**జాన్ చెరియన్**



రచయిత ఫ్రంట్‌లైన్ పత్రిక అసోసియేట్ ఎడిటర్

భారత, చైనాల మధ్య కొన్ని దశాబ్దాలుగా నలుగుతున్న సరిహద్దు వివాదానికి కారణం వలస పాలన వారసత్వమేనని చెప్పవచ్చు. ఈ సరిహద్దు వివాదానికి వలస పాలకుల పాపమే కారణమని చైనా ప్రభుత్వం తరచుగా ప్రపంచానికి గుర్తు చేస్తున్నది. చైనాలో బలహీనమైన ప్రభుత్వం ఉన్న కాలంలో కూడా సరిహద్దు సమస్యపై బ్రిటీషు వలస పాలకులు ప్రతిపాదించిన తాత్కాలిక ఏర్పాటును తిరస్కరించారనే విషయాన్ని చైనా చరిత్రకారులు, వ్యాఖ్యాతలు గుర్తు చేస్తున్నారు. 1914లో బ్రిటీషు పాలకులు చైనా, టిబెట్ ప్రతినిధులతో సిమ్లాలో సమావేశాన్ని ఏర్పాటుచేశారు. బ్రిటీష్ వారి పాలనలో ఉన్న భారతదేశానికి, టిబెట్‌కు మధ్య సరిహద్దును నిర్ణయించేందుకు చర్చల ద్వారా ఒక ఒప్పందానికి వచ్చే లక్ష్యంతో ఈ సమావేశం ఏర్పాటుచేశారు. చైనాలో ఉన్న బలహీన కేంద్ర ప్రభుత్వాన్ని వత్తిడి చేసి ఒప్పించి టిబెట్‌కు స్వతంత్ర ప్రతిపత్తి ఇప్పించి, అనంతరం భారత్‌కు అనుకూలంగా సరిహద్దును తిరిగి మార్చాలని బ్రిటీషు వారు భావించారు.

చైనా నుంచి తొలుత టిబెట్‌ను, అనంతరం జియాంగ్‌ను వేరుచేయాలని చేయాలని బ్రిటీషు సామ్రాజ్యవాదులు పెద్ద ప్రణాళిక వేశారు. చైనాలో ఉన్న ప్రభుత్వం బలహీనమైనదే కాక, పూర్తిగా ఐరోపాలోని శక్తుల చెప్పుచేతుల్లో ఉన్నందున, వారిని సులువుగా మెడలు వంచవచ్చని బ్రిటన్ భావించింది. కాని చైనా ప్రతినిధివర్గం వారి బెదిరింపులకు, వత్తిడులకు లొంగక ఆ ప్రతిపాదనలను తిరస్కరించింది. కానీ చైనా అభ్యంతరాలను లెక్కచేయకుండా ఉత్తర సరిహద్దును వేరుచేస్తూ, తన చెప్పుచేతల్లో ఉండే టిబెట్ ప్రతినిధివర్గంతో ఒప్పందంపై బ్రిటన్ సంతకాలు చేయించింది. దానినే అనంతర కాలంలో మెక్‌మోహన్ రేఖగా పిలిచేవారు. ఆ రోజుల్లో భారతదేశంలో పనిచేసిన బ్రిటీష్ వలస పాలకులకు చెందిన అధికారి హెన్రీ మెక్‌మోహన్ పేరుతో దీనిని పిలిచారు.

తాత్కాలిక సరిహద్దును చైనా తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ బ్రిటన్ వారి మెడలు వంచేందుకు వత్తిడి తెచ్చింది. బ్రిటన్ చెప్పిన విధంగా టిబెట్, భారతదేశాల మధ్య సరిహద్దుగా మెక్‌మోహన్ రేఖను ఒప్పుకోకుంటే "తీవ్రమైన సమస్యను" ఎదుర్కొనాల్సి వస్తుందని బెదిరించింది. ఆ సమయంలో బ్రిటన్ విదేశాంగ కార్యదర్శిగా ఉన్న సర్ ఎడ్వర్డ్ గ్రే "ఒప్పందంపై సంతకాలు చేయకుంటే చైనా తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోనాల్సి వస్తుందని" హెచ్చరించారు.

చాంగ్‌కై షేక్ నేతృత్వంలోని జాతీయవాదులు, మావో నాయకత్వంలోని కమ్యూనిస్టులు మెక్ మోహన్ రేఖను గుర్తించడానికి నిరాకరించారు. టిబెట్ ప్రత్యేక దేశం కాదని, అటువంటపుడు బ్రిటన్‌తో సరిహద్దు సమస్యపై ఒప్పందం చేసుకొనే అధికారం టిబెట్‌కు లేదని వాదించారు.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన దశాబ్దకాలం వరకు స్వతంత్ర భారతదేశం, కమ్యూనిస్టు చైనాల మధ్య సుహృద్భావ వాతావరణం కొనసాగింది. చర్చల ద్వారా సరిహద్దు సమస్యను పరిష్కరించుకోవాలని చైనా ప్రయత్నించినప్పటికి, వలస పాలకులు నిర్ణయించిన మెక్‌మోహన్ రేఖ సరిహద్దుగా ఉండాలని నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పట్టుబట్టారు.

### చౌ ఎన్ లై పర్యటన

సరిహద్దు వివాదానికి సానుకూల పరిష్కారం కనుగొనేందుకు చివరగా చైనా ప్రధాని చౌ ఎన్ లై 1960లో భారతదేశం సందర్శించారు. చైనా ప్రభుత్వం మెక్‌మోహన్ రేఖ వరకు గల అరుణాచల్‌ప్రదేశ్‌పై భారతప్రభుత్వ హక్కును గుర్తించేందుకు అంగీకరించింది. అందుకు ప్రతిగా అక్సాయ్ చిన్ వరకు చైనాకు గల హక్కును భారతదేశం గుర్తించాలని కోరింది. నెహ్రూ ఆ ప్రతిపాదనకు తిరస్కరించి, సరిహద్దు సమస్యపై కఠినవైఖరిని అవలంభించారు.

సరిహద్దు సమస్యపై నెహ్రూ అనుసరించిన రాజీ లేని వైఖరి కారణంగా ఆనాడు భావావేశాలు రగలడానికి కారణమైంది. అప్పట్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ అటు పార్లమెంటులోనూ, ఇటు అన్ని రాష్ట్రాల్లోనూ తిరుగులేని అధికారం చలాయించింది. కేవలం జన్‌సంఘ్ (అనంతర కాలంలో భారతీయ జనతాపార్టీగా మారింది), రామ్‌మనోహర్ లోహియా నేతృత్వంలో కొద్దిమందితో ఉన్న సోషలిస్టు విభాగం, టిబెట్ స్వాతంత్ర్యానికి మద్దతు పలికేవారు సరిహద్దు సమస్యపై పార్లమెంటులో తీర్మానానికి వ్యతిరేకంగా ఓటువేశారు.

పశ్చిమ దేశాలతో పాటు భారతదేశంలోని మితవాద, సోషల్ డెమొక్రటిక్ పార్టీలు టిబెట్ స్వాతంత్ర్యం ''ప్రధాన సమస్య''గా భావించేవారు. దలైలామా చైనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి 1959లో భారతదేశంలో రాజకీయ ఆశ్రయం పొందడం బీజింగ్‌కు కోపకారణమైంది. భారత ప్రభుత్వ సహకారం, పశ్చిమ దేశాల ఆర్థిక మద్దతుతో టిబెట్ ప్రవాస ప్రభుత్వం ఏర్పాటైంది. టిబెట్ సమస్యపై అటువంటి పరిస్థితి ఏర్పడటాన్ని చైనా కమ్యూనిస్టు పార్టీ వాంఛించలేదు. ఈ కారణాల రీత్యా రెండు వైపులా గడ్డు పరిస్థితులు నెలకొన్నాయి.

1956లో టిబెట్‌లో ఆరంభమైన అమెరికా సిఐఎ కార్యకలాపాల కారణంగా సరిహద్దు సమస్య పరిష్కారంలో భారతదేశం చొరవ చూపించడం లేదనే అనుమానం బీజింగ్ వర్గాల్లో ఏర్పడిందన్న అభిప్రాయాన్ని దలైలామా

> **❝ సరిహద్దు వివాదానికి సానుకూల పరిష్కారం కనుగొనేందుకు చివరగా చైనా ప్రధాని చౌ ఎన్ లై 1960లో భారతదేశం సందర్శించారు. చైనా ప్రభుత్వం మెక్‌మోహన్ రేఖ వరకు గల అరుణాచల్‌ప్రదేశ్‌పై భారతప్రభుత్వ హక్కును గుర్తించేందుకు అంగీకరించింది. అందుకు ప్రతిగా అక్సాయ్ చిన్ వరకు చైనాకు గల హక్కును భారతదేశం గుర్తించాలని కోరింది. నెహ్రు ఆ ప్రతిపాదనకు తిరస్కరించి, సరిహద్దు సమస్యపై కఠినవైఖరిని అవలంభించారు. ❞**



**1962 నాటి భారత్-చైనా యుద్ధ దృశ్యం**

పెద్ద సోదరుడు గ్యాలో తొండప్ వ్యక్తం చేశాడు. 1962 యుద్ధం అనంతరం తొండప్ నాయకత్వంలో జరిగిన గెరిల్లా పోరాటానికి అమెరికన్ సిఐఎ ఆర్థిక సహకారంతో పాటు శిక్షణ కూడా ఇస్తున్నట్లు తెలిసినప్పటికీ భారత అధికార వర్గాలు పట్టించుకోలేదు. టిబెట్ స్వాతంత్ర్యానికి న్యూఢిల్లీ మద్దతిస్తున్నదన్న భావన 1962లో భారతదేశంపై చైనా యుద్ధానికి దిగడానికి ప్రధాన కారణాల్లో ఒకటిగా పేర్కొనవచ్చు.

**'ముందడుగు విధానం'**

నెహ్రూ 'ముందడుగు విధానం' ప్రకటించారు. చైనా ప్రజా విముక్తి సైన్యం (పిఎల్ఎ) అధీనంలోని భూభాగంలో భారత సైనిక కేంద్రాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది. దాంతో 1962లో యుద్ధం వచ్చింది. భారతదేశానికి హక్కుందని చెబుతున్న అన్ని ప్రాంతాల నుంచి చైనా సైన్యాన్ని తరిమేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇది చాలా పొరపాటు అంచనా. చైనాతో గల వివాదం మరింతగా పెరగడానికి 'ముందడుగు విధానం' కారణమని 1962 భారత, చైనా యుద్ధంపై భారత ప్రభుత్వం నియమించిన హెండర్‌సన్ బ్రూక్స్ నివేదిక పేర్కొంది. ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న ఆ నివేదికలోని సమాచారం ప్రకారం నెహ్రూ 'ముందడుగు విధానానికి' తగిన స్థితిలో భారత సైన్యం లేదు. నెహ్రూ సాహసిక సైనిక విధానంతో టిబెట్‌ను భారత్ చైనాల మధ్య "బలహీన దేశం"గానే ఉంచాలనుకున్నారు. ఇది బ్రిటిష్ సామ్రాజ్యవాద విధానం కొనసాగింపే అని చైనా భావించింది.

టిబెట్ సమస్య పట్ల నెహ్రూకు సానుభూతి ఉన్న విషయం ఎవరూ కాదనలేరు. అదే సమయంలో 1951లో టిబెట్ స్వాతంత్ర్యం కోసం ఉమ్మడి కార్యాచరణ చేయాలన్న అమెరికా ప్రతిపాదనను భారతదేశం తిరస్కరించిందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. భారతదేశం 1954లో టిబెట్‌పై చైనా సార్వభౌమత్వాన్ని అంగీకరించింది. అయితే న్యూఢిల్లీ దలైలామాను బీజింగ్ నుంచి మరింత స్వాతంత్ర్యం పొందేందుకు ప్రోత్సహించింది. 1959లో దలైలామా అనుచరులు లాసాలో జరిపిన తిరుగుబాటులో నెహ్రూ ప్రభుత్వ పాత్రను బీజింగ్ తప్పుపట్టింది. నెహ్రూ దలైలామాకు పంపిన సందేశంలో భారతదేశంలో ఆయనకు రాజకీయ ఆశ్రయం కల్పిస్తామని చెప్పారు.

సిఐఎలో కీలకమైన పదవులు నిర్వహించి, ఈ ప్రాంతానికి సంబంధించిన అంశాలలో నిపుణుడైన బ్రూస్ రిడిల్ రచించిన "జెకెఫ్ ఫర్గాటెన్ క్రైసిస్: టిబెట్, సిఐఎ అండ్ సినో-ఇండియన్ వార్ (2017)" గ్రంథంలో సిఐఎ, టిబెట్‌లోని ఇతరులూ చేసిన కుయుక్తుల కారణంగా భారతదేశంపై దాడి చేయడానికి మావో నిర్ణయం తీసుకున్నాని పేర్కొన్నారు. అమెరికా చర్యలు "ప్రచ్ఛన్న యుద్ధ ఎత్తుగడల్లో" భాగమని, సోషలిస్టు దేశాల ప్రతిష్టను తగ్గించడానికేనని అనంతర కాలంలో దలైలామా పేర్కొన్నారు. టిబెట్‌లోని వేర్పాటువాదులకు 1957 నుంచి 1961వరకు సిఐఎ చురుకుగా సహాయం చేయడం భారత నిఘా సంస్థల సహకారం లేకుండా సాధ్యం కాదు.

లడఖ్ సరిహద్దుల్లో ఇటీవల తాజాగా భారతసైన్యానికి, పిఎల్ఎకు మధ్య జరిగిన ఘర్షణ 1962 నాటి వివాదం సమయంలో తలెత్తిన పరిస్థితుల మాదిరిగా పూర్తిస్థాయి యుద్ధానికి దారితీయవచ్చని, "చైనాతో అమెరికా యుద్ధంలోకి వెళ్లే వీలుంది"అని రిడిల్ ఒక వ్యాసంలో ప్రస్తావించారు. 1962లో చైనా దాడి తరువాత సహాయం చేయమని కోరుతూ జాన్ ఎఫ్.కెనడీకి నెహ్రూ సందేశం పంపారు. 1962 యుద్ధం జరిగిన వెంటనే భారతసైన్యాన్ని రక్షించేందుకు అమెరికా, బ్రిటన్‌లు విమానాల ద్వారా ఆయుధాలను అందజేశారని రిడిల్ తన వ్యాసంలో రాశారు. అయినప్పటికీ అది సైనిక ఓటమిని నిరోధించలేకపోయింది. కెన్నడీ పరిపాలనా కాలానికి సంబంధించిన డాక్యుమెంట్లను బట్టి 350 అమెరికా యుద్ధవిమానాలను, 10,000 మంది వైమానిక దళ సిబ్బందిని సహాయంగా పంపి చైనా లక్ష్యాలను ఛేదించాలని నెహ్రూ అమెరికాను కోరినట్టు తెలుస్తోంది. కెనడీ నిర్ణయం తీసుకోవడం కంటే ముందే చైనా సైన్యం తాను హక్కు కోరుతున్న ఆక్సాస్‌చిన్ మినహా తాము ఆక్రమించుకున్న అత్యధిక భారత భూభాగం నుంచి ఉపసంహరించుకుంది. 1962లో భారతదేశం చైనాతో యుద్ధంలో ఉన్న పరిస్థితిని ఆసరా చేసుకుని పాకిస్తాన్ కాశ్మీర్‌ను ఆక్రమించేందుకు ప్రయత్నం చేస్తే ''పాకిస్తాన్ జోక్యాన్ని యుద్ధ చర్యగా పరిగణిస్తామని కెన్నెడి హెచ్చరించారని" ఆయన రాశారు.

**1967లో ఘర్షణ**

ఈ యుద్ధంలో చైనా సైన్యం భారత సరిహద్దులోకి చాలాదూరం చొచ్చుకుని వచ్చింది. దాదాపు నెల రోజుల పాటు యుద్ధం

> **"తప్పుడు అవగాహనతో అనవసరమైన ఘర్షణలకు దారి తీయకుండా ఉండేందుకు "వాస్తవాధీన రేఖ పొడవునా శాంతి సామరస్యాలను కాపాడేందుకు" 1993లో భారత చైనాల మధ్య "లాండ్‌మార్క్ ఒప్పందం" కుదిరింది. సరిహద్దు వివాదాలను బలప్రయోగంతో కాకుండా చర్చల ద్వారా పరిష్కరించుకునేందుకు ఈ ఒప్పందం ఇరు పక్షాలకు విశ్వాసం కలిగించే దిశగా జరిగింది."**

కొనసాగింది. తర్వాత చైనా యుద్ద విరమణను ప్రకటించింది. మెక్‌మోహన్ రేఖకు బదులుగా వాస్తవ నియంత్రణ రేఖను (ఎల్‌ఎసి) అధికారికంగా నిర్ధారించారు. రెండు దేశాల మధ్య 1967లో నాథులా, చోలా వద్ద తీవ్రమైన ఘర్షణ జరిగింది. అప్పుడు కూడా ఇప్పటి మాదిరిగానే నియంత్రణ రేఖపై రెండు వైపులా భిన్నమైన వైఖరిని తీసుకున్నారు. భారత చైనా సైనికుల మధ్య ముష్టిఘాతాలతో మొదలైన ఘర్షణ అప్పట్లో కాల్పులకు దారితీసింది. 140 మందికి పైగా భారత సైనికులు చనిపోయారు. చైనా పక్షంలో కూడా పెద్దసంఖ్యలోనే చనిపోయారు. గాల్వన్ లోయలో జూన్ 15న ఇరు పక్షాల మధ్య జరిగిన తీవ్రమైన ఘర్షణ చిట్టచివరిది. ఇరు పక్షాల మధ్య పలు సందర్భాలలో ఘర్షణ వాతావరణం ఏర్పడినప్పటికీ విచక్షణతో వ్యవహరించారు. 1986లో తూర్పు ప్రాంతంలోని అరుణాచల్‌ప్రదేశ్‌లో తవాంగ్ వద్ద భారత సైన్యం నిర్వహించిన సైనిక కవాతు సందర్భంగా తప్పుడు అవగాహన ఘర్షణకు దారితీసింది. పోరాటానికి సన్నద్ధమయే సమయంలో నిరోధించారు.

### 1993 ఒప్పందం

తప్పుడు అవగాహనతో అనవసరమైన ఘర్షణలకు దారి తీయకుండా ఉండేందుకు "వాస్తవాధీన రేఖ పొడవునా శాంతి సామరస్యాలను కాపాడేందుకు" 1993లో భారత చైనాల మధ్య "లాండ్‌మార్క్ ఒప్పందం" కుదిరింది. సరిహద్దు వివాదాలను బలప్రయోగంతో కాకుండా చర్చల ద్వారా పరిష్కరించుకునేందుకు ఈ ఒప్పందం ఇరు పక్షాలకు విశ్వాసం కలిగించే దిశగా జరిగింది. రెండు వైపులా వాస్తవాధీన రేఖ వెంట సైన్యాన్ని తగ్గించడానికి ఇరు పక్షాలు కట్టుబడి ఉండాలనుకున్నాయి. అదనంగా 1996, 2005, 2013లలో సరిహద్దు ఒప్పందాలు జరిగాయి.

కానీ రెండు దేశాల మధ్య నిర్ణయం కాని సరిహద్దుల వద్ద చిన్న సంఘటనలు, కొన్ని సందర్భాలలో కొంచెం తీవ్రంగా ఉండే సంఘటనలు గత కొన్నేళ్లలో చోటు చేసుకున్నాయి. అయినప్పటికీ గత 35 సంవత్సరాల కాలంలో ఒక్క తుపాకీ కూడా పేలలేదు. కానీ అతివాద జాతీయ నాయకునిగా నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి, చైనా అధ్యక్షునిగా జిన్‌పింగ్ యంత్రాంగంపై పట్టు బిగించిన తర్వాత వాస్తవాధీన రేఖ వెంట వేడి పెరిగింది. అక్సాయ్‌చిన్‌ను ఆనుకుని ఉన్న ప్రాంతంలో భారతసైన్యం మౌలిక సదుపాయాల నిర్మాణం చేపట్టటం, అన్ని కాలాల్లో ప్రయాణించేందుకు అనువైన రోడ్లు, విమానాశ్రయాల ఆధునికీకరణ తదితర అంశాలతో చైనా సైన్యంలో అప్రమత్తత పెరిగింది.

1998లో పోఖ్రాన్ అణు పరీక్షలు నిర్వహించిన సందర్భంలో అధికారంలో ఉన్న నేషనల్ డెమొక్రాటిక్ అలయెన్స్ ప్రభుత్వం వ్యూహాత్మకంగా చైనా భారత దేశానికి కీలక శత్రువని బాహాటంగా చేసిన ప్రకటనను చైనా మరచిపోలేదు. ప్రధాని వాజ్‌పేయి నాటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్‌కు పోఖ్రాన్ పరీక్షలు నిర్వహించడం వెనుక గల కారణాలను వివరిస్తూ లేఖ రాశారు. "మేము అణ్వాయుధాలు గల దేశం కావడానికి కారణం మా పొరుగున అణ్వాయుధాలతో ఉన్న దేశం 1962లో సైనికదాడి చేసింది. వారితో మా సంబంధాలు గత దశాబ్దకాలంలో మెరుగుపడినప్పటికీ అపరిష్కృతంగా ఉన్న సరిహద్దు సమస్యల కారణంగా అపనమ్మకానికి ఆస్కారం ఉంది"అని ఆ లేఖలో నిష్కర్షగా పేర్కొన్నారు.

అనంతరం అధికారంలోకి వచ్చిన యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయెన్స్ (యుపిఎ) పదేళ్ల పాలనా కాలంలో ఎల్‌ఎసి వెంట ఎలాంటి ప్రధాన సమస్యలు ఉత్పన్నం కాలేదు. అయితే ఆ కాలంలోనే భారత-చైనా సరిహద్దు వెంటు రహదారులు (ఐసిబిఆర్) నిర్మించడం పెద్ద ఎత్తున ఆరంభమైంది. సరిహద్దుల్లో భారత్ చైనాల మధ్య వివాదం ఉన్న 73 చోట్ల రోడ్ల నిర్మాణానికి యుపిఎ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. యుపిఎ ప్రభుత్వం అమెరికాతో రక్షణ ఒప్పందంపై సంతకం చేయడంతో పాటు అణు ఒప్పందం కుదుర్చుకోవడంతో కీలకమైన విదేశాంగ విధానం, రక్షణ సమస్యలు, ప్రత్యేకించి చైనాకు సంబంధించిన సమస్యలపై వాషింగ్టన్‌కు దగ్గరయింది.

చైనాకు వ్యతిరేకంగా "కేంద్రీకరించే విధానం"లో భాగంగా తూర్పున నమ్మకమైన భాగస్వామి కోసం బారక్ ఒబామా పాలనా యంత్రాంగం వెతుకుతున్న సమయంలో భారత ప్రభుత్వం అందుకు అనువుగా లభించింది. సరిహద్దుల్లో భారత్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేసుకుని చైనాకు వ్యతిరేకంగా ఆసియా పసిఫిక్ ప్రాంతంలో అమెరికా నౌకాదళంతో కలిసి జోడు కట్టాలని అమెరికా కోరుకున్నది. యుపిఎ ప్రభుత్వం వాస్తవాధీన రేఖ వెంట శాశ్వత నిర్మాణాలను చేయడమే కాక బలగాలను బలోపేతం చేసి, 70,000 మంది పర్వతప్రాంతాలలో పనిచేసే సైనికదళాల ఏర్పాటుకు అనుమతినిచ్చింది.

డోక్లాం సంఘటన అనంతరం మోడీ ప్రభుత్వం రోడ్ల నిర్మాణాన్ని మరింత త్వరితం చేసింది. అన్ని కాలాల్లో ప్రయాణించేందుకు వీలుగా సైన్యం దార్బక్-సయోక్-దౌలత్ బేగ్ ఒల్డీ రోడ్డును నిర్మాణం చేస్తున్నందువల్లనే గాల్వన్ ఘర్షణ జరిగిందని వ్యాఖ్యాతలు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. ఆ రహదారి కారాకోరం దారికి దగ్గరగా ఉండి టిబెట్‌ను ఝున్‌జియాన్‌తో కలిపే ప్రాంతానికి చాలా సమీపంలో ఉంది. ఆ రహదారి చైనా-పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ (సిపిఈసి) ప్రాజెక్టు, బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టు-బిఆర్ఐ-నిర్మాణానికి చాలా కీలకమైనది. గిల్‌జిట్-బాల్టిస్థాన్ నుండి కారిడార్ పోతుంది. భారతదేశం గిల్గిట్ బాల్టిస్థాన్‌పై ఇప్పటికీ హక్కు వదులుకోని

### సంబంధాలు ధ్వంసం కావడం ఆరంభం

మోడీ అధికార పగ్గాలు చేపట్టిన నాటి నుంచి భారత్-చైనా సంబంధాలు చెడిపోవడం మొదలయింది. తొలిసారిగా ప్రధాని ప్రమాణ స్వీకార కార్యక్రమానికి దలైలామా ప్రవాస

ప్రభుత్వాన్ని ఆహ్వానించారు. తన ప్రచారంలో భాగంగా టిబెట్ సమస్య, వాస్తవాధీన రేఖ విషయంలో కాంగ్రెస్ పార్టీ కఠినంగా వ్యవహరించలేదని మోడీ నిరంతరంగా విమర్శించడం మొదలు పెట్టారు. బిజెపి పాలనలో భారతదేశం "టిబెట్ కార్డు"ను ఎక్కువగా వినియోగించడం ఆరంభించింది. బౌద్ధులకు అత్యంత పవిత్రమైన ప్రదేశాల్లో ఒకటైన అరుణాచల్‌ప్రదేశ్‌లోని తవాంగ్‌ను దలైలామా సందర్శించేందుకు అనుమతించారు. అరుణాచల్‌ప్రదేశ్ టిబెట్‌లోని దక్షిణప్రాంతమని, దానిపై హక్కులను తాము వదులుకోలేదని చైనా చెబుతూ వస్తున్నది. 1962లో తవాంగ్‌ను చైనా దళాలు ఆక్రమించుకున్నప్పటికీ యుద్ధవిరమణ అనంతరం ఏకపక్షంగా అక్కడి నుంచి వైదొలిగారు. 2014లో జిన్‌పింగ్ భారతదేశం సందర్శించడం, మోడీ అహ్మదాబాద్‌లో జిన్‌పింగ్‌కు ఆతిథ్యమివ్వడంతో సంబంధాలు తిరిగి మొదలయ్యాయి.

> **"డోక్లాం సంఘటన అనంతరం 2018లో వూహాన్‌లో భారత్, చైనాశిఖరాగ్ర సమావేశం జరిగింది. ఉద్రిక్తతలను నివారించేందుకు ఆ సమావేశంలో మోడి, జిన్‌పింగ్‌లు ఒక అంగీకారానికి వచ్చారు. 2019లో చెన్నయ్‌లో ప్రాంతీయ, అంతర్జాతీయ సహకారాన్నిపెంపొందించేందుకు కట్టుబడి ఉంటామని ప్రకటించారు. ప్రపంచంలోని రెండు పెద్ద దేశాల నాయకుల మధ్య ఉన్న ఈ సామరస్యం ఈ సమావేశం అనంతరం ఆరునెలల్లో ఆవిరైపోయింది."**



లడఖ్ లోని గాల్వన్ లోయలో భారత్–చైనా సైనికాధికారుల మధ్య వాగ్వాదం

2017లో డోక్లాంలో జరిగిన సంఘటన చైనాను ఆశ్చర్యపరిచింది. అదే యేడాది అక్టోబరులో చైనా కమ్యూనిస్టు పార్టీ 19వ జాతీయ మహాసభ ఏర్పాట్లలో చైనా నాయకత్వం తలమునకలై ఉంది. నిర్మానుష్యమైన హిమాలయ పర్వత సానువుల్లో రెండు దేశాల సైన్యం రెండు నెలలకు పైగా తలపడింది. ఆ వివాదం జరిగిన ప్రదేశం భారత్, భూటాన్, చైనాలకు ఉమ్మడి సరిహద్దుగా ఉన్న వివాదాస్పద ప్రాంతం. అక్కడి నుంచి "ఉపసంహరించుకునేందుకు" ఉభయపక్షాలు అంగీకరించడంతో సమస్య తాత్కాలికంగా సద్దుమణిగింది. డోక్లాం నిజానికి చైనా, భూటాన్‌ల మధ్య వివాదాస్పద ప్రాంతం. చివరగా తెలిసిన సమాచారం ప్రకారం చైనా ఆక్రమించుకున్న ప్రాంతాల్లో పిఎల్ఎ శాశ్వత నిర్మాణాలను చేపట్టింది.

పొరుగున ఉన్న రెండు పెద్ద దేశాల మధ్య వచ్చిన వివాదంలో భూటాన్ తెలియకుండా చిక్కుకుపోయింది. ఇప్పుడు చైనాతో తమకున్న సరిహద్దు సమస్యను ఆ దేశం సొంతంగా పరిష్కరించుకునే పనిలో పడింది. డోక్లాం సంఘటన అనంతరం 2018లో వూహాన్‌లో భారత్, చైనాశిఖరాగ్ర సమావేశం జరిగింది. ''సక్రమంగా విభేదాలను నియంత్రించుకునేందుకు'', తమ సైనిక బలగాలకు "కీలకమైన మార్గదర్శకత్వం" చేయడం ద్వారా సంస్థాపరంగా వాటిని బలోపేతం చేసి సరిహద్దుల్లో ఉద్రిక్తతలను నివారించేందుకు ఆ సమావేశంలో మోడి, జిన్‌పింగ్‌లు ఒక అంగీకారానికి వచ్చారు. ఆ ఇద్దరు నాయకులు 2019లో చెన్నయ్‌లో కలిసి ప్రాంతీయ, అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించేందుకు కట్టుబడి ఉంటామని ప్రకటించారు.

ప్రపంచంలోని రెండు పెద్ద దేశాల నాయకుల మధ్య ఉన్న ఈ సామరస్యం ఈ సమావేశం అనంతరం ఆరునెలల్లో ఆవిరైపోయింది. జూన్ 15 సంఘటనలో 20 మంది భారత సైనికులు చనిపోవడంతో రెండు వైపుల ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి వచ్చినప్పటికీ ఎల్ఎసి వెంట ఉద్రిక్తతలను తగ్గించేందుకు చర్చలు కొనసాగుతున్నాయి.

చైనా సైన్యం తాను ఆక్రమించిన కొన్ని ''వత్తిడి ఉన్న ప్రాంతాల'' నుంచి ఉపసంహరించుకుంది. రెండు సైన్యాలకు మధ్య ఒక తటస్థ ప్రాంతాన్ని ఏర్పాటు చేశారు. జూలై మూడో వారంలో వాస్తవాధీన రేఖ వెంట వివాదానికి అవకాశం ఉన్న ప్రాంతాల వద్ద మానవ రహిత వైమానిక (యుఎవిలు) వాహనాలను వినియోగించరాదని అంగీకారం కుదిరింది. అంతకు ముందే నెలరోజుల పాటు ఉద్రిక్త ప్రాంతాల్లో కాలినడక తనిఖీలు నిలిపివేయాలని రెండు సైన్యాలు ఒప్పందానికి వచ్చాయి. జూన్ మొదటివారం నుంచి ఇరుపక్షాలకు చెందిన సైనికాధికారులు నాలుగుసార్లు చర్చలు సాగించారు.

ఈ ఏడాది ఆరంభంలో ఉన్న యదాతథ స్థితిని పునరుద్ధరించాలని భారతదేశం కోరుతున్నది. భారత రక్షణమంత్రి రాజనాథ్‌సింగ్ జులై మూడోవారంలో లడఖ్‌లో పర్యటించిన సమయంలో చర్చలకు మరికొంత సమయం పడుతుందని, అనుకున్న ఫలితాలు సాధించలేకపోవచ్చని ధృవీకరించారు.


జులై మొదటివారంలో భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ ఈ ల మధ్య జరిగిన చర్చలలో రెండు పక్షాలు ఒప్పుకున్న మేరకు సైన్యాన్ని ఉపసంహరించే ఒప్పందాన్ని అమలుచేయాలని భారత విదేశాంగ శాఖ జులై 23న చేసిన ప్రకటనలో కోరింది. ఇటీవల ఆక్రమించుకున్న పాన్‌గాంగ్ సో సరస్సు ప్రాంతాన్ని చైనా సైన్యం వదిలివెళ్లలేదు. సరిహద్దు సమస్యపై సమగ్ర ఒప్పందం కుదిరి, రెండు పక్షాలు ఇచ్చిపుచ్చుకునే పద్ధతిలో వ్యవహరిస్తేనే పరిష్కారం సాధ్యమౌతుంది.

**(అనువాదం: జి ఆంజనేయులు)**

**చరిత్ర**

# సంస్కృత భాష: ప్రాచీనత, వాస్తవ చరిత్ర

**ఎంవిఎస్ శర్మ**


రచయిత ప్రజాశక్తి సంపాదకులు

మన దేశంలో బహు భాషలున్నాయి. భారతదేశంలో ప్రజలు మాట్లాడే భాషలను ప్రధానంగా నాలుగు భాషా కుటుంబాలుగా విశ్లేషించవచ్చు. అవి (1) సైనో–టిబెటన్, (2) ఆస్ట్రో–ఆసియాటిక్, (3) ద్రవిడ, (4) ఇండో–యూరపియన్. మొదటి మూడు భాషా కుటుంబాలకూ సంబంధించిన భాషలు మన దేశంలో ఏయే ప్రాంతాల్లో వాడుకలో ఉన్నాయో గత వ్యాసంలో చెప్పుకున్నాం. ఇప్పుడు ఇండో–యూరపియన్ కుటుంబానికి సంబంధించిన భాషల గురించి ముచ్చటించుకుందాం.

ఇండో–యూరపియన్ భాషలనే ఇండో–ఆర్యన్ భాషలు అని కూడా అంటారు. దక్షిణ ఆసియాలో అత్యధిక జనాభా మాట్లాడే భాషలు ఇండో–ఆర్యన్ భాషలే. హిందూస్థానీ (హిందీ, ఉర్దూ భాషలను మాట్లాడే రూపం) మరాఠీ, గుజరాతీ, బెంగాలీ, పంజాబీ, సింధీ, ఒరియా, అస్సామీ, సింహళ, నేపాలీ వంటి భాషలన్నీ ఈ భాషా కుటుంబానికి చెందినవే. ఉత్తర భారతదేశంలో చిట్టచివర నున్న కాశ్మీర్ లో మాట్లాడే కాశ్మీరీ భాష కూడా ఇదే కోవకు చెందినది. పాకిస్థాన్ లో మాట్లాడే పాష్తో, బెలూచీ భాషలు, వాయవ్య ఆఫ్ఘనిస్థాన్ లో మాట్లాడే నూరిస్థానీ భాషలు కూడా ఈ భాషాకుటుంబానికే చెందుతాయి.

**ఆర్యులు అన్న పదం జాతిని సూచించదు**

ఇండో–ఆర్యన్ భాషాకుటుంబానికి చెందిన అత్యంత ప్రాచీన రూపాలు ఋగ్వేదంలో, అవేస్త లో ఉన్నాయి. ఈ రెండు గ్రంథాలలో ఉపయోగించిన భాషలు చాలా సన్నిహితంగా ఉన్నాయి. వీటి ఆధారంగా ఇండో–ఆర్యన్ భాషల ఆదిమరూపాన్ని భాషా పరిశోధకులు పునర్నిర్మించవచ్చు. "ఆర్య" అని ఋగ్వేద భాషలోను, "ఐర్య" అని అవేస్తలోను వాటిన పదాలకు అర్థం ఒకటే. ఉన్నత స్థాయికి చెందిన, హోదా కల కుటుంబంలో పుట్టిన వారని అర్థం. అంటే ఈ పదాన్ని ఒక వ్యక్తి సాంఘిక హోదాను తెలియజేసేందుకు ఉపయోగించారు. అందుచేత "ఆర్య" అన్న పదం జాతిని (రేస్– ఆకారాదులను బట్టి ప్రత్యేకతలు ఉన్న, ఒక కుదురు నుంచి వచ్చిన మానవ సమూహం) సూచిస్తుందన్న వాదనకు ఆధారం లేదు. ఈ "ఆర్య" పదం ఇండో–యూరపియన్ భాషాకుటుంబంలో ఒక ఉప భాగమైన ఇండో–ఇరానియన్ విభాగానికి సంబంధించినదే తప్ప మొత్తం ఇండో–యూరపియన్ భాషలు మాట్లాడేవారందరికీ చెందినది కాదు. ముఖ్యంగా జర్మనీ కి, ఈ "ఆర్య" పదానికి ఎటువంటి సంబంధమూ లేదు. దీనిని అప్రస్తుతంగా ఆనాడు నాజీలు ఉపయోగించారు.

**సంస్కృతం మన దేశంలో పుట్టిన భాష కాదు**

ఇండో–ఇరానియన్ భాషలు ఇండో–యూరపియన్ భాషలలో ఒక ఉప విభాగం అని గుర్తుంచుకోవాలి. తండ్రి, తల్లి, సోదరుడు, సోదరి, కూతురు వంటి అర్థాలను సూచించే పదాలు సంస్కృతం, ప్రాచీన పర్షియన్, గ్రీకు, లాటిన్, జర్మన్ భాషలలో చాలా దగ్గర పోలికలు కలిగివున్నాయి. 1786లో భాషా పరిశోధకుడు సర్ విలియం జోన్స్ తొలుత ఈ విషయాన్ని ప్రకటించారు. ఆ తర్వాత జరిగిన అనేక పరిశోధనల ఆధారంగా ఆదిమ ఇండో–యూరపియన్ భాషలోని పదాలు ఏవిధంగా ఉండివుండవచ్చో పరిశోధకులు ప్రతిపాదించారు. దాని ఆధారంగా ఈ ప్రాచీన భాషను ఉపయోగించిన ప్రజలు ప్రధానంగా పశుపాలన, వ్యవసాయం చేసేవారని, గుర్రాల గురించి వీరికి తెలుసునని, రాగి, వెండి, బంగారం లోహాల గురించి కూడా తెలుసునని నిర్ధారించగలిగారు. క్రీ.పూ. 3000 నాటికి ఈ ప్రజలు అటు ఉక్రెయిన్ నుంచి ఇటు కజకస్థాన్ వరకు ఉన్న మైదాన ప్రాంతాలలో ఎక్కువగా సంచరించేవారు. దీనిని బట్టి ఇండో–యూరపియన్ లేదా ఇండో–ఆర్యన్ భాషల ప్రాచీన రూపాలు భారతదేశంలో ఆవిర్భవించాయి అని చెప్పుకోడానికి ఎటువంటి చారిత్రిక ఆధారమూలేదు. అంటే సంస్కృతం మన దేశంలో పుట్టిన భాష కాదు.

ఇండో–యూరపియన్ భాషలనుండి స్పష్టంగా ఇండో ఆర్యన్ భాషలు వేరుపడినది క్రీ.పూ.2000 కాలంలో. మెసపుటేమియా ఉత్తర భాగం (అంటే నేటి ఈశాన్య సిరియా) లో పాలించిన మిటన్ని ప్రభువులు చేసుకున్న ఒప్పందం (క్రీ.పూ.1380) రాత ప్రతి లభించింది. అందులో వారు మిత్ర, ఉరువన, ఇందర, నసాటియ వంటి దేవతల సాక్షిగా ఒప్పందం చేసుకున్నట్టు పేర్కొన్నారు. ఋగ్వేదంలో కూడా మిత్ర, వరుణ, ఇంద్ర, నాసత్య వంటి దేవతల పేర్లు ఉన్నాయి. మిటన్ని రాజు పేరు తుష్రత్త. (సంస్కృతంలో దశరథ, లేదా త్విష్రత్త). గుర్రాలకు శిక్షణ ఇవ్వడం గురించి రాస్తూ మిటన్ని పాలకులు వర్తన్న అన్న పదం వాడారు. సంస్కృతంలో వర్తన అని ఉంది. అంకెల విషయంలో ఐక, తెర, పంజ, సత్త



భారత ఉపఖండంలో ప్రజలు ఉపయోగించే భాషలు, వాటి భాషా కుటుంబాలు

వంటి పదాలు ఏక, త్రయ, పంచ, సప్త వంటి సంస్కృత పదాలకు దగ్గరగా ఉన్నాయి. ఇదంతా చూస్తే మిటన్ని పాలకులు, ఋగ్వేద ప్రజలు వేరుపడి కొద్దికాలమే అయివుండాలి. అప్పటికే గుర్రం మచ్చిక అయి వుండాలి.

బెలూచిస్థాన్ పశ్చిమ–వాయవ్య ప్రాంతంలో క్రీ.పూ.1800–1400 మధ్య ఉండిన స్వాత్ సంస్కృతిలో, ఉత్తర బెలూచిస్థాన్ లోఇ పిరాక్ సంస్కృతి (క్రీ.పూ. 1600–1400) లో గుర్రాలను

ఉపయోగించిన స్పష్టమైన ఆధారాలు లభించాయి. ఉక్రెయిన్, దక్షిణరష్యా, కజకస్థాన్ ప్రాంతాల్లో గుర్రాలను క్రీ.పూ.2200–1700 మధ్యనే ఉపయోగించిన ఆధారాలున్నాయి. దీనిని బట్టి గుర్రాలను మచ్చిక చేయడం అక్కడి నుండే ఆఫ్ఘనిస్థాన్ ప్రాంతానికి వచ్చివుండాలి.


గుర్రాలను మచ్చిక చేయడం తెలిశాక రథాలనుపయోగించడం కూడా మొదలవుతుంది. ఇక ఆ తర్వాత ఆ జన సమూహాలు సంచరించగల సామర్థ్యం కూడా పెరుగుతుంది. ఆ విధంగా ఇండో–ఆర్యన్ భాషలు మాట్లాడే ప్రజలు వాయవ్య ప్రాంతంలో (స్వాత్, పిరాక్) ఉంటూ అక్కడినుండి పంజాబ్ ప్రాంతానికి వచ్చి ఉండాలి. అవేస్త లో రథి అంటేను, సంస్కృతంలో రథం అంటేను అర్థం ఒకటే. గుర్రాల మచ్చిక, రథాల వినియోగం తెలిసిన కాలం (క్రీ.పూ. 1500 సుమారు) ఋగ్వేద ప్రజలు సింధు ప్రాంతానికి రావడం మొదలుపెట్టిన కాలం సుమారుగా ఒకటేనని నిర్ధారించవచ్చు. ఋగ్వేదంలో స్వాత్ ప్రాంతాన్ని సువాస్తు అని పేర్కొన్నారు. ఆఫ్ఘనిస్థాన్ ప్రాంతాన్ని వివరంగా వర్ణించారు. సింధు ప్రాంతంలో ప్రవేశించిన తరవాత కూడా కొంత కాలం వరకూ అటువైపు వాడిన భాషనే కొనసాగించి, ఆ తరవాతే క్రమంగా మార్పులు చేసివుండాలి.

ఈ విధంగా సింధు ప్రాంతంలో ప్రవేశించిన ప్రజలు ఇక్కడి స్థానిక ప్రజల కన్నా తక్కువ సంఖ్యలోనే ఉండివుండాలి. సింధు ప్రాంతంలో నాగరికత ఉచ్ఛ స్థితిలో ఉన్నప్పుడు సుమారు 40 లక్షల జనాభా

ఉండేది. ఆ నాగరికత బలహీన పడిన కారణంగా అందులో సగానికి సగం అక్కడినుంచి తరలిపోయినా ఇంకా 20 లక్షలవరకూ ఉండివుండాలి. వారితో వెలుపలనుంచి వచ్చిన వారు (ఋగ్వేద ప్రజలు) కలిసిపోయారు. ఈ ఋగ్వేద ప్రజల సంఖ్య పదుల వేలల్లోనే ఉండాలి. ఎందుకంటే వారు వచ్చినది పర్వత ప్రాంతాలనుండి. అక్కడ హెచ్చు సంఖ్యలో ప్రజలు జీవించే ఆస్కారం లేదు. ఈ

> **ఇండో-ఇరానియన్ భాషలు ఇండో-యూరపియన్ భాషలలో ఒక ఉప విభాగం అని గుర్తుంచుకోవాలి. తండ్రి, తల్లి, సోదరుడు, సోదరి, కూతురు వంటి అర్థాలను సూచించే పదాలు సంస్కృతం, ప్రాచీన పర్షియన్, గ్రీకు, లాటిన్, జర్మన్ భాషలలో చాలా దగ్గర పోలికలు కలిగివున్నాయి.**

కారణాలను పరిశీలిస్తే ఋగ్వేద ప్రజలు ఇక్కడ ప్రజలతో సంపర్కం పెట్టుకుని వారితో కలిసి పోయివుండాలి. అంతే కాని, ఇక్కడి ప్రజా సమూహాలను ప్రభావితం చేసి ఏకంగా ఇక్కడి మానవజాతిలో జన్యుపరంగా మార్పులకు కారకులయేందుకు ఎటువంటి ఆస్కారమూ లేదు. అందుచేత జన్యుపరంగా ఆర్యులు గొప్పజాతి అని, తక్కినవారు అధమజాతి అని చెప్పుకోడానికి కూడా ఎటువంటి ఆస్కారమూ లేదు. ఐతే ఇక్కడ సింధు నాగరికత బలహీన పడడంతో బాటు సింధు పాలకులు ఉపయోగించిన లిపి కూడా కనుమరుగవడంతో ఇండో–ఆర్యన్ లిపి, భాష ఇక్కడ వ్యాపించడానికి, స్థానిక ద్రవిడ పదాలను కూడా స్వీకరించి మరింత స్థిరపడడానికి వీలు కలిగింది. అందుకే ఋగ్వేదంలో కొన్ని ద్రవిడ పదాలు కూడా కలిసివున్నాయి.




అశోకుడి కాలంలో ప్రాకృత భాషను విరివిగా ఉపయోగించిన వైనం

**సామాన్యులు ఉపయోగించింది ప్రాకృతమే**

ఋగ్వేదంలో ఇండో–యూరపియన్ భాషా పదాలు కాకుండా, ద్రవిడ భాషా పదాలు కాకుండా మరికొన్ని పదాలు కూడా చేరాయి. అంటే సింధు ప్రాంతానికి వచ్చిన అనంతర కాలంలో వేరే తరహా భాషల నుండి స్వీకరించి వుండాలి. ఇవే ప్రాకృత భాషలు. ఈ భాషలు కూడా ఇండో–ఆర్యన్ నిర్మాణ పద్ధతిలోనే ఉన్నాయి. కాని తేడా ఉంది. వత్తులు, వట్రసుడులు వంటివి ఇండో–ఆర్యన్ భాషలలో

ఉన్నవాటిని తొలగించి ఈ భాషలలో ఉపయోగించారు. ఉదా: పుత్ర అనేబదులు పుత అన్నారు. అశ్వ బదులు అస్స అన్నారు. ఇలా పలకడానికి సరళంగా ఉండే రీతిలో ఇండో–ఆర్యన్ భాషలు సామాన్య ప్రజల్లో తేలికగా విస్తరించాయి. ( తెలుగు వ్యాకరణంలో ప్రకృతి– వికృతి అన్న విధంగా ఈ ప్రాకృత భాషల గురించి వికృతంగా చిత్రీకరించారు. ఆధిపత్య స్వభావం కలిగిన సంస్కృతం ప్రభావం మన వ్యాకరణ పండితులమీద ఎంతమేం, కు ఉండిందో దీనిని బట్టి మనకు బోధపడుతుంది) అత్యధికులు ప్రజలు ఈ ప్రాకృత భాషలనే వినియోగించారు. అతికొద్దిమంది, అది కూడా ఉన్నత, ఆధిపత్య వర్గాలకు చెందిన వారు మాత్రమే, సంస్కృతం ఉపయోగించారు. మగధ రాజ్యంలో (క్రీ.పూ.6వ శతాబ్దం), గౌతమ బుద్ధుడు, మహావీరుడు తమ బౌద్ధ, జైన మత ప్రచారంలో ఈ ప్రాకృత భాషలనే ఉపయోగించారు.

అతి కొద్దిమంది ఉపయోగించిన సంస్కృత భాషకు ప్రాచీన భాషగా పెద్ద పీట వేసి, అత్యధికులు ఉపయోగించిన పాళీ వంటి ప్రాకృత భాషలను, ద్రవిడ భాషలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిన 2020 నూతన విద్యా విధానం చారిత్రికంగా ఎంత పెద్ద తప్పో పై వివరాలను బట్టి మనం తెలుసుకోవచ్చు.

❋

**మత తత్వం**

# ఏది దేశభక్తి, ఏది జాతీయవాదం?

**ఎన్‌సి ఆస్తానా**



రచయిత రిటైర్డ్ ఐపిఎస్ ఆఫీసర్

బహిరంగంగా దేశభక్తిని ప్రదర్శించని వారిని వెంటాడి వేటాడం అనైతికం, చట్ట వ్యతిరేకం. అలాగే కావాలని బహిరంగంగా తమ దేశభక్తిని ప్రదర్శించేవారు ఎక్కువ శాతం ఆర్భాటం కోసం లేదా యుద్ధోన్మాదంతో చేస్తున్నారు.

ట్విట్టర్‌లో పెద్దఎత్తున ప్రవహించే దేశభక్తి వ్యాఖ్యలను, వారి భావజాలాన్ని గమనిస్తే ఎక్కువమంది "దేశభక్తి" "దేశపౌరుడిగా గర్వించు" "దేశం మొదట" "జాతిహితమే మొదటిది" "జాతీయ పతాకం", "ధృడమైన జాతీయవాది" "భారతమాతాకి జై" అనే పదాలను తరచుగా వినియోగిస్తుంటారు. ఇక మిగిలినవారు మరణించిన సైనికులను పొగడ్తలతో "భారతసైన్య అభిమానిని", "మా సైన్యం మాకుగర్వ కారణం", "సైన్యానికి జైహింద్" అనే పదాలను ఉపయోగించి దేశ భక్తిని ప్రకటిస్తుంటారు.

ఎందుకు వీరు తమ దేశభక్తిని తమ చొక్కాల మీద ప్రదర్శించాలనుకుంటున్నారు? ఇలా ప్రదర్శించని వారందరిని దేశద్రోహులని వీరు భావిస్తున్నారా? ఇటువంటి ప్రదర్శన చేసేవారు దేశానికి ప్రత్యేక సేవచేస్తున్నారని చెప్పడానికి ఎటువంటి ఆధారాలు లేవు. దేశం నరకం కావాలని కోరుకున్న భారతీయుడిని నేను ఇంతవరకూ చూడలేదు. దేశానికి మంచి జరగాలనే వారి కాంక్షలు నిజమే కావచ్చు. ట్విట్టర్ ఏలికలకు దేశం మీద ఉన్న ఉగ్రప్రేమ వారికి దేశభక్తిపై గుత్తాధిపత్యాన్ని ఇవ్వలేదు. వీరికి భిన్నమైన దేశభక్తి గలవారిని పాకిస్థాన్ వెళ్ళమనే హక్కు వీరికి లేదు.

ప్రజలలో దేశభక్తి, జాతీయవాదం అనేవి రెండు భిన్నమైన అంశాలు. దేశభక్తి అనేది రెండువేల సంవత్సరాల నుంచి ఉన్నభావన. జాతీయవాదం అనేది 19వ శతాబ్దపు భావన. "స్టాన్‌ఫోర్డ్ ఎన్‌సైక్లోపిడియా ఆఫ్ ఫిలాసఫీ" ప్రకారం దేశభక్తి అనేది 'స్వదేశపు బాగోగుల పట్ల ఆందోళన.' ది ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా ప్రకారం 'దేశం పట్ల నిబద్ధత.'

జాతీయవాదం అనేది ఆ దేశం యొక్క గుర్తింపు, "స్వయం నిర్ణయాధికారం కొరకు ప్రజలు కృషి చేయటం" అని స్టాన్‌ఫోర్డ్ ఎన్‌సైక్లోపీడియా పేర్కొంది. బ్రిటానికా ప్రకారం విధేయత, వ్యక్తిగత లేదా సమూహపు అవసరాలకన్నా దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వటం.

కాబట్టి ట్విట్టర్‌లో పెట్టే ఈ దేశభక్తి సూక్తులను కేవలం ఆర్భాట జాత్యహంకారం, వీరాభిమాన జాతీయత, ఉద్రేక పూరిత జాతీయ దాడులుగా మనం భావించవచ్చు. ఒక ఉన్మాదపూరిత జాతీయవాది తన దేశ వైఖరి ఎలా ఉన్నా దానిని సమర్థించటంతో పాటు తన దేశం ఎప్పుడూ, ఎటువంటి తప్పు చేయదని భావిస్తుంటాడు. దీనికి భిన్నంగా నిజమైన దేశభక్తి కలిగినవాడు, దేశాన్ని ప్రేమిస్తూనే తన దేశం ఇంకా కొన్ని విషయాల్లో అసంపూర్ణంగాను, లోటుపాట్లను కలిగి ఉందని గుర్తించి అంగీకరిస్తాడు. దేశాన్ని ప్రేమించటం ప్రతి ఒక్కరి బాధ్యత. అదే సమయంలో ఇతరులను ద్వేషించటం, వారిని అంతమొందించాలని భావించడం మానవత్వం పట్ల ఘోరమైన నేరం.

### విమర్శ-దేశాభిమానం

మహాత్మాగాంధీ, రవీంద్రనాథ్ ఠాగూర్‌ల మధ్య జరిగిన అత్యంత ప్రజాదరణ పొందిన చర్చలో జాతీయవాదానికి, జాతి విద్వేషానికి మధ్య ఉన్న సున్నితమైన అంతరాన్ని అర్థంచేసుకోవాలని ఠాగూర్ గాంధీజీకి సూచించారు. విదేశీయుల పట్ల పెరిగిన ద్వేషం తమకు భిన్నంగా ఉన్న భారతీయుల పట్ల కూడా ద్వేషంగా మారుతుందని హెచ్చరించాడు. తన స్నేహితుడు ఎఎం బోస్‌కి రాసిన ఉత్తరంలో దేశభక్తిపేరుతో మానవత్వం మీద విజయం సాధించాలని చూస్తే నేను బ్రతికి ఉన్నంతకాలం ఎట్టి పరిస్థితులలో అంగీకరించను అని ఠాగూర్ చాలా స్పష్టంగా పేర్కొన్నారు.

వియత్నాం మీద అమెరికా జరిపిన యుద్ధాన్ని అమెరికన్ ప్రజలు వ్యతిరేకించటం ఆ దేశ రాజకీయ చరిత్ర పుటల్లో ముఖ్యఘట్టంగా నిలిచింది. అయినా యుద్ధవ్యతిరేకులను దేశభక్తి లేని వారిగా, విద్రోహులుగా పేర్కొనలేదు. వ్యతిరేకత ఉన్నవారు కూడా ఒకసారి యుద్ధం మొదలయిన తరువాత దేశ పౌరులుగా వారుకూడా నిబద్ధతతో పాల్గొన్నారు. జేమ్స్ ఈ. వెస్తేడర్ ప్రకారం సైద్ధాంతికంగా యుద్ధాన్ని వ్యతిరేకించినవారు, మిలటరీలో 42 శాతం పాల్గొన్నారని, యుద్ధంలో మరణించిన వారిలో 58 శాతంగా ఉన్నారని, అందువలన వారి దేశభక్తి ఎలాంటిదో అందరికీ అర్థం అవుతుందని, యుద్ధాన్ని సమర్థించిన వారికి వీరేమీ తీసిపోలేదని తెల్పారు. అలాగే రెండో ప్రపంచయుద్ధంలో ప్రముఖపాత్ర పోషించిన జర్మనీ అడ్మిరల్ సన్‌తర్ టట్‌జన్స్, హిట్లర్ కె.ఎమ్.ఎస్, బిస్మార్క్ యుద్ధనౌకని సందర్శించినపుడు ఆయనకు నాజీ సెల్యూట్ చేయడానికి ఆయన తిరస్కరించాడు. కారణం ఆయన నాజీ విధానాలను పూర్తిగా వ్యరేకించాడు. అయినా యుద్ధంలో నౌక మునిగి పోతుండగా కెప్టెన్‌గా ఆయన కూడా మునిగి అమరుడయ్యాడు. అదీ దేశభక్తి అంటే.

### భారతమాత అంశం

"ఎవరైతే భారత్‌మాతకీ జై" అంటారో వాళ్ళే ఈ దేశంలో ఉంటారు అని 2019 డిసెంబరులో కేంద్రమంత్రి ఒకరు ప్రకటనచేశారు. దానిపై కరణ్ థాపర్ మాట్లాడుతూ రాజ్యాంగంలో భారతదేశం ఉందికాని "భారతమాత" ఎక్కడా లేదని గుర్తుంచుకోవాలన్నారు.

1971లో తీసుకు వచ్చిన జాతీయ చట్టానికి 2005లో చేసిన సవరణలో జాతీయజెండా, భారత రాజ్యాంగం గౌరవానికి భంగం కలిగించరాదని మాత్రమే పేర్కొంది. దేశాన్ని భారతమాతగా ఊహించుకోవటం

అనేది కేవలం 19వ శతాబ్దంలో కిరన్ చంద్ర బెనర్జీ నాటకం "భారత మాత", బంకించంద్ర ఛటోపాధ్యాయ నవల ఆనంద్‌మఠ్‌లలోనే ఉన్నది. కాని చట్టంలో ఎక్కడాలేదు. అందువలన మతపరంగా కాని, ఇతర కారణాల వలన కాని భారతమాత అనే దేవతా భావజాలాన్ని కాదనే వారిపై చట్ట ప్రకారం కాని, రాజ్యాంగం ప్రకారం కాని ఎటువంటి నేరారోపణ చేయజాలము.

2017 డిసెంబరులో సుప్రీంకోర్టు బెంచి (ముగ్గురుజడ్జీలు) వందేమాతరం పాటకి జాతీయగీతం 'జనగణమన"తో సమానంగా చట్టపరంగా రక్షణ కల్పించాలన్న పిటీషన్ను కొట్టివేస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పుని సమర్థించింది. ఒక పాటమీద ఉన్న ప్రేమను చట్టం ద్వారా రక్షించుకోవాల్సిన అవసరం లేదని ప్రకటించింది. మీకు గుర్తుండే ఉంటుంది. అన్ని పాఠశాలలు, ఆఫీసులు, ప్రయివేటు పరిశ్రమలలో వందేమాతరం పాడాలని 2017 నవంబరులో మద్రాసు హైకోర్టులో ఒక సింగిల్ జడ్జీ ఇచ్చిన ఆర్డరును డివిజను బెంచి కోర్టు కొట్టివేసి, మార్పులతో తీర్పుని వెలువరించింది. వందేమాతరం పాడటం తప్పనిసరి కాదని, అది ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించుకోవాలని సూచించింది. 2017 ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు ఆర్టికల్ 51ఎ జాతీయ జెండా, జాతీయ గీతం గురించి పేర్కొంది కాని జాతీయ పాట అనే దానిని గురించి పేర్కొనలేదని స్పష్టంగా పేర్కొంది.

జాతీయ గీతం తప్పనిసరిగా పాడాలనే దానిని అనేకసార్లు కోర్టులు వ్యతిరేకించాయి. జై హింద్ అనే అభివాదం 'మేజర్ జైనూర్ అబెదీన్ హసన్ సఫ్రానీ అనే ఇండియన్ నేషనల్ ఆర్మీ అధికారి రూపొందించగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ దీనిని ఉపయోగించుకున్నాడు. ఇది చాలా అర్థవంతమైన, ఉపయోగరమైన పదం. దేశీయులందరూ "భారతదేశానికి జయం" అని కాంక్షించాలి. ఇందులో దేశభక్తి, స్వదేశీ అభిమానం, జాతీయవాదం ఉన్నాయి. నా ఉద్దేశం ప్రకారం "జైహింద్" చట్టబద్దంగా విశ్వజనీనం చేయాలి. 2012 అక్టోబర్‌లో ఇండియన్ ఆర్మీ ఒక ఆర్డర్ జారీచేసింది. దాని ప్రకారం గుడ్ మార్నింగ్, గుడ్ ఈవెనింగ్ బదులు "జైహింద్" అని ఒకరినొకరు పలకరించుకోవాలి. దీనిని పారామిలటరీ దళాలు ఇప్పటికే అమలుచేస్తున్నాయి. ఇది మంచి పరిణామం. కాని బహిరంగ ప్రదేశాలలో జరిగే కార్యక్రమాలన్నీ "భారత్‌మాతాకి జై" అని మూడుసార్లు అనటంతో ముగించటాన్ని యుద్ధ నినాదంగా తన డిపార్ట్‌మెంటల్ ఆర్డర్ ద్వారా

**❝ ప్రతి పౌరుడు దేశాభివృద్ధికి తనవంతు పాత్ర నిర్వహిస్తాడు. సమాన ప్రాముఖ్యత కలిగి ఉంటాడు. సమాజంలో ఏ భాగమైనా, వ్యాపారమైనా, సేవలు అయినా ఏదీ మరొక దాని కన్నా ముఖ్యమైనదని భావించరాదు. పోలీసులు నేరస్థుల బారి నుండి కాపాడు తున్నందుకు, సైన్యం సరిహద్దులలో పహరా కాస్తున్నందుకు ప్రజలందరూ వారికి నిత్యం వందనాలు చేసే విధంగా ఉండాలని కోరుకో వటం సమంజసం కాదు. ❞**

అమలుచేసినా, చట్టపరంగా వివాదాలు రావటానికి అవకాశం ఉంది. డిపార్ట్‌మెంటల్ ఆర్డర్లను వ్యతిరేకించిన వారు కోర్టు మార్షల్ చేస్తారనే భయంతో వాటిని అమలుచేసినా, కోర్టుల పరిశీలనకు అవకాశం ఉందనే అంశాన్ని సైన్యం మరచిపోయినట్లుగా ఉంది. ఉదాహరణకి కలకత్తా హైకోర్టు డివిజను బెంచి "ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణా సమితి మరియు వెస్ట్ బెంగాల్ ప్రభుత్వం మధ్య జరిగిన కేసులో 155(6) అనే పోలీసు రెగ్యులేషన్‌ని మార్చమని, పోలీసులు ఎప్పుడూ గాలిలోకి కాల్పులు జరపరాదని ఆదేశించటం ఆర్టికల్ 14, 19 మరియు 21 లకు వ్యతిరేకం అని తేల్చిచెప్పింది.

ట్విట్టర్ బాబులు సైనికులను దేశభక్తి గల పౌరులకు ఆరాధనీయులుగా చూపిస్తూ ట్వీట్లు చేస్తుంటారు. ప్రతిరోజు భావోద్వేగ విలువలతో మనల్ని పలకరిస్తుంటారు. వారు ఇంటికి చేరినపుడు "మీ రేపటికోసం మేము ఈ రోజుని త్యాగం చేస్తాం" అని, " సరిహద్దు వెంబడి సైనికులు కాపలాకాస్తున్నారు కాబట్టే మనం హాయిగా నిద్రిస్తున్నామని" ట్వీట్‌లు చేస్తుంటారు.

సైన్యం చాలా ముఖ్యమైనదే కాని ఇతర పనులు చేసేవారు కూడా అంతే ముఖ్యమైన వాళ్ళు. సాధారణ జన జీవన ప్రవంతిలో సైన్యాన్ని అనవసరంగా భాగస్వాములను చేయటం వలన వారి నిష్పాక్షికత, రాజకీయేతర వైఖరిని హరించివేస్తుంది. ఇది ఇప్పటికే పాక్షిక సైనికులుగా ఉన్న పోలీసు యంత్రాంగాన్ని చాలావరకు ప్రభావితం చేసింది. సోషల్ మీడియా సైనికులు తమ దేశభక్తిని గురించి గాఢంగా చాటుకుంటున్న తరుణంలోనే, ఇండియన్ ఆర్మీకి 45,634 మంది సైనికుల కొరత ఉందని, అందులో 7,399 ఆఫీసర్స్ కేడర్ కూడా ఉందని వెల్లడించారు. ఈ లోటును తీర్చుకోవటానికి మూడు ఏళ్ళ నుంచి ఏడాదికి ఎనిమిది కోట్లు ప్రకటనల కోసం ఖర్చుపెడుతున్నా ఆర్మీకి కొరత తీరనేలేదు. మరి ఈ మూఢభక్తులు ఆర్మీలో ఎందుకుచేరరు? నిజానికి ఆర్మీలో చేరే మెజారిటీ పౌరులు గ్రామీణ ప్రాంతం నుండే వెళుతున్నారు. సోషల్ మీడియాలో ట్రోల్ చేసే సాంప్రదాయ పట్టణాల నుండి ఎవరు వెళ్ళడం లేదు.

**దేశాభివృద్ధిలో ప్రతి పౌరుడు భాగస్వామే**

ప్రతి పౌరుడు దేశాభివృద్ధికి తనవంతు పాత్ర నిర్వహిస్తాడు. సమాన ప్రాముఖ్యత కలిగి ఉంటాడు. మీరు గనుక ఢిల్లీలో నివసిస్తూ ఉంటే తెలుస్తుంది. రెండు రోజుల పాటు సఫాయి కార్మికులు వీధులు శుభ్రం చేయకపోతే ఢిల్లీ వీధులు ఎంత కంపుకొడతాయో మనకి తెలుస్తుంది. అందుకనే సమాజంలో ఏ భాగమైనా, వ్యాపారమైనా, సేవలు అయినా ఏదీ మరొక దాని కన్నా ముఖ్యమైనదని భావించరాదు. పోలీసులు నేరస్థుల బారి నుండి కాపాడుతున్నందుకు, సైన్యం సరిహద్దులలో పహరా కాస్తున్నందుకు ప్రజలందరూ వారికి నిత్యం వందనాలు చేసే విధంగా ఉండాలని కోరుకోవటం సమంజసం కాదు.

చట్టప్రకారం ఏ పౌరుడూ ట్రోల్స్‌కు కాని, ఇతరులకి కాని తమ దేశభక్తిని ఋజువు చేసుకోవాల్సిన అవసరం లేదు. కేదార్‌నాథ్ సింగ్ వర్సెస్ బీహార్ ప్రభుత్వం, ప్రియా పరమేశ్వరన్ పిళ్ళై వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా లేదా ఇతర కేసులలో జరిగిన విధంగా కోర్టులు ఎవరినైనా దేశద్రోహం కార్యకలాపాల్లో పాల్గొన్నారని రుజువు చేస్తే అట్టివారిని శిక్షించవచ్చు. అంతేకాని కొందరి మనసులలో ఉన్నదానిని ఆధారం చేసుకొని శిక్షలు విధించరాదు. కొందరి ఆలోచనలో ఉన్న నేరం అనే భావనను ఆధారం చేసుకొని భారతదేశంలో శిక్షించటానికి ఇది ఆర్వెల్ 1984 కాదు. విభిన్న రాజకీయ ఆలోచనలు ఉన్న వారిని వేటాడటానికి దేశభక్తిని సాకుగా చేసుకోవటాన్ని అనుమతించరాదు.

**(అనువాదం: ఎల్ఎస్ భారవి)**

అంతర్జాతీయం

# బొలీవియాలో నిరంకుశంగా నయా-ఉదారవాదం పునరుద్ధరణ

ప్రొఫెసర్ టి రవీంద్రన్
కొలంబియా యూనివర్శిటీ

అది 2019. బొలీవియా వామపక్ష అధ్యక్షుడు ఇవో మొరెల్స్‌కు వ్యతిరేకంగా అతి మితవాదశక్తులు తిరుగుబాటు చేశాయి. ఈ సంఘటన నేపధ్యంలో వర్తమాన ప్రపంచాన్ని, నయా–ఉదారవాద లక్షణాలను పరిశీలించాలి. తిరుగుబాటుదారులకు దేశంలో ప్రజా మద్దతు నామమాత్రమే. అమెరికా సామ్రాజ్యవాదుల అండదండలతో సైనిక దళాలు కుట్రతో ప్రభుత్వాన్ని కూలదోసే దుస్సాహసానికి పాల్పడ్డాయి. అక్కడ నయా–ఉదారవాదాన్ని పునరుద్ధరించేందుకు నిర్లజ్జగా పై నియంతృత్వ చర్యలకు పాల్పడ్డారు. నయా–ఉదారవాదం ఒక రాజకీయ – ఆర్థిక సిద్ధాంతంగా స్థిరపడి తన ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు జాతి దురహంకారాన్ని, మతోన్మాదాన్ని ఆశ్రయి స్తున్నది. బొలీవియాలో జరిగిన తిరుగుబాటు ఈ ధోరణికి అద్దం పడుతున్నది.

21వ శతాబ్దం ఆరంభంలో నయా–ఉ దారవాదం ఆధిపత్య స్థాయిలో వుండేది. లాటిన్ అమెరికాలో దాని జైత్రయాత్రకు అడ్డుకట్టపడింది. అక్కడ ఏర్పడిన నూతన వామపక్ష ప్రభుత్వాలు నయా–ఉదారవాద ఆధిపత్యాన్ని సవాలు చేశాయి. ఈ పరిణా మాలు వామపక్ష పునరుజ్జీవం పట్ల ఆశలు రేకెత్తించాయి. అంతేకాదు, నూతన వామపక్ష ప్రత్యామ్నాయానికి రంగం సిద్ధమౌతున్నట్లు కన్పించింది. 20వ శతాబ్దపు తన సహచర వామపక్ష పార్టీల అనుభవాల నుండి ఆ ప్రత్యామ్నాయం అనేక పాఠాలు నేర్చుకుంది. కానీ గత 5 సంవత్సరాల్లో ఈ ప్రాంతంలో వామపక్షం బలహీనపడసాగింది. బ్రెజిల్, చిలీ, ఈక్వెడార్ దేశాలు మితవాదం వైపు మళ్లాయి. వెనిజులా తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. కానీ లాటిన్ అమెరికాలోని వామపక్షానికి ఒక దారిచూపే ఆశాకిరణంలా బొలీవియా ఇప్పటికీ నిలుస్తున్నది. ఈ కాలంలో బొలీవియా వామపక్షం గత స్థాయిలో ప్రజా బలాన్ని కూడగట్టలేక పోయింది. కానీ అక్కడి వామపక్షం దేశంలో అత్యంత శక్తివంతమైన రాజకీయ శక్తిగా ఇప్పటికీ నిల్చివుంది. వామపక్ష పాలనలో గత 5 సంవత్సరాల్లో ఆర్థికాభివృద్ధిలో బొలీవియా ఈ ప్రాంతంలో వున్నత స్థాయిలో నిల్చింది. ఆర్థిక, రాజకీయ స్థిరత్వానికి ఆ దేశం ప్రతీకగా మారింది. పై నేపధ్యంలో 2019 బొలీవియా అధ్యక్ష ఎన్నికల్లో మొరెల్స్‌కు భారీ విజయం లభిస్తుందని లాటిన్ అమెరికా (ప్రపంచ వ్యాపితంగా) వామపక్షం ఆశించింది. మరో వైపున జాతీయ పాలకవర్గ మేధావులు, అమెరికా సంయుక్త రాష్ట్రాల సామ్రాజ్యవాదులు కూడా అదే మోతాదులో తాము బలపరిచే శక్తులు విజయం సాధిస్తాయని ఆశించారు.

కానీ ఈ లోగా బొలీవియాలో అనేక భయానక ఘటనలు చోటుచేసుకున్నాయి. పచ్చి మితవాద శక్తులు బలవంతంగా అధికారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు విశ్లేషణలు తెల్పు తున్నాయి. నయా–ఉదారవాదపు వర్తమాన లక్షణాలను పరిశీలించేందుకు ఈ వ్యాసంలో ప్రయత్నిద్దాం.

### కొత్త మార్గాల్లో తిరుగుబాటు

2019 ఎన్నికల్లో మొరెల్స్ విజయం సాధించారని బొలీవియా ఎన్నికల ట్రిబ్యునల్ ప్రకటించింది. కానీ ఎన్నికల్లో అవినీతి జరిగిందని ప్రతిపక్ష నాయకుడు 'కార్లోస్ మేసా' ఆరోపించి, ఫలితాలను ఆమోదించేందుకు తిరస్కరించారు. దేశంలోని అనేక నగరాల్లో నిరసనలు మొదలయ్యాయి. ఎన్నికలపై ఆడిట్ నిర్వహించి, వాస్తవాలను నిగ్గుతేల్చాలని ఆమెరికా రాజ్యాల సంస్థ (ఒఎయస్)ను బొలీవియా ప్రభుత్వం ఆహ్వానించింది. ఓట్ల లెక్కింపులో అవకతవకలు జరిగాయని, కొత్తగా ఎన్నికలు జరపాలని నవంబరు 8న సిఫార్సు చేసింది. ఎన్నికల అవకతవకలపై దేశంలో ఏకాభిప్రాయం లేదు. కానీ వాషింగ్టన్‌లోని ఆర్థిక, విధాన పరిశోధానా కేంద్రం వంటి అనేక సంస్థలు ఎన్నికలలో అక్రమాలు జరిగాయన్న ఒఎయస్ నిర్ధారణలను ప్రశ్నించాయి.

ఒఎయస్ తన ప్రాథమిక రిపోర్టును విడుదల చేసిన వెంటనే, మొరెల్స్ ఆ సిఫార్సులను ఆమోదిస్తున్నట్లు ప్రకటించారు. అందుకు అనుగుణంగా నూతన ఎన్నికల ట్రిబ్యునల్‌ను నియమించాలని, కొత్తగా ఎన్నికల నిర్వహణకు ఆదేశించాలని లెజిస్లేటివ్ అసెంబ్లీని కోరారు. కానీ ఈ లోగానే మొరెల్స్ పార్టీపై తీవ్రమైన రాజకీయ వేధింపులు, దాడులు ప్రారంభమైనాయి. ఆ పార్టీ సభ్యుల ఇళ్లను తగులబెట్టారు. వారి కుటుంబ సభ్యుల కిడ్నాప్‌లు, చిత్రహింసలు ముమ్మరమైనాయి. ఫలితంగా మొరెల్స్ పార్టీకి చెందిన సెనెటర్లు రహస్య జీవితానికి వెళ్లవలసివచ్చింది. అందువలన వారు సెనెట్ సమావేశాల్లో పాల్గొనలేని పరిస్థితులు నెలకొన్నాయి.

2019 ఎన్నికల్లో కేవలం 4శాతం ఓట్లు మాత్రమే పొందిన 'అనేజ్' దేశ అధ్యక్షురాలిగా స్వయంగా ప్రకటించుకున్నారు. తనది పరివర్తనా కాలపు ప్రభుత్వమని, దేశంలో ఎన్నికలు నిర్వహించటమే తమ ప్రభుత్వ ఏర్పాటు లక్ష్యమని అనేజ్, ఆమెపార్టీ పదే పదే ప్రకటించాయి. వారికి కీలకమైన విధానపరమైన నిర్ణయాలు చేసేందుకు ప్రజల అనుమతి లేదు. అధ్యక్షుడుగా మొరెల్స్ చేసిన అనేక ముఖ్యమైన నిర్ణయాలను తిరగదోడేందుకు వారు హడావిడి చేశారు. ఆ దేశపు సైనిక దళాలు, అమెరికా సామ్రాజ్యవాదం మద్దతుతో ఏర్పడిన ప్రజామద్దతులేని అనేజ్ ప్రభుత్వం పనితీరును పరిశీలిద్దాం. నయా వుదారవాద విధానాలను పున:ప్రతిష్టించేందుకు తీవ్ర నియంతృత్వాన్ని ప్రయోగించారు. ప్రపంచ మితవాద శక్తులూ, అమెరికా సామ్రాజ్యవాదులు అక్కడి ప్రజాస్వామ్యాన్ని ప్రసహనంగా మార్చాయి.

> **"పాత నయా-ఉదారవాద విధానాలను పునరుద్ధరించటం 'ఆనెజ్ ' ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత గల అంశం. ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేటుకు అప్పగించాలన్న తమ వుద్దేశ్యాన్ని ఎలాంటి సంకోచం లేకుండా కొత్త ప్రభుత్వం ప్రకటించింది. ప్రజాభిప్రాయం అందుకు భిన్నంగా వుందని కూడా వారికి తెలుసు. ప్రభుత్వరంగ సంస్థలు గిట్టుబాటు కావని, అవి భారీ నష్టాలతో నడుస్తున్నాయని ప్రచారంతో తమ చర్యలను సమర్ధించు కుంటున్నారు."**

### నయా–ఉదారవాదం పునరుద్ధరణ

లాటిన్ అమెరికాలో వెల్లివిరిసిన గులాబీ(పింక్) వెల్లువ ప్రభావంతో ఆ ప్రాంతంలో అనేక వామపక్ష ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. అందులో భాగంగా రూపుదిద్దుకున్న మొరెల్స్ ప్రభుత్వం నయా–ఉదారవాదుల ఆట కట్టించింది. 20వ శతాబ్దపు చివరి దశాబ్దంలో నయా–ఉదారవాద వ్యతిరేక ఆర్థిక విధానాలు ఈ ప్రాంతాన్ని ప్రభావితం చేశాయి. ఆ ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా పరంపరగా సాగిన ప్రజా సమీకరణల ఫలితమే 2005 ఎన్నికల్లో మొరెల్స్ విజయం.

2006లో గ్యాస్ నిక్షేపాలను జాతీయం చేస్తున్నట్లు మొరెల్స్ ప్రకటించాడు. అది పాక్షిక జాతీయంకరణ మాత్రమే. ఆ చర్యతో బహుళజాతి గ్యాస్ కంపెనీల నుండి బొలీవియా ప్రభుత్వానికి చెల్లింపులు పెరిగాయి. హైడ్రో కార్బన్ రంగం ద్వారా ప్రభుత్వానికి జమయ్యే ఆదాయం గతం కంటే 70 శాతం పెరిగింది. అనంతరం విద్యుత్, టెలికమ్యూనికేషన్స్, గనుల రంగాల్లో జాతీయకరణ అమలయింది. ఫలితంగా పలు రంగాల్లో ప్రభుత్వ పెట్టుబడులు 250 శాతానికి పెరిగాయి. 1999-2005 మధ్య 58.1 కోట్ల డాలర్ల నుండి 2006 -2012 మధ్య కాలంలో 204.6 కోట్ల డాలర్లకు ఆ మొత్తం పెరిగింది.

ఆర్థికరంగంలో ప్రభుత్వ పాత్ర పెరిగింది. శ్రామిక వర్గాలకు, స్థానిక జాతులకు సంపద పున:పంపిణీ చేసేందుకు ఈ చర్య దోహదపడింది. ఫలితంగా 2007-2015 మధ్య సుమారు 21శాతం మంది దుర్భర దారిద్ర్యం నుండి బయటపడ్డారు. 2005లో దేశ జనాభాలో పై స్థాయిలోని 10 శాతం మంది వద్ద, అట్టడుగులోని 10శాతం మంది వద్దకంటే 128 రెట్లు అధిక సంపద వుండేది. 2012 నాటికి ఈ తేడా 46 రెట్లకు పడిపోయింది.

వయోవృద్ధులు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, గర్భవతులకు ప్రత్యక్ష నగదు బదిలీ చేయబడింది. విద్యారంగం బడ్జెట్‌ను కూడా గణనీయంగా పెంచారు. పాఠశాలల్లో హాజరు బాగా పెరిగింది. సామూహిక విద్యాభ్యాసం కార్యక్రమం అమలు చేయబడింది. తద్వారా 5 లక్షల మంది పట్టభద్రులయ్యారు. ఆ దేశపు మూలవాసులకు భౌతిక ప్రయోజనాల కల్పన గణనీయంగా అభివృద్ధి చెందింది. మూలవాసులు ఆదాయ, వ్యయాలు ఇతరుల కంటే అనేక రెట్లు వేగంగా పెదుగుతున్నట్లు



బొలీవియా మాజీ అధ్యక్షుడు
ఇవో మొరేల్స్

2018 హిక్స్ ఆర్థిక అధ్యయన నివేదిక తెలియజేస్తున్నది. పూర్వంతో పోల్చినపుడు మొరెల్స్ పాలనలో అక్కడి జాతుల మధ్య ఆర్థిక వ్యత్యాసాలు నాల్గవ వంతుకు తగ్గిపోయాయి,

దేశంలో 'వ్యవసాయక విప్లవ' సాధన గురించి మొరెల్స్ వాగ్దానం చేశాడు. పార్దింగ్ , కోప్లిలు ఒక ముఖ్యమైన విషయం గుర్తుచేస్తున్నారు. "గత ప్రభుత్వాల కంటే ఈ కాలంలో- భూ సర్వేలు, పేర్ల నిర్ధారణ(టైట్లింగ్), భూ పంపిణీలో మూడు రెట్లు అధిక ప్రయోజనం కల్గింది. అక్రమ ఆక్రమణల్లోని కోటి ఎకరాల భూములను పున:పంపిణీ కోసం స్వాధీనం చేసుకున్నారు. నూతన వ్యవసాయ చట్టాన్ని అనుసరించి, 25,000ల ఎకరాల పరిమితికి మించి భూములున్న బడా భూస్వాముల నుండి స్వాధీనం చేసుకున్న భూములతో పాటు, రాయితీల గడువు ముగిసిన భూములను పంపిణీకి సేకరించారు. 2012 నుండి దేశంలోని మొత్తం భూమిలో 55 శాతం మూలవాసులైన పేద రైతుల అధీనంలోకి వచ్చింది.

20వ శతాబ్దపు వామపక్షాల ప్రమాణాలతో పోల్చినపుడు, మొరెల్స్ ప్రభుత్వం తీసుకొచ్చిన అనేక మార్పులు విప్లవాత్మకమైనవిగా కాక, ఎక్కువెక్కువగా సంస్కరణ స్వభావం కల్గివున్నాయి. ఉదాహరణకు రైతులకు భూపంపిణీ కార్యక్రమంలో నాణ్యమైన భూములపై యాజమాన్య హక్కుల కల్పనలో సమానత్వాన్ని సాధించలేదు. వ్యవసాయ యోగ్యమైన భూములు సాంప్రదాయక భూస్వాముల చేతుల్లోనే కేంద్రీకృతమైనాయి. మూడవ వంతు భూములు వ్యవసాయ ఆధారిత బడా పారిశ్రామిక వేత్తల వద్ద పోగుబడ్డాయి. అందుకే మొరెల్స్ విధానాలు నయా–ఉదారవాద పూర్వకాలపు విధానాలా? పునర్నిర్మాణం చేయబడిన నయా–ఉదారవాదానికి సంబంధించిన విధానాలా? అని భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఏదిఏమైనా, నయా–ఉదారవాదపు సనాతనత్వంతో మొరెల్స్ విధానాలు తెగతెంపులు చేసుకున్నాయన్న వాస్తవాన్ని విస్మరించరాదు.

పాత నయా–ఉదారవాద విధానాలను పునరుద్ధరించటం 'ఆనెజ్ ' ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత గల అంశం. ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేటుకు అప్పగించాలన్న తమ వుద్దేశ్యాన్ని ఎలాంటి సంకోచం లేకుండా కొత్త ప్రభుత్వం ప్రకటించింది. ప్రజాభిప్రాయం అందుకు భిన్నంగా వుందని కూడా వారికి తెలుసు. ప్రభుత్వరంగ సంస్థలు గిట్టుబాటు కావని, అవి భారీ నష్టాలతో నడుస్తున్నాయని ప్రచారంతో తమ చర్యలను సమర్ధించు కుంటున్నారు. కొత్తగా నియమించబడిన అధికారుల అసంబద్ధమైన విచ్చలవిడి ఖర్చుల మూలంగా కొన్ని ప్రభుత్వరంగ సంస్థలు దివాళా తీశాయి.

ఉదాహరణకు, ప్రభుత్వరంగంలోని బొలీవియా విమానయాన సంస్థ(బిఒఎ) కొత్త కార్యనిర్వహణ అధికారి (సిఇఒ) తమ సంస్థ తీవ్ర నష్టాలతో నడుస్తున్నట్లు ప్రకటించాడు.

❝ దేశ పాలనా రాజధాని 'లాపాజ్'కు ఇంధన సరఫరాను నిలిపేసేందుకు నిరసన కారులుగ్యాస్ రిఫైనరీని ముట్టడించారు. వారిని నవంబరు 19న సైన్యం దారుణంగా హతమార్చింది. మరునాడు వేలాదిమంది నిరసనకారులు నగర పౌరులను కలుపుకుని మృతుల శవపేటికలతో వూరేగింపుగా వెళ్లి నగర కేంద్రాన్ని ముట్టడించారు. పోలీసులు నిరసనకారులపై భాష్ప వాయువును ప్రయోగించి, శవపేటికలను వీధుల్లోనే వదిలేసి పారిపోయేలా చేశారు. ❞

అందుకు ఆడిట్‌పరంగా ఎలాంటి ఆధారాలు చూపలేదు. దానిపై ఆ సంస్థలోని కార్మికసంఘం ఒక పత్రికా సమావేశం నిర్వహించి, ముమ్మరంగా గిరాకీ వున్న తరుణంలో తమ సంస్థ 30 శాతం విమానాలను ఏకపక్షంగా తగ్గించిదన్న సత్యాన్ని వెల్లడించారు. ప్రైవేటు విమానయాన సంస్థ 'అమెజాన్'లో చీఫ్ ఫైనాన్షియల్ అధికారిగా వున్న వ్యక్తే ఈ కొత్త సిఇఒ. అతన్నే బిఎఒ మేనేజరు బాధ్యతల్లో నియమించారు. అమెజాన్ సంస్థకు ప్రభుత్వరంగ విమానయాన సంస్థ ప్రధాన పోటీదారుగా వుంది. ప్రభుత్వ కంపెనీల నష్టాలతో నిమిత్తం లేకుండానే కొత్త ప్రభుత్వం ప్రభుత్వ పెట్టుబడుల్లో 32.5 శాతం కోత పెట్టింది.

ఈ కుట్రలో 'లిథియం' ఖనిజం సమస్య కేంద్ర స్థానాన్ని ఆక్రమిస్తున్నది. ప్రపంచంలో ఉన్న లిథియం నిల్వల్లో షుమారు 70శాతం బొలీవియాలోనే వుంది. ఎలక్ట్రానిక్ పరికరాలు, ఎలక్ట్రిక్ కార్ల బ్యాటరీలను తయారు చేయటంలో ఈ ఖనిజాన్ని వినియోగిస్తారు. చాలా విలువైన ఒక ముడిసరుకుగా భవిష్యత్‌లో దీనికి మంచి గిరాకీ వుంటుందని మొరెల్స్ ప్రభుత్వం గమనించింది. ఈ ఖనిజాన్ని వెలికితీసి, లిథియం ఆధారిత పరిశ్రమలను ప్రారంభించాలని మొరెల్స్ ప్రణాళికలు సిద్ధం చేశాడు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో అలాంటి పరిశ్రమలను అభివృద్ధి చేయాలని భావించారు. వాటిలో ప్రభుత్వరంగ సంస్థ వైయల్‌సికి 51 శాతం వాటాలు వుంటాయని మొరెల్స్ ప్రభుత్వం నిర్ణయించింది. కానీ ఈ నిర్ణయం బహుళజాతి సంస్థలకు నచ్చలేదు. దేశంలోని ప్రకృతి సంపదలు ఆధారంగా పారిశ్రామిక అభివృద్ధిని సాధించాలని, తద్వారా తమ ప్రకృతి సంపదలకు విలువను జోడించాలన్న పథకం చాలా అద్భుతమైనది. మొరెల్స్ ప్రభుత్వం ప్రారంభించిన ఈ పథకం బొలీవియా ఆర్థిక విధానంలోనే గణనీయమైన మార్పుకు పునాదులు వేస్తుంది. అందుకు భిన్నంగా పారిశ్రామికీకరణకు బద్ధవ్యతిరేకి 'జువాన్ కార్లోస్ జులీటా'ను లిథియం ఖనిజాన్ని వెలికి తీసేందుకు వుద్దేశించిన ప్రభుత్వ రంగ కంపెనీలకు సిఇఒగా కొత్త ప్రభుత్వం నియమించింది.



బొలీవియా ప్రస్తుత అధ్యక్షురాలు అనెజ్

ఆ దేశ విదేశాంగ విధానంలో జరిగిన మార్పుకు అనుగుణంగానే ఆర్థిక విధానాల్లో కూడా మార్పులు జరిగాయి. కొత్త ప్రభుత్వం క్యూబాతో తన దౌత్య సంబంధాలను తెగతెంపులు చేసుకుంది. దక్షిణ అమెరికా దేశాల యూనియన్ (యుయన్‌ఎయస్‌యుఆర్), బొలివారియన్ అలయన్స్ ఫర్ ద అమెరికాస్ (ఎయల్‌బిఎ)ల నుండి వుపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది. ఎయల్‌బిఎ అంటే – నయావుదారవాద నమూనాకు వ్యతిరేకంగా, ఈ ప్రాంతంలోని వామపక్ష ప్రభుత్వాలు పాలనలోని దేశాల కూటమి. ఒక దశాబ్దం తర్వాత బొలీవియా అమెరికాకు తన రాయబారిని పంపించింది. వెనిజులాపై అమెరికా యుద్ధ బెదిరింపులకు బొలీవియా ప్రభుత్వం పరోక్షంగా తన మద్దతును ప్రకటించింది.

### రాజకీయ అణచివేతలు

అతి మితవాదశక్తులు బలప్రయోగంతో ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకున్న ఫలితంగా దేశంలో ప్రజా నిరసనలు వెల్లువెత్తాయి. ఈ ప్రతిఘటన ఉద్యమాల్లో మూలవాసులు అగ్రగామిగా సమీకృతులౌతున్నారు. అందుకే వారిపై కొత్త ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నది. జాతీయ అంబుడ్స్‌మెన్ (కంపెనీలు, ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులపై ప్రజల ఫిర్యాదులను విచారించి నివేదికలు తయారుచేయు ఒక అధికారి) ప్రచురించిన అధికార గణాంకాల ప్రకారం కొత్త ప్రభుత్వ కుట్రలను ప్రతిఘటిస్తున్న నిరసన వుద్యమాలపై పలు దాడులు జరిగాయి. ఆ దాడుల్లో 32 మంది నిరసనకారులు చనిపోయారు. 770 మంది తీవ్రంగా గాయపడ్డారు. అర్జెంటైనా మానవ హక్కుల కమీషన్ సభ్యులు ఇటీవల బొలీవియాలో పర్యటించారు. అక్కడ బాలలు, వృద్ధులు, వికలాంగుల హక్కులు కూడా వుల్లంఘించబడినట్లు కమీషన్ నివేదికలో పేర్కొన్నది. దేశంలో వేలాదిమంది నిర్బంధానికి గురైనారని, షుమారు 1,000 మంది అదృశ్యమైనారని, ఆ సమాచారాన్ని బైటికి వెల్లడించరాదని పాలకులు వారి బంధువులను బెదిరించినట్లు ఆ కమీషన్ సభ్యులు టివి ఇంటర్వ్యూల్లో వెల్లడించారు.

దేశ పాలనా రాజధాని 'లాపాజ్'కు ఇంధన సరఫరాను నిలిపేసేందుకు నిరసన కారులుగ్యాస్ రిఫైనరీని ముట్టడించారు. వారిని నవంబరు 19న సైన్యం దారుణంగా హతమార్చింది. మరునాడు వేలాదిమంది నిరసనకారులు నగర పౌరులను కలుపుకుని మృతుల శవపేటికలతో వూరేగింపుగా వెళ్లి నగర కేంద్రాన్ని ముట్టడించారు. పోలీసులు నిరసనకారులపై భాష్పవాయువును ప్రయోగించి, శవపేటికలను వీధుల్లోనే వదిలేసి పారిపోయేలా చేశారు.

పత్రికా స్వేచ్ఛకు తీవ్ర విఘాతం కల్గించారు. ప్రభుత్వ వ్యతిరేక వార్తలు రాస్తే దేశ ద్రోహనేరం కింద శిక్షిస్తామని కొత్త ప్రభుత్వం గదెనెక్కిన మరునాడే కమ్యూనికేషన్ల మంత్రి జర్నలిస్టులను బెదిరించాడు. దానితో బొలీవియా ప్రధాన ప్రవంతి మీడియా నోరు మూయించగల్గారు. అక్కడ జరుగుతున్న ప్రతిఘటనోద్యమాలను లోకానికి తెలియజేస్తున్న అర్జెంటీనా జర్నలిస్టులను దేశం నుండి తరిమేశారు. లైవ్ టెలివిజన్ కార్యక్రమంలో పాల్గొంటున్న ఆల్ జజీరా విలేకరులపై భాష్పవాయువు ప్రయోగించారు. ప్రభుత్వ

వ్యతిరేక నిరసనలను ప్రసారం చేస్తున్న టెలీసూర్, రుస్సియా వంటి అంతర్జాతీయ టెలివిజన్ ఛానళ్ల ప్రసారాలను నిలిపేశారు.

ప్రత్యామ్నాయ సమాచార వనరులైన గ్రామీణ ప్రాంతాల్లోని 53 సామాజిక రేడియో స్టేషన్‌లను కూడా బలవంతంగా మూసేశారు. సైన్యం, పోలీసులు అనేక చోట్ల వాటిని నాశనంచేశారు. కొన్నింటిని తగులబెట్టారు. గ్రామీణ కార్మికుల 'యునైటెడ్ సిండికల్ కాన్ఫెడరేషన్' బొలీవియాలో అతిపెద్ద 'రైతాంగ ఐక్య సంఘటన'గా ప్రజల్లో గుర్తింపు సాధించింది. ఆ సంస్థ కార్యాలయాన్ని, దాని రేడియో స్టేషన్‌పై అతి మితవాద మూకలు పేలుడు పదార్థాలు, డైనమైట్స్‌తో దాడి చేసి ఆక్రమించుకున్నాయి. ఆ రేడియో డైరెక్టర్ మోలటోవ్‌ను చెట్టుకు కట్టేసి మరీ ఈ అకృత్యానికి పాల్పడ్డారు.

"గ్రామీణ ప్రాంతాల్లోని 53 సామాజిక రేడియో స్టేషన్‌లను కూడా బలవంతంగా మూసేశారు. గ్రామీణ కార్మికుల 'యునైటెడ్ సిండికల్ కాన్ఫెడరేషన్' బొలీవియాలో అతిపెద్ద 'రైతాంగ ఐక్య సంఘటన'గా ప్రజల్లో గుర్తింపు సాధించింది. ఆ సంస్థ కార్యాలయాన్ని, దాని రేడియో స్టేషన్‌పై అతి మితవాద మూకలు పేలుడు పదార్థాలు, డైనమైట్స్‌తో దాడి చేసి ఆక్రమించుకున్నాయి. ఆ రేడియో డైరెక్టర్ మోలటోవ్‌ను చెట్టుకు కట్టేసి మరీ ఈ అకృత్యానికి పాల్పడ్డారు."



లాటిన్ అమెరికా వామపక్ష నేతలు హ్యూగో ఛావెజ్, రాఫెల్ కొర్రియాలతో ఇవో మొరేల్స్

**జాతీయోన్మాదుల ఎదురుదాడి**

బొలీవియా ప్రజానీకంలో అత్యధికులు మూలవాసుల సంతతికి చెందినవారు. కానీ ఆ దేశం ఏర్పడి రెండు శతాబ్దాల తర్వాత మాత్రమే ఆ సంతతికి చెందినవ్యక్తి దేశాధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ముందే ప్రస్తావించినట్లు, మొరెల్స్ ప్రభుత్వం చేపట్టిన పున: పంపిణీ విధానాలతో అనేక మూలవాసుల సంస్థలు లబ్ధిపొందాయి. మూలవాసుల సంతతికి చెందిన అనేకమందిని మంత్రులుగా, రాయబారులుగా, ప్రభుత్వ సంస్థల డైరెక్టర్లుగా నియమించారు. ఇవన్నీ కంటితుడుపు చర్యలుగా మూలవాసుల్లోని రాడికల్ మేధావులు కొట్టేశారు. జనాభాలో వారి సంఖ్యకు తగు నిష్పత్తిలో అధికార యంత్రాంగంలో మూలవాసుల ప్రాతినిధ్యం లేదన్నది వారి ఆరోపణ. కానీ అధికార యంత్రాంగంలో బాధ్యతలు చేపట్టిన మూల వాసుల మహిళలు ఆ సంతతి ఆత్మగౌరవానికి ప్రతీకలుగా నిలిచారు.

వేరొకవైపున శ్వేతజాతి దురహంకార మేధావులు ఈ చర్యలను తమ ఆధిపత్యంపై తీవ్రమైన ఎదురుదాడిగా భావించారు. అనేక సంవత్సరాలుగా అక్కడ జాతి విద్వేషం పెరిగి గూడుకట్టుకున్నది. 2019లో మొరెల్స్‌ను పదవీచ్యుతుణ్ణి చేయాలన్న డిమాండుతో ఆ విద్వేషం ఒక విస్ఫోటనంలా ప్రజా సమీకరణల రూపంలో వెల్లువెత్తింది. అతి మితవాద సంస్థలు వీధుల్లో స్వైర విహారం చేశాయి. మూలవాసులను చుట్టుముట్టి భౌతిక దాడులకు తెగబడ్డాయి. కేవలం చర్మం గోధుమవర్ణంగా వుందన్న సాకుతో కొత్త ప్రభుత్వ పోలీసు యంత్రాంగం మూలవాసులపై విరుచుకు పడింది. జాతివివక్షకు పాల్పడటం ఈ నిర్బంధంలో కీలక అంశంగా మారింది. తమపై సాయుధ బలగాలను వుసిగొల్పి, రంగు బేధాన్ని ఎత్తిచూపుతూ అవమానకరంగా ప్రవర్తిస్తున్నట్లు నిరసనకారులు చేసిన ఫిర్యాదులను బుట్టదాఖలా చేశారు.

బొలీవియాలోని పచ్చి మితవాద శక్తుల రాజకీయ వంశవృక్షం భయానకంగా వుంటుంది. వామపక్ష ప్రభుత్వంపై జరిగిన కుట్రలో ప్రధాన పాత్రధారి 'కమాచో'. అతడు అక్కడి యుజెసి పార్లమెంటరీ గ్రూపు నాయకుడిగా తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించాడు. యుజెసి సంస్థను 'కార్లోస్ వల్‌వెర్దే' స్థాపించాడు. అతగాడు 1970లో హ్యూగో బంజేర్ మిలిటరీ నియంతృత్వ పాలనలో పారామిలిటరీ అధికారిగా పనిచేశాడు. నాజీ జనరల్ 'బార్‌బీ'తో ఇతడు సన్నిహిత సంబంధంలో వున్నాడు. నాజీ దురాక్రమణ సమయంలో ఫ్రెంచ్ ప్రతిఘటన వుద్యమకారులను, అనేక మంది యూదులను ఆ నాజీ జనరల్ చిత్రహింసలకు గురిచేసి హతమార్చాడు. రెండవ ప్రపంచయుద్ధం తర్వాత 'బార్‌బీ' జర్మనీకి పారిపోయాడు. తర్వాత మారు పేరుతో బొలీవియాలో నివాసం ఏర్పరచుకున్నాడు. మొరెల్స్‌పై జరిగిన కుట్రలో ప్రధాన పాత్రధారుడైన 'కమాచో' మొరెల్స్ తొలి ప్రభుత్వ హయాంలో యుజెసికి నాయకత్వం వహించాడు. ఆ సంస్థకు చెందిన పారా మిలిటరీ దళాలు అనేక ఆంక్షలతో మూలవాసుల వుద్యమాలను ఆటంకపరిచాయి. కర్రలు, బ్యాట్‌లతో మూలవాసులను తీవ్రంగా గాయపరిచారు. జీపుల్లో తిరుగుతూ నగరాన్ని చుట్టుముట్టారు. అక్కడ స్వస్తిక్ చిహ్నాలను ముద్రించారు.

తనకు తానుగా కొత్త దేశాధ్యక్షురాలిగా ప్రకటించుకున్న 'అనేజ్' తాను కమాచో సైద్ధాంతిక అభిమానినని చెప్పుకుని మురిసి

> **“లాటిన్ అమెరికాలో తన ఆధిపత్యాన్ని పున: ప్రతిష్టించేందుకు నయా వుదారవాదం మతాన్ని ఒక సాధనంగా వినియోగిస్తున్నది. 2018 ఎన్నికల్లో బ్రెజిల్‌లో అధ్యక్ష పీఠాన్ని కైవశం చేసుకునేందుకు అతి మితవాద నాయకుడు ‘జైర్ బోల్సనారో మొదట మతాన్ని ప్రయోగించాడు. బొలీవియాలో కుట్ర సందర్భం గా కూడా మితవాద శక్తులు అవే పద్ధతులను అనుసరించాయి.”**

పోతుంది. తనకు ఆర్యులు, స్కాండినేవియన్ దేశాల సంతతి రూపురేఖలున్నట్లు సగర్వంగా ప్రకటించుకుంటారు. ఆమె తొలి కేబినెట్‌లో నల్గురు యుజెసి సభ్యులకు మంత్రి పదవులు కట్టబెట్టారు. దాపరికంలేని జాతి విద్వేషం కూడా ఆమె ప్రభుత్వ రాజకీయ విధానంలోని ముఖ్యమైన భాగంగా వుంది. ఉదాహరణకు తన ఉపన్యాసంలో ఇలా చెప్పారు :“ఆటవికులను” తిరిగి అధికారంలోకి రాకుండా అడ్డుకొనేందుకు, మితవాద పార్టీలు అన్నీ ఐక్యసంఘటనగా ఏర్పడాలి”. ‘ఆటవికులు’ అనేదానిని బొలీవియాలోని మూలవాసుల వెనుకబాటుతనాన్ని ఎత్తి చూపటం కోసం అధికారంలో ఉన్నవారు వినియోగిస్తుంటారు. మూలవాసీ ప్రజలకు ‘‘ఆటవికత’ ను ఆపాదించారు. దానికి నాగరికతలను అద్ది, ఆధిపత్య సంస్కృతిలో కలగలిపే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. 20వ శతాబ్దపు బొలీవియా జాతీయ నిర్మాణ ప్రాజెక్టులో ఇది ముఖ్యమైన స్థానాన్ని ఆక్రమించింది. కొత్తగా ఏర్పడిన మితవాద ప్రభుత్వం తన జాత్యహంకార ఎజెండాలోని అలాంటి ప్రణాళికలను దాచిపెట్టలేదు.

**మతం - రాజకీయాలు**

లాటిన్ అమెరికాలో తన ఆధిపత్యాన్ని పున: ప్రతిష్టించేందుకు నయా వుదారవాదం మతాన్ని ఒక సాధనంగా వినియోగిస్తున్నది. 2018 ఎన్నికల్లో బ్రెజిల్‌లో అధ్యక్ష పీఠాన్ని కైవశం చేసుకునేందుకు అతి మితవాద నాయకుడు ‘జైర్ బోల్సనారో మొదట మతాన్ని ప్రయోగించాడు. బొలీవియాలో కుట్ర సందర్భం గా కూడా మితవాద శక్తులు అవే పద్ధతులను అనుసరించాయి.

మొరెల్స్ ప్రభుత్వం అధికారం చేపట్టాక నూతన రాజ్యాంగాన్ని వెలువరించింది. దేశ చరిత్రలో మొదటిసారి ఆ రాజ్యాంగం బొలీవియాను ఒక లౌకిక రాజ్యంగా ప్రకటించింది. అప్పటి వరకూ ఎంతో కాలంగా ఆ రాజ్యపు



**బొలీవియా ప్రతిపక్ష నేత కార్లోస్ మెసెజ్**

అధికార మతంగా కొనసాగుతున్న క్యాథలిక్ మతానికున్న ఆ ప్రత్యేక హోదాను రద్దుచేసింది. దానితో పాటు మూలవాసుల సాంప్రదాయక సాంస్కృతిక క్రతువుల నిర్వహణకు ప్రభుత్వం చురుగ్గా సహకరించింది. మొరెల్స్ నేతృత్వంలోని లౌకిక రాజ్యం క్యాథలిక్ మతానికి, మూలవాసుల సాంప్రదాయ నమ్మకాలకు సమాన ప్రతిపత్తిని కల్పించింది. మూలవాసుల సాంప్రదాయ క్రతువుల్లోనూ, అనేక ప్రభుత్వ అధికార కార్యక్రమాల్లోనూ మూలవాసుల్లోని నిపుణులు పాల్గొనేలా ప్రోత్సహించారు.

ఈ చర్యలను చర్చికి చెందిన మత ఛాందసవాదులు వ్యతిరేకించారు. ‘కుట్ర’ సందర్భంగా ఆ వ్యతిరేకత స్పష్టంగా బైటపడింది. మొరెల్స్ రాజీనామా అనంతరం ‘కమాచో’ బైబిలు చేపట్టి, క్రైస్తవ మతాచార్యుని తోడ్కొని అధ్యక్ష భవనంలో ప్రవేశించాడు. అతడు ఇలా ప్రకటించాడు:“బైబిలు మరలా అధ్యక్ష భవనం లోకి ప్రవేశించింది. కానీ పచమామా ( మూలవాసుల ఆరాధనా చిహ్నం) ఇక్కడకు తిరిగి రాలేదు. కొత్త అధ్యక్షురాలు ‘అనేజ్ ’ మరింత పెద్ద బైబిల్ చేతబట్టి అధ్యక్ష భవనంలోకి ప్రవేశించి ఇలా ప్రకటించింది: “బైబిల్ మాకు చాలా ప్రాధాన్యమైనది. దేవుడే మా బలం. దేవుడే మా శక్తి”.

**ముగింపు**

21వ శతాబ్దంలో ఈ ప్రాంతం వామ పక్షం వైపు మొగ్గాక, నయా-ఉదారవాదాన్ని పున:ప్రతిష్టించటం పెద్ద మనుషులైన మేధావులకు, వారి సామ్రాజ్యవాద మిత్రులకు ప్రాధాన్యతా అంశంగా మారింది. అందుకు ప్రతి దేశంలోనూ మితవాదం భిన్న మార్గాలను అనుసరిస్తున్నది. ఆ భిన్నత్వంలోనూ, కొన్ని వుమ్మడి అంశాలను గుర్తించవచ్చు. అలాటి వుమ్మడి అంశాల్లో, మతాన్ని రాజకీయ ప్రయోజనాలకు సాధనంగా వినియోగించుకోవటం, జాతి వున్మాదాన్ని రెచ్చగొట్టడం ముఖ్యమైని. కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే నయా-ఉదారవాద విధానాలను దూకుడుగా అమలుపరచేందుకు ఆత్రంగా ప్రయత్నం చేస్తున్నది.

20వ శతాబ్దపు చివరి దశాబ్దాల్లో నయా-ఉదారవాదం ఒక రాజకీయ, ఆర్థిక సిద్ధాంతంగా యూరపు, అమెరికాల్లో తన ఆధిపత్యాన్ని స్థిరపరచుకుంది. రీగనిజం, థాచరిజం వెలుగులో సాంప్రదాయబద్ధులైన మత వాదులు, వలస ప్రజలకు వ్యతిరేకులైన జాతి వున్మాదుల చర్యలను పరిశీలించాలి. జాతి వున్మాదం, మత దురహంకారం వంటి ప్రక్రియలకు, వర్తమాన నయా-ఉదారవాదానికి పెద్ద తేడాలు లేవు. అవి లాటిన్ అమెరికా, యూరప్, అమెరికా, భారత్‌లలో తమ ప్రియతమ సహచరులతో కలసి కొనసాగుతున్నాయి. బొలీవియా అనుభవం నుండి గ్రహించాల్సిందేమిటి? పాలకవర్గ మేధావులు, వారి సామ్రాజ్యవాద మిత్రులు నయా-ఉదారవాద ఆధిపత్యాన్ని పున: ప్రతిష్టించాలన్న తీరని కోర్కెతో రగిలిపోతున్నారు. అందుకోసం ఉదారవాద ప్రజాస్వామ్యాన్ని, చట్టబద్ధ పాలన పట్ల గల నామమాత్రపు నిబద్ధతను సహితం త్యజించేందుకు సిద్ధపడ్డారు. ఈ క్రమంలో చిలీని నయా-ఉదారవాదపు తొలి ప్రయోగశాలగా మార్చారు. అక్కడ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ‘సాల్వెడార్ అలెండీ’ నేతృత్వంలోని వామపక్ష ప్రభుత్వాన్ని మిలిటరీ నియంత పినోచెట్ కుట్రతో కూల్చేశాడు. అనంతరం చికాగో వారిని తమ దేశానికి ఆహ్వానించాడు. “ నయా-ఉదారవాదంలో ఇసుమంతయినా వుదారత వుందా?” అంటూ పై పరిణామాలను పరిశీలించేవారందరూ విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

**(అనువాదం: వై సిద్ధయ్య)**

జాతీయం

# ప్రత్యామ్నాయ విధానాలే పరిష్కారం

ఎ కోటిరెడ్డి



రచయిత మార్క్సిస్టు పత్రిక బాధ్యులు

దేశ ఆర్థికవ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోతున్న తరుణంలో కోవిడ్ 19 విస్తృతంగా వ్యాపించటం ఆర్థిక కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం చూపింది. సంక్షోభ పరిష్కారాని కంటూ ప్రభుత్వం ప్రకటించిన 20.79 లక్షల కోట్ల రూపాయల ప్యాకేజి ప్రజలను మభ్యపెట్టటా నికి మినహా సమస్యల పరిష్కారానికి దోహదం చేయదని స్పష్టమైంది. ప్యాకేజిలో ప్రకటించిన పథకాలు బడ్జెట్‌లో ప్రకటించినవి, అదనంగా కొన్ని రంగాలకు రుణాలు మినహా వాస్తవంగా వివిధ వర్గాల ప్రజలకు అదనంగా అందేది 1.4 లక్షల కోట్ల రూపాయలకు మించి ఉండదు. ఈ మొత్తంతో ప్రస్తుతం దేశప్రజలు ఎదుర్కొం టున్న సమస్యలను పరిష్కరించటం సాధ్యం కాదు. రెండు నెలలకు పైగా విధించిన లాక్‌డౌన్ ఫలితంగా ఆర్థిక కార్యకలాపాలు పూర్తిగా స్థంభించిపోయాయి. లాక్‌డౌన్ సడలించటం ప్రారంభించిన తర్వాత వివిధరంగాలలో కార్య కలాపాల పునరుద్ధరణకు దశలవారీగా అనుమతి వ్వటంతో ఇప్పటికీ కోట్లాది మందికి ఏ పనులూ దొరకటం లేదు. కేసుల తీవ్రత దృష్ట్యా వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు తమ రాష్ట్రాలలో కార్యకలా పాలపై ఆంక్షలు విధిస్తున్నాయి. అందువలన పెద్దసంఖ్యలో ప్రజానీకం కనీస ఆదాయాలు కూడాలేక కడుపు నింపుకోవటానికి కూడా తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

ఇటువంటి పరిస్థితులలో ప్రజలకు ఉపాధి కల్పించటం, వారి కుటుంబాల కనీస ఆహార, ఆర్థిక అవసరాలు తీర్చటం ప్రధానం. ప్రభుత్వం అందుకు అవసరమైన మొత్తాన్ని కేటాయించి ప్రజలకు అందించాలి. ఉద్యోగాలు, ఉపాధి కల్పించటానికి తగిన చర్యలు తీసుకోవ టం ద్వారా ప్రజలకు ఆదాయాలు కల్పించాలి. అటువంటి చర్యలు తీసుకోవటం ద్వారానే సమస్యలను పరిష్కరించటం సాధ్యమౌతుంది.

**ప్రజల ఆహార అవసరాలను తీర్చాలి**

ప్రజల ఆహార అవసరాలను తీర్చటానికి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి. లాక్‌డౌన్ విధించటంతో ఉన్న ఉపాధి కోల్పోయి కనీసం అవసరమైన ఆహారాన్ని కూడా కొనుక్కోలేని పరిస్థితులలో ప్రజలున్నారు. మరోవైపున ప్రభుత్వం వద్ద కనీస నిల్వల పరిమితి 2.4 కోట్ల టన్నులకు మించి 7 కోట్ల టన్నులకు పైగా ఆహారధాన్యాల నిల్వలు ఉన్నాయి. అందు వలన ప్రభుత్వం అవసరం ఉన్న ప్రజలకు ఈ ఆహారధాన్యాలను పంపిణీ చేయాలి. ఆదా యం పన్ను చెల్లించని కుటుంబాల ప్రజలందరికీ నెలకు తలకు 10 కిలోల చొప్పున ఆహారధా న్యాలను 6 మాసాల పాటు పంపిణీ చేయాలి. కుటుంబానికి నెలకు 7,500 రూపాయల చొప్పున డబ్బు అందజేయాలి. ప్రస్తుతం వైరస్ విజృంభణ తీవ్రంగా ఉన్న దృష్ట్యా ఉచిత ఆహారధాన్యాలు, డబ్బును అందజేయటాన్ని మరో రెండుమూడు నెలలు అదనంగా పొడిగించాలి. ఆ విధంగా చేస్తే కరోనా కష్టకాలంలో ప్రజలు కనీస ఆహార, ఆర్థిక అవసరాలు తీర్చుకోవటం సాధ్యమౌతుంది. ఈ విధంగా చేయటానికి జిడిపిలో 3 శాతానికి పైగా–సుమారుగా 6.5 లక్షల కోట్ల రూపాయలు– సరిపోతుంది.

**డిమాండ్ సమస్యను పరిష్కరించాలి**

దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభానికి ప్రధానకారణం డిమాండ్ క్షీణించటం. కోవిడ్ 19 మహమ్మారి రావటానికి ముందే ఆర్థికమాం ద్యం ప్రారంభమైంది. 2019 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికలో జిడిపి పెరుగుదల 3.1 శాతానికి పరిమితమైంది. ఇటువంటి పరిస్థితుల లో కోవిడ్ 19 మహమ్మారి విస్తరణను నిరోధిం చటం కోసమంటూ ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించటంతో ఆర్థికవ్యవస్థ స్థంభించిపోయింది. అంతకుముందున్న ఆదాయం తగ్గిన పరిస్థితితో పాటు లాక్‌డౌన్‌తో మొత్తం ఉపాధి పోయింది. ప్రజలకు ఉన్న ఆదాయ వనరులు హరించుకు పోవటంతో వినియోగ సరుకులకు డిమాండ్ పూర్తిగా తగ్గింది. మాంద్యానికి దారి తీసిన ఈ సమస్యలను గురించి ప్రభుత్వం పట్టించు కోవటం లేదు. ప్రభుత్వం లాక్‌డౌన్ విధించటా నికి ముందే దేశంలో నిరుద్యోగం 45 సంవత్సరాలలో లేనంత ఎక్కువస్థాయికి చేరింది. పారిశ్రామిక రంగంలోని వివిధ విభాగాలలో తీవ్రమైన తగ్గుదల నమోదైంది. వ్యవసాయ, సేవారంగాలు కూడా మాంద్యాన్ని ఎదుర్కొంటు న్నాయి. తర్వాత ప్రభుత్వం లాక్‌డౌన్ విధించటం తో మొత్తం పరిశ్రమలన్నీ మూతపడి నిరుద్యోగం మరింత పెరిగింది.

దేశంలో కార్మికులు 40 కోట్లకు పైగా ఉన్నారు. వారిలో 90 శాతానికి పైగా అసంఘ టిత రంగంలో పని చేస్తున్నారు. పనిచేస్తున్న రోజులలో కూడా వీరికి అతి తక్కువ వేతనాలను మాత్రమే చెల్లిస్తారు. ఇక పరిశ్రమలు మూతపడి, పనులు దొరకని రోజులలో వీరికి ఏ మాత్రం ఆదాయం ఉండదు. పరిశ్రమలు సక్రమంగా ఉండి, కార్మికులు పనిచేసిన రోజులలోనే సకాలంలో, సక్రమంగా వేతనాలు చెల్లించని యజమానులు ఇక పరిశ్రమలు మూసివేసి, పనులు లేనపుడు కార్మికులకు వేతనాలు చెల్లించటం జరుగుతుందా? పరిశ్రమలు, వ్యాపారాలు మూతపడినా యజమానులు కార్మి కులకు వేతనాలు చెల్లించాలని ఒక్కమాట చెప్పి, దాని అమలుకు తన బాధ్యత లేదన్న విధంగా కేంద్ర ప్రభుత్వం మౌనంగా కూర్చున్నది.

**ఉపాధిహామి పనుల ప్రాధాన్యత**

దేశంలోని వివిధ ప్రాంతాలకు వలసలు వెళ్ళి పనులు చేసుకొంటున్న వ్యవసాయ కార్మి కులు, గ్రామీణపేదలు లాక్‌డౌన్‌తో పనులు కోల్పోయారు. వలస వెళ్ళిన చోట బతకటానికి మార్గం లేకపోవటంతో వారిలో ఎక్కువ మంది స్వగ్రామాలకు చేరుకున్నారు. కాని వారి గ్రామాలలో ఉపాధి అవకాశాలు అతి తక్కువగా ఉన్నాయి. యాంత్రీకరణ, వాణిజ్యపంటలు, తోటలు వేయటం తదితరాలతో వ్యవసాయంలో పనులు తగ్గిపోవటంతోనే వారు వలసలు వెళ్ళారు. ఆ తర్వాత గ్రామాలలో అదనంగా ఉపాధి అవకాశాలు పెరిగింది లేదు. గ్రామా లలో ఉన్న పనులు అక్కడ ఉంటున్నవారికే సరిపోవటం లేదు. ఇక వలస వెళ్ళిన ప్రాంతాల

> **❝ దేశంలో ఐదు ఎకరాల కన్నా తక్కువ భూమి ఉన్న పేద, మధ్య తరగతి రైతు కుటుం బాలు 8 కోట్లకు పైగా ఉన్నాయి. రబీపంటలు కోతకు వచ్చేకాలంలో హఠాత్తుగా లాక్‌డౌన్ విధించటంతో కూరగాయలు, పండ్లు లాంటి పంటలు వేసిన రైతులలో ఎక్కువ మంది వాటిని అమ్ముకోలేకపోయారు. అనేకమంది పంటను కోయకుండా పొలాలలోనే వదిలివేశారు. ❞**

నుండి గ్రామాలకు తిరిగి వచ్చిన వారికి పనులు దొరకటం పెద్ద సమస్యగా మారింది. గ్రామాలలో ఉన్నవారు, వలసల నుండి తిరిగి వచ్చిన వారు కలిసి కూలీల సంఖ్య పెరగటంతో డిమాండ్ తగ్గుతుంది. అందువలన వ్యవసాయ కార్మికులకు లభించే పనిదినాలతో పాటు వారికి చెల్లించే వేతనాలు కూడా తగ్గుతాయి. కాబట్టి వ్యవసాయ కార్మికుల కొనుగోలు శక్తి మరింత తగ్గుతుంది. అందువలన ఆదాయాలను, వారి కొనుగోలు శక్తిని పెంచాలంటే గ్రామీణప్రాంతంలో వ్యవసాయ కార్మికులందరికీ కనీసం 200 రోజులైనా ఉపాధిహామి పనులు కల్పించాలి. కూలిరేటు రోజుకు 300 రూపాయలకు తగ్గకుండా చెల్లించాలి. అలా చేయాలంటే ఉపాధిహామి పనులకు కేటాయించిన నిధులపై ఎటువంటి పరిమితులు విధించరాదు. ప్రభుత్వం 2020-21బడ్జెట్‌లో 61,000 కోట్ల రూపాయలు, ప్రధాని ప్రకటించిన ప్యాకేజిలో భాగంగా 40,000 కోట్ల రూపాయలు మాత్రమే ఉపాధి హామికి కేటాయించింది. మొత్తం వ్యవసాయ కార్మికులలో సగం మంది పనులు కోరారనుకున్నా వారికి 10 రోజుల పాటు పనులు చూయించటానికి కూడా కేంద్రం కేటాయించిన మొత్తం సరిపోదు. దీనిలో కూడా ప్రభుత్వం మోసపు పద్ధతులను అనుసరించింది. అత్యంత వెనుకబడిన జిల్లాల పేరుతో అదనంగా కేటాయించిన నిధులతో ఉపాధి కల్పనను 110 జిల్లాలకే పరిమితం చేసింది. అందువలన ఉపాధిహామి చట్టాన్ని అమలు చేయటానికి ఎటువంటి పరిమితులు లేకుండా నిధులు కేటాయించి, వెనుకబడిన జిల్లాలన్న విభజనను రద్దుచేసి, దేశంలో పనులు కోరుతున్న వ్యవసాయ కార్మికులు, పేదరైతులు, కౌలురైతులు, వృత్తులు కోల్పోయిన పేదలు తదితరులందరికీ పనులు కల్పించాలి. పట్టణ ప్రాంతాలలో పనులు దొరకని పేదలకు కూడా ఉపాధి పనులు కల్పించాలి. 5 కోట్ల మందికి 200 రోజులు పనులు కల్పించి, రోజుకు 300 రూపాయల కూలి చెల్లించాలంటే 3 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సివుంటుంది. అంతమొత్తం గ్రామీణ, పట్టణపేదల వద్దకు చేరితే వారి కొనుగోలుశక్తి పెరిగి ఆర్థికవ్యవస్థకు ఊపు వస్తుంది.

### రైతాంగానికి సహకారం అందించాలి

దేశంలో ఐదు ఎకరాల కన్నా తక్కువ భూమి ఉన్న పేద, మధ్య తరగతి రైతు కుటుంబాలు 8 కోట్లకు పైగా ఉన్నాయి. రబీపంటలు కోతకు వచ్చేకాలంలో హఠాత్తుగా లాక్‌డౌన్ విధించటంతో కూరగాయలు, పండ్లు లాంటి పంటలు వేసిన రైతులలో ఎక్కువ మంది వాటిని అమ్ముకోలేకపోయారు. అనేకమంది పంటను కోయకుండా పొలాలలోనే వదిలివేశారు. ఇతర పంటలను కూడా కళ్ళాలలోనే అమ్ముకొనే రైతులు తీవ్రంగా నష్టపోయారు. అప్పటికే అప్పులలో కూరుకుపోయిన రైతులకు ఈ అదనపు నష్టాలు గోరుచుట్టుపై రోకటిపోటులాగా పరిణమించాయి. వ్యవసాయం చేసే రైతులు బ్యాంకుల నుండి పొందిన రుణాల కన్నా గ్రామాలలోని వడ్డీ వ్యాపారుల నుండి పొందిన రుణాలు ఎక్కువగా ఉంటాయి. ఈ రుణాలకు నూటికి నెలకు రెండు రూపాయల నుండి ఐదు రూపాయల వరకు వడ్డీలు చెల్లించాల్సి ఉంటుంది. ఒక సంవత్సరం ప్రకృతి వైపరీత్యాలు, సరైన విత్తనాలు లేకపోవటం వలన పంట సరిగా రాకపోతే లేదా పంటలు బాగా పండినా సరైన ధరలు పొందలేకపోతే కౌలురైతులు, స్వంతభూములున్న పేదరైతులు ఎక్కువ మంది రుణాలు చెల్లించలేని స్థితికి చేరతారు. అటువంటి పరిస్థితులలో రుణగ్రస్తులైన రైతులు తమకున్న భూములు లేదా ఆస్తులను అమ్ముకొని అప్పులు తీర్చవలసిన పరిస్థితులలోకి నెట్టబడుతున్నారు. రైతులు కొందరు రుణాలను తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇటువంటి రైతుల బ్యాంకు రుణాలతో పాటు వడ్డీ వ్యాపారులు, ఇతరుల వద్ద తీసుకున్న ప్రైవేటు రుణాలను కూడా రద్దుచేసి, ప్రభుత్వమే మొత్తం రుణాలను తీర్చివేయాలి. అందుకోసం గతంలో కేరళ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విధంగా రాష్ట్రాల స్థాయిలో రుణ విమోచన కమిషన్‌లను ఏర్పాటు చేయాలి. వాటి ద్వారా విచారణ జరిపి పేద, కౌలురైతుల రుణాలను పూర్తిగా తీర్చివేయాలి. మధ్య తరగతి రైతుల స్థాయిని బట్టి రుణాల నుండి బయటపడటానికి అవసరమైన మేరకు సహకారం అందించాలి. రైతులు తిరిగి వ్యవసాయం సాగించటానికి అవసరమైన మేరకు రుణాలను బ్యాంకుల ద్వారా అందించాలి. ఆంధ్రప్రదేశ్ లాంటి కొన్ని ప్రాంతాలలో 70 శాతానికి పైగా కౌలురైతులు ఉన్నారు. దేశం మొత్తంగా చూసినపుడు 30 శాతంకు పైగా ఉంటారు. బ్యాంకుల ద్వారా ఇచ్చే పంట రుణాలను భూయజమానులకు కాకుండా భూములను సాగుచేస్తున్న కౌలురైతులకే అందించాలి. ఇటువంటి చర్యలు తీసుకున్నపుడే వ్యవసాయాన్ని సక్రమంగా సాగించటం సాధ్యం అవుతుంది. 8 కోట్ల కుటుంబాలకు రుణాలు తీర్చటానికి, వ్యవసాయావసరాలకు సగటున కుటుంబానికి లక్ష రూపాయల చొప్పున చెల్లించినా 8 లక్షల కోట్ల రూపాయలు అవుతుంది. ఈ విధంగా 8 లక్షల కోట్ల రూపాయలను రైతాంగం కోసం ఖర్చుచేస్తే రైతులు రుణవిముక్తులౌతారు.

### ప్రైవేటు ఆసుపత్రులను ప్రభుత్వ ఆధ్వర్యంలో నడపాలి

కోవిడ్ 19 మహమ్మారి విస్తృతంగా వ్యాపిస్తున్న పరిస్థితులలో బాధిత ప్రజలందరికీ ప్రభుత్వం వైద్యం అందించాలి. ప్రభుత్వ ఆసుపత్రులు కోవిడ్ బాధితులకు వైద్యం అందించే కేంద్రాలుగా మారగా ప్రైవేటు ఆసుపత్రులు లాభాలు దండుకోవటంపై దృష్టి సారించాయి. ఒకరోజు ఐసియు, వెంటిలేటర్ చికిత్సకు లక్షలలో బిల్లులు వేస్తున్నాయి. హైదరాబాద్‌లో ప్రభుత్వ జ్వరాల ఆసుపత్రి చీఫ్‌కు ఐసియు చికిత్సకు రోజుకు 1.25 లక్షల రూపాయల చొప్పున బిల్లు వేసి, అంతబిల్లు ఎందుకు వేశారని నిలదీసిన ఆమెను నిర్బంధించిన ప్రైవేటు ఆసుపత్రి నిర్వాకం కూడా మీడియాలో వచ్చింది. కోవిడ్ 19 విస్తరిస్తున్న కాలంలో కూడా దేశంలోని అనేక ప్రాంతాలలో ప్రైవేటు ఆసుపత్రులు ఈ విధమైన దురాగతాలకు పాల్పడుతున్నాయి. ఇటువంటి స్థితిలో కోవిడ్ బాధితులైన సామాన్య ప్రజలు సరైన వైద్యం పొందటం ఎలా సాధ్యం అవుతుంది? కోవిడ్ వలన మరణిస్తున్న వారిలో సకాలంలో సరైన వైద్యం అందక మరణిస్తున్న వారిసంఖ్యే అధికంగా ఉన్నది.

**❝ మోడి ప్రభుత్వం కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయలను కట్టబెడుతూ ప్రజలపై మరిన్ని భారాలను మోపటానికి పూనుకున్నది. ఒకవైపు కోవిడ్ 19 మహమ్మారితో గణనీయమైన సంఖ్యలో ప్రజలు ఒకపూట తిండికి మొహం వాచిపోతుండగా, ఇదేకాలంలో ముఖేష్ అంబాని ప్రభుత్వ మద్దతుతో ఆసియాలోనే అత్యంత ధనికునిగా ఆవిర్భవించాడు. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గుతున్నా దేశంలో పెట్రోలు, డీజిల్ ధరలను లీటరుకు 10 రూపాయలకు పైగా పెంచింది. ❞**



**కోవిడ్ ఆసుపత్రి: ప్రభుత్వ వైద్య సదుపాయాల కొరత దేశంలో కోవిడ్ కేసుల పెరుగుదలకు ఒక కారణం**

ఇటువంటి పరిస్థితులలో కోవిడ్ 19 ప్రమాదం ఉన్నంతవరకు దేశంలోని ప్రైవేటు ఆసుపత్రులను ప్రభుత్వం ఉపయోగించుకుని ఉచితంగా, విస్తృతంగా కోవిడ్ పరీక్షలు నిర్వహించాలి. కోవిడ్ బాధిత ప్రజలందరికీ ఉచిత వైద్యం అందించాలి. అవసరమైన మేరకు నూతనంగా వైద్య సిబ్బందిని రిక్రూట్ చేసుకోవాలి. వైద్య సిబ్బందికి అవసరమైన పిపిఇలు, ఇతర రక్షణ పరికరాలను ప్రభుత్వం అందజేయాలి. కోవిడ్‌కు వైద్యం చేస్తున్న అన్ని ఆసుపత్రులలోనూ ఆక్సిజన్, వెంటిలేటర్లను యుద్ధ ప్రాతిపదికపై ఏర్పాటు చేయటానికి చర్యలు తీసుకోవాలి. ఇటువంటి చర్యలు తీసుకోవటానికి, కోవిడ్ 19 మహమ్మారిని దేశంలో పూర్తిగా నిర్మూలించటానికి అవసరమై మొత్తాన్ని ఖర్చు పెట్టటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి.

ప్రభుత్వం ఈ విధమైన చర్యలు తీసుకోవటానికి, కష్టకాలంలో పైన పేర్కొన్న విధంగా వివిధ వర్గాల ప్రజలకు అవసరమైన ఆర్థిక సహకారం అందించటానికి సుమారుగా 20 లక్షల కోట్ల రూపాయలు అవసరం అవుతాయి. ఇది జిడిపిలో 10 శాతం కన్నా తక్కువగానే ఉంటుంది. ఇది అదనంగా చేస్తున్న డిమాండ్ కాదు. మోడి ప్రకటటించిన 20.79 లక్షల కోట్ల రూపాయల నకిలీ ప్యాకేజిని వాస్తవ ప్యాకేజిగా మారిస్తే ఈ అన్ని కార్యక్రమాల అమలుకు అవసరమైన నిధులు వస్తాయి. ఈ చర్యలు తీసుకోవటంతో పాటు అవసరాన్ని బట్టి మరో 5 నుండి 10 లక్షల కోట్ల రూపాయల వరకు చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రభుత్వం సహకారం అందించవచ్చు. కోవిడ్ 19 వ్యాపిస్తున్న కాలంలో చాలా దేశాలు తమ జిడిపిలో 15 శాతానికి పైగా ప్రజలకు రాయితీలు ఇవ్వటానికి కేటాయించాయి. మనదేశం కూడా ఆ విధంగా చేయాల్సిన అవసరం ఉంది.

కాని ఆవిధంగా ఖర్చు చేయటానికి ప్రభుత్వం వద్ద నిధులు లేవని, ద్రవ్యలోటు పెరగటానికి ఎఫ్ఆర్‌బిఎం నిబంధనలు అనుమతించవని, అదనంగా డబ్బు మార్కెట్‌లోకి వస్తే ద్రవ్యోల్బణం పెరుగుతుందని, ప్రజలకు ఉచితంగా డబ్బులిస్తే వారు సోమరులౌతారని సరళీకరణవాదులు వాదనలు చేస్తున్నారు. ఎఫ్ఆర్‌బిఎం నిబంధనలను పాటించకుండా ద్రవ్యలోటును పెంచితే ద్రవ్యోల్బణం పెరుగుతుందని, విదేశీ పెట్టుబడులు దేశం నుండి బయటికిపోతాయని కూడా చెబుతున్నారు. ఈ వాదనలలో ఏ మాత్రం వాస్తవం లేదు. నిధుల కొరతను అధిగమించటం కోసం ప్రభుత్వం తన అవసరాలకు ప్రజల నుండి బాండ్ల ద్వారా నిధులు సేకరించవచ్చు. రిజర్వుబ్యాంకు నుండి రుణం తీసుకొని, వివిధ వర్గాల ప్రజల అవసరాలు తీర్చటానికి వినియోగించాలి. మనదేశ ప్రజల అవసరాలను తీర్చటానికి ఆటంకంగా ఉన్నపుడు సరళీకరణ విధానాలలో భాగమైన ఎఫ్ఆర్‌బిఎం చట్టాన్ని అమలు చేయాల్సిన అవసరం లేదు. ఇక ద్రవ్యోల్బణం పెరుగుతుందనే వాదన కూడా సరికాదు. ప్రజలకు ఎప్పటి వలె ఉపాధి, ఆదాయాలు ఉండి, దానికి అదనంగా మార్కెట్లోకి డబ్బువస్తే ద్రవ్యోల్బణం పెరుగుతుంది. కాని 80 శాతం ప్రజలకు ఉన్న ఆదాయాలు దెబ్బతిన్న పరిస్థితులలో అవసరమైన మేరకు ద్రవ్యాన్ని మార్కెట్‌లోకి తీసుకువస్తే ద్రవ్యోల్బణంపై తక్కువ ప్రభావమే చూపుతుంది. అందువలన విదేశీ పెట్టుబడుల రాకపై కొద్దిమేరకు ప్రభావం పడవచ్చు. సహజంగానే ద్రవ్య పెట్టుబడులు తమకు ఎక్కడైతే గాలివాటు లాభాలు వస్తాయో అక్కడికి పరుగెడుతుంటాయి. కాబట్టి వాటి లాభాలకు ఆటంకం కలిగించే చర్యలు తీసుకుంటే ఆయా దేశాల నుండి వెళ్ళిపోతాయి. అయితే విదేశీ పెట్టుబడులు దేశం నుండి బయటకు వెళ్ళకుండా ఆంక్షలు విధించే అధికారం ప్రభుత్వానికి ఉంది. సరళీకరణ విధానాలకు పూర్తి మద్దతు ఇస్తున్న మోడి ప్రభుత్వం అటువంటి చర్యలు తీసుకొని, ద్రవ్య పెట్టుబడిదారుల వ్యతిరేకతను ఎదుర్కోవటానికి సిద్ధం కావటం లేదు. ద్రవ్య పెట్టుబడులకు తన లొంగుబాటును, కార్పొరేట్, బహుళజాతి సంస్థల అనుకూల విధానాలను కప్పిపెట్టుకోవటానికి, ప్రజలను తప్పుదారి పట్టించటానికి ప్రభుత్వం తప్పుడు వాదనలు చేస్తున్నది.

మరోవైపున మోడి ప్రభుత్వం కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయలను కట్టబెడుతూ ప్రజలపై మరిన్ని భారాలను మోపటానికి పూనుకున్నది. ఒకవైపు కోవిడ్ 19 మహమ్మారితో గణనీయమైన సంఖ్యలో ప్రజలు ఒకపూట తిండికి మొహం వాచిపోతుండగా, ఇదేకాలంలో ముఖేష్ అంబాని ప్రభుత్వ మద్దతుతో ఆసియాలోనే అత్యంత ధనికునిగా ఆవిర్భవించాడు. శతకోటీశ్వరులు తమ సంపదలను పెంచుకుంటున్నారు. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గుతున్నా దేశంలో పెట్రోలు, డీజిల్ ధరలను లీటరుకు 10 రూపాయలకు పైగా పెంచింది. రబీపంటలలో ధరలు పొందలేని రైతులను గురించి పట్టించుకోలేదు. వ్యవసాయానికి ఉన్న రక్షణలను కూడా తొలగించింది. ఆర్థిక సంక్షోభాన్ని మరింత తీవ్రం చేయటానికి ఈ విధానాలు దోహదం చేస్తాయి. దేశంలో నెలకొన్నన ఆర్థిక సంక్షోభాన్ని పరిష్కరించి, ప్రజలకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించే ప్రత్యామ్నాయ విధానాలు అనుసరించే విధంగా ప్రభుత్వ మెడలు వంచటం కోసం బలమైన ప్రజా ఉద్యమాలు సాగాలి.

❊

సిద్ధాంతం

# శ్రామికవర్గాన్ని విముక్తి చేయటమే కమ్యూనిస్టుల లక్ష్యం

## మార్క్సిస్టు మహోపాధ్యాయుడు ఫ్రెడరిక్ ఏంగెల్స్ ఇంటర్వ్యూ

కమ్యూనిస్టు ప్రణాళిక ముసాయిదాపై కమ్యూనిస్టు లీగ్ అధ్యక్ష, కార్యదర్శులైన కార్ల్ షిల్, హైడ్‌లు లండన్ నుండి అడిగిన ప్రశ్నలకు 1847 జూన్ 9న ఏంగెల్స్ చెప్పిన సమాధానాలు క్రింద ఇస్తున్నాం. **ఎన్.రామకృష్ణన్ తను రాసిన "యాన్ అవుట్‌లైన్ హిస్టరీ ఆఫ్ ది కమ్యూనిస్టు మూవ్‌మెంట్ ఆఫ్ ది వరల్డ్ పార్ట్ – 1" (1844 –1917)లో** ఆ సమాధానాలను పేర్కొన్నారు. వాటిని మార్క్సిస్టు పాఠకులకు అందిస్తున్నాం– సంపాదకుడు.

**ప్రశ్న :** మీరు కమ్యూనిస్టా ?

**జవాబు:** అవును.

**ప్రశ్న:** కమ్యూనిస్టుల లక్ష్యం ఏమిటి ?

**జవాబు:** ప్రాథమిక పరిస్థితులను ఉల్లంఘించకుండా, ప్రతి పౌరుడు పూర్తి స్వేచ్ఛతో తన శక్తి సామర్థ్యాలను ఉపయోగించి సమాజాన్ని అభివృద్ధి చేసేలా కృషిచేయడమే కమ్యూనిస్టుల లక్ష్యం.

**ప్రశ్న:** ఈ లక్ష్యాన్ని మీరు ఎలా సాధించాలనుకుంటున్నారు ?

**జవాబు:** ప్రైవేటు ఆస్తిని తొలగించి దాని స్థానంలో సామూహిక ఆస్తి రూపాన్ని తీసుకురావడం ద్వారా లక్ష్యాన్ని సాధిస్తాం.

**ప్రశ్న:** సమాజాన్ని ఏ – ఏ అంశాల ఆధారంగా అభివృద్ధి చేస్తారు ?

**జవాబు:** మొదటిది, ఉత్పత్తి శక్తులను అభివృద్ధి చేయడం ద్వారా ప్రజలకు జీవనోపాధి చూపిస్తాం. వ్యవసాయం, వాణిజ్యంతో పాటు అవసరాలకు అనుగుణంగా యంత్రాలను, అంతర్గత వనరులను అభివృద్ధి చేస్తాం. సమాజంలోఅభివృద్ధి ప్రక్రియ నిరంతరం జరుగుతుంది. రెండవది, ప్రతి వ్యక్తి చైతన్యం నిరంతరం అభివృద్ధి అవుతుంది. వ్యవస్థ ప్రాథమిక సూత్రాలను ప్రజలు తిరస్కరించ లేని స్థాయిలో ఉంటారు. ఈ సూత్రాలు చారిత్రక అభివృద్ధి క్రమంలో రూపొందించబడతాయి. వీటికి ఎటువంటి రుజువులు అవసరం లేదు.

**ప్రశ్న:** ఈ సూత్రాల లక్ష్యం ఏంటి?


**జవాబు:** ఉదాహరణకు, ప్రతి వ్యక్తి సంతోషంగా ఉండటానికి ప్రయత్నిస్తాడు. ప్రజలందరి ఆనందం నుండి వ్యక్తి ఆనందం విడదీయరానిదిగా ఉంటుంది.

**ప్రశ్న:** ప్రైవేటు ఆస్తిని ఎలా సమాజపరం చేయాలనుకుంటున్నారు?

**జవాబు:** శ్రామికవర్గాన్ని ఐక్యం, చైతన్యవంతం చేయడం ద్వారా ప్రైవేటు ఆస్తిని సమాజపరం చేస్తాము.

**ప్రశ్న:** శ్రామికవర్గం అంటే ఎవరు?

**జవాబు:** శ్రామికవర్గం అంటే సమాజంలో శ్రమ మీదనే ఆధారపడి జీవించే వర్గం. పెట్టుబడి మీద వచ్చే లాభంపై ఆధారపడే వర్గం కాదు. కార్మికవర్గం యొక్క జీవితం, మరణం, దుఖం, సుఖం, మంచి, చెడు పెట్టుబడిదారుడి వ్యాపార పరిస్థితులపై ఆధారపడి ఉంటాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రపంచ ఆర్థిక సంబంధాల్లో వచ్చే హెచ్చుతగ్గులపై ఆధారపడి కార్మికుల శ్రమ ఉంటుంది.



**ప్రశ్న:** సమాజంలో ఎప్పటికైనా శ్రామికులు ఉంటారా?

**జవాబు:** లేదు. దోపిడీ సమాజంలో దోపిడి చేసే వర్గం, పేదలు, శ్రామిక వర్గాలు ఉంటారు. శ్రమ చేసే వారు, శ్రమ దోపిడీకి గురయ్యేవారు ఎప్పటికీ పేదలుగానే ఉంటారు. స్వేచ్ఛామార్కెట్‌లో కార్మికులు ఎప్పటికీ స్వేచ్ఛను పొందలేరు.

**ప్రశ్న:** శ్రామికులు ఎలా పుట్టుకొచ్చారు?

**జవాబు:** గత శతాబ్దం మధ్యకాలంలో కనిపెట్టిన, ప్రవేశపెట్టిన యంత్రాల ఫలితంగా శ్రామికవర్గం ఉనికిలోకి వచ్చింది. వాటిలో ఆవిరి యంత్రం, స్పిన్నింగ్ యంత్రం, మర మగ్గం ముఖ్యమైనవి. ఈ యంత్రాలు చాలా ఖరీదైనవి కావడం వలన ధనవంతులు మాత్రమే కొనుగోలు చేయగలిగారు. యంత్రాల వాడకం ద్వారా కార్మికులు చేతి మగ్గాల కన్నా వేగంగా, చౌకగా వస్తువులను ఉత్పత్తి చేయగలిగారు. యంత్రాల రాకతో చేతి మగ్గాలతో నడుస్తున్న వస్త్ర పరిశ్రమ పూర్తిగా పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్ళింది. కార్మికుల చేతుల్లో ఉన్న సాధనాలు, చేతి మగ్గాలు కాలక్రమంలో పనికిరానివిగా మారాయి. తద్వారా పెట్టుబడిదారుడు ఉత్పత్తి సాధనాలన్నింటి మీద ఆధిపత్యం సాధించాడు. సొంత ఉత్పత్తి సాధనాలను కోల్పోయిన కార్మికుడు బలవంతంగా ఫ్యాక్టరీ వ్యవస్థలోకి ప్రవేశపెట్టబడ్డాడు. ఈ పరిస్థితి

పెట్టుబడిదారులకు ఎంత ప్రయోజనకరంగా మారిందంటే కార్మికులను ఎక్కువ ప్రాంతాల్లో, ఎక్కువ గంటలు పని చేయించడానికి దోహదపడింది. క్రమేపి కార్మికుల సంఖ్య పెరగడంతో కార్మికుల మధ్య పని విభజన చేశారు. దాంతో గతంలో వస్త్రం తయారీ పని అంతా చేసిన కార్మికులు ఇప్పుడు దానిలో కొంత భాగాన్ని మాత్రమే ఉత్పత్తి చేసే పరిస్థితికి వచ్చారు. ఈ విధంగా సరళీకృతం చేయబడిన శ్రమతో మరింత వేగంగా, తక్కువ ఖర్చుతో వస్తువులను ఉత్పత్తి చేయడం ప్రారంభమైంది.

కార్మికుడు చేసే ప్రతి శ్రమలో యాంత్రీకరణ ప్రవేశపెట్టవచ్చని పెట్టుబడిదారుడు కనుగొన్నారు. స్పిన్నింగ్, మర మగ్గంపై పని చేసిన కార్మికులు పెట్టుబడిదారుల చేతిలో ఉన్న ఫ్యాక్టరీ ఉత్పత్తికి వెళ్ళిన వెంటనే తమకు ఉన్న స్వతంత్రతను కోల్పోయారు. వివిధ రకాల విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులందరూ క్రమంగా ఈ స్థితికి చేరుకుంటారు. ఇది క్రమంగా మధ్యతరగతి, చిన్న తరహా చేనేత కార్మికుల నాశనాన్ని మరింత వేగవంతం చేస్తుంది. ఫ్యాక్టరీ ఉత్పత్తి కార్మికుల మునుపటి స్థితిని పూర్తిగా మార్చివేసింది. మిగిలి ఉన్న వర్గాలు క్రమంగా కనుమరుగై బూర్జువావర్గం, కార్మికవర్గం అనే రెండు కొత్త వర్గాలు ఉనికిలోకి వచ్చాయి.

అవి: (1) అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రజలకు అవసరమైన జీవనాధార వస్తువులను తయారుచేసే పెట్టుబడిదారీ వర్గానికి యంత్రాలు, కర్మాగారాలు, వర్క్‌షాపులు మొదలైన వాటి మీద పెత్తనం ఉన్నది. వీరినే బూర్జువావర్గం అని పిలుస్తారు.

(2) కార్మికులు పూర్తిగా ఆస్తిలేని వర్గం. వీరు తమ శ్రమను పెట్టుబడిదారులకు అమ్ముకోవాల్సిన దుస్థితిలో ఉంటారు. అందుకు ప్రతిఫలంగా కార్మికుల జీవనాధారానికి అవసరమైన విలువను మాత్రమే పెట్టుబడిదారులు ఇస్తారు. కార్మికుల శ్రమను దోపిడీ చేస్తూ పెట్టుబడిదారులు లాభాలు సంపాదిస్తున్నారు. పెట్టుబడిదారులు నిర్దేశించిన ప్రతికూల పరిస్థితులకు లోబడి ఆస్తి లేని వర్గం పనిచేయాలి. పెట్టుబడిదారులపై ఆధారపడిన ఈ వర్గాన్ని కార్మికవర్గం అంటారు.


**ప్రశ్న:** బానిస కన్నా కార్మికుడు ఏ విధంగా భిన్నంగా ఉంటాడు?

**జవాబు:** బానిస ఒక్కసారిగా అమ్ముడవుతాడు. శ్రామికుడు ప్రతిరోజు, ప్రతిగంట తనను తాను అమ్ముకోవాలి. బానిస ఒక యజమాని ఆస్తి. ఈ కారణం చేతనే బానిస జీవితం అది ఎంత దౌర్భాగ్యమైనా కావచ్చు, అతని జీవనాధారానికి హామీ ఉంటుంది. శ్రామికుడు ఒక యజమానికి బానిస కాదు, మొత్తం బూర్జువా వర్గానికి చెందినవాడు. అందువల్ల అతని జీవనానికి గ్యారంటీ లేదు. ఎందుకంటే కార్మికుడి శ్రమ అవసరం లేకపోతే ఎవరూ కొనుగోలు చేయరు. బానిస పౌర సమాజంలో సభ్యుడు కాదు. శ్రామికుడిని మాత్రం ఒక వ్యక్తిగా, పౌర సమాజంలో సభ్యుడిగా గుర్తిస్తారు.

అందువల్ల కార్మికుడు బానిస కంటే మెరుగైన జీవనాన్ని కలిగి ఉంటాడు. సమాజం అభివృద్ధి అవుతున్న ఉన్నత దశలో బానిస కార్మికుడిగా మారడం ద్వారా బానిసత్వ సంబంధం నుండి తనను తాను విడిపించుకుని విముక్తి అవుతాడు. సామూహిక ఆస్తిని రద్దు చేయడం ద్వారా కార్మికుడు తనను తాను విముక్తి చేసుకోగలడు.

**ప్రశ్న:** ఫ్యూడల్ దాసుని కన్నా కార్మికుడు ఏ విధంగా భిన్నంగా ఉంటాడు?

**జవాబు:** భూస్వామ్యవ్యవస్థలో దాసుడు ఉత్పత్తి సాధనంగా ఉన్న భూమిని ఉపయోగించుకొని జీవనం సాగిస్తాడు. శ్రామికుడు మరొకరికి చెందిన ఉత్పత్తి సాధనాలతో పనిచేస్తాడు. దాసుని విషయంలో అతను చేసిన శ్రమకు బదులుగా, చేసిన ఉత్పత్తిలో కొంత భాగాన్ని ప్రతిఫలంగా పొందుతాడు. కార్మికుడి వాటా తన సొంత శ్రమ ద్వారా నిర్ణయించబడుతుంది. ఇది కూడా కార్మికుల మధ్య పోటీ ద్వారా



నిర్ణయించబడుతుంది. బానిస జీవనాధారానికి హామీ ఉంది కానీ కార్మికుడికి లేదు. దాసుడు తన భూస్వామ్య ప్రభువును తరిమికొట్టడం ద్వారా, ఆస్తికి యజమానిగా మారడం ద్వారా తనను తాను విముక్తి చేసుకుంటాడు. కార్మికుడు ప్రజల మధ్య ఉన్న వర్గ వ్యత్యాసాలను బద్దలుకొట్టి, ఉత్పత్తి సాధనాలమీద ఆధిపత్యం సాధించి తనను తాను విముక్తి చేసుకుంటాడు.

**ప్రశ్న:** చేతిపని చేసే కార్మికుని కన్నా ఫ్యాక్టరీ కార్మికుడు ఏ విధంగా భిన్నంగా ఉంటాడు ?

**జవాబు:** చేతి వృత్తులు చేసే కార్మికులు (కంసాలి, వడ్రంగి, శిల్పి) గత శతాబ్దంలో దాదాపు ప్రతిచోటా ఉనికిలో ఉన్నారు. ఇప్పటికీ అక్కడక్కడ ఉన్నారు. అతడు చాలావరకు తాత్కాలిక శ్రామికుడు. అతని లక్ష్యం పెట్టుబడిని స్వయంగా సంపాదించడం. ఇతర కార్మికులను దోపిడీ చేయడం. వృత్తిపరమైన వ్యాపారాలు నడిచే చోట, స్వేచ్ఛగా వ్యాపారం జరిగే ప్రాంతంలో, ఫ్యాక్టరీ ఆధారంగా చేతివృత్తులు నడుస్తున్న చోట చేతివృత్తులు చేసే వారు లక్ష్యాన్ని సాధించగలరు. చేతివృత్తుల స్థానంలోకి ఫ్యాక్టరీ వ్యవస్థ ప్రవేశంతో, తీవ్రమైన పోటీ పరిస్థితుల్లో చేతివృత్తిదారుడు క్రమంగా తన లక్ష్యానికి దూరంగా నెట్టివేయబడతాడు. కార్మికుడిగా మారతాడు. కార్మికుడిగా మారిన చేతివృత్తిదారుడు కార్మిక ఉద్యమంలో చేరి తనను తాను విముక్తి చేసుకుంటాడు.

**ప్రశ్న:** సంపద ఎప్పటికైనా సమాజపరమవడం సాధ్యమేనా? అవుతుందని మీరు నమ్ముతున్నారా?

**జవాబు:** నమ్ముతున్నాను. సమాజంలోని ప్రజలందరూ సంతోషంగా ఉండటానికి అవసరమైన యంత్రాలు, కొత్త ఆవిష్కరణలతో అన్ని రకాలుగా అభివృద్ధికి ఉన్న అవకాశాలను నిలబెట్టడం సాధ్యమైనప్పుడే కమ్యూనిజం పుట్టుకొస్తుంది. కమ్యూనిజం అనేది ఒక విముక్తి సిద్ధాంతం. బానిసలు, భూస్వామ్య వ్యవస్థలోని అర్ధ బానిసలు, చేతివృత్తిదారులకు కమ్యూనిజం సాధించడం సాధ్యం కాదు, శ్రామికులకు

మాత్రమే సాధ్యం. అందువల్ల అంతకుముందు కాలంలో సాధ్యం కాని కమ్యూనిజం 19వ శతాబ్దం నాటికి సాధ్యమయే పరిస్థితులు ఏర్పడ్డాయి.

**ప్రశ్న:** ఆరవ ప్రశ్నను మరోసారి చూద్దాం. కార్మికవర్గాన్ని ఏకం చేసి, అవగాహన కల్పించి, సామూహిక ఆస్తి రూపాన్ని అంగీకరించేలా సన్నద్ధం చేయటం అంటే ఆ తర్వాత విప్లవాన్ని తిరస్కరించటమేనా ?

**జవాబు:** అన్ని రకాల కుట్ర సిద్ధాంతాలు నిరుపయోగమైనవే కాక నష్టదాయకమైనవన్న వాస్తవాన్ని మనం గుర్తించాము. విప్లవాలు ఉద్దేశ్యపూర్వకంగానో, ఏకపక్ష నిర్ణయాలతోనో సాధ్యం కావనీ, అన్నివేళలా విశ్వవ్యాప్తంగా చోటు చేసుకునే పరిణామాల పర్యవసానం అన్న విషయంలో మాకు ఏ మాత్రం సందేహం లేదు. ఒక నాయకుని పట్టుదలతోనో, ఒక పార్టీ నిర్ణయం మీదనో ఆధారపడి విప్లవాలు విజయవంతం కావని కూడా అర్థం చేసుకున్నాము. అన్ని దేశాల్లోని కార్మికవర్గం సంపన్న వర్గాల చేతిలో దోపిడీకి, అణచివేతకు గురౌతున్న నేపథ్యంలో కమ్యూనిజాన్ని వ్యతిరేకించే శక్తులే విప్లవాన్ని అనివార్యం చేస్తాయి. అంతిమంగా అణచివేతకు గురైన కార్మికవర్గాన్ని విప్లవ సాధన వైపు నెట్టినపుడు కార్మికవర్గపు ఆ ప్రయత్నాన్ని మేము మనసా వాచా కర్మణా సమర్థిస్తాము.

**ప్రశ్న:** సామూహిక ఆస్తి రూపాన్ని రద్దు చేయడం ద్వారా ప్రస్తుత వ్యవస్థను, సామాజిక అసమానతలను మార్చాలని మీరు అనుకుంటున్నారా?

**జవాబు:** మాకు అలాంటి ఉద్దేశం లేదు. చట్టాల ద్వారా ప్రజల అభివృద్ధిని సాధించలేము. ప్రజలు నివసించే భౌతిక పరిస్థితుల అభివృద్ధి ద్వారా ఇది నిర్ణయించబడుతుంది. అభివృద్ధి అనేది క్రమ క్రమంగా ముందుకు సాగుతుంది.

**ప్రశ్న:** ప్రస్తుత వ్యవస్థ నుండి దోపిడీలేని సమాజానికి మార్పు ఎలా జరుగుతుందని మీరు అనుకుంటున్నారు?

**జవాబు:** దోపిడిలేని సమాజాన్ని సాధించడానికి ముందు కీలకమైనది ప్రజాస్వామ్య రాజ్యాంగ యంత్రం ఏర్పాటు చేయడం ద్వారా కార్మికులను రాజకీయంగా విముక్తి చేయడం.

**ప్రశ్న:** ప్రజాస్వామ్యాన్ని స్థాపించిన తర్వాత మీ మొదటి ప్రాధాన్యత ఏమిటి?

**జవాబు:** కార్మికుల జీవనోపాధికి హామీ ఇవ్వడం.

**ప్రశ్న:** మీరు దోపిడీ లేని సమాజాన్ని ఎలా సాధిస్తారు ?

**జవాబు:** (1) సామూహిక ఆస్తిని పరిమితంగా అనుమతిస్తూ క్రమంగా సామాజిక ఆస్తిగా మార్చడానికి కృషి చేస్తాము. ఉదాహరణకు ప్రగతిశీల పన్నుల ద్వారా, రాజ్యాంగ యంత్రానికి అనుకూలంగా వారసత్వ హక్కును పరిమితం చేయడం మొదలైనవి.

(2) జాతీయ వర్క్‌షాపులు, ఫ్యాక్టరీల్లో కార్మికులను నియమించడం, జాతీయ సంపదలో కార్మికులను భాగస్వామ్యం చేయడం ద్వారా

(3) విద్యార్థుల చదువులకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరించి వారిని విద్యావంతులను చేయడం ద్వారా సాధిస్తాము.

**ప్రశ్న:** సమాజాన్ని మార్చే పరివర్తన కాలంలో విద్యార్థులకు ఈ రకమైన విద్యను ఎలా ఏర్పాటు చేస్తారు?

**జవాబు:** తల్లి సంరక్షణ దశ దాటిన పిల్లలందరికి విద్యను అభ్యసించేలా మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి కృషి చేస్తాము.

**ప్రశ్న:** సామూహిక ఆస్తి హక్కును ఖరారు చేసిన తర్వాత మహిళలపై కూడా సామూహిక హక్కులు దఖలు పర్చడం అనివార్యమవుతుందా ?

**జవాబు:** ఈ వ్యవస్థలు నూతన సామాజిక క్రమానికి ఆటంకం కలిగించనంతవరకూ ఏ పరిస్థితుల్లోనూ స్త్రీ, పురుషుల మధ్య ఉన్న సంబంధాల విషయంలోనూ, కుటుంబ సంబంధాల విషయాంలోనూ మేము జోక్యం చేసుకోము. పైగా చరిత్ర గమనంలో ఆస్తి సంబంధాల్లో వచ్చిన మార్పులకు అనుగుణంగా కుటుంబ సంబంధాలు మార్పులకు గురయ్యాయి. ఆస్తిహక్కు అభివృద్ధి చెందుతున్న తీరు, ప్రత్యేకించి వ్యక్తిగత ఆస్తిహక్కు రద్దు కావడం కూడా కుటుంబ సంబంధాలను అనివార్యంగా ప్రభావితం చేస్తుంది.

**ప్రశ్న:** కమ్యూనిజంలో జాతులు – జాతీయతలు కొనసాగుతాయా ?

**జవాబు:** వ్యక్తిగత ఆస్తి రద్దు అయిన తర్వాత వ్యక్తిగత ఆస్తి ఆధారంగా ఏర్పడిన వర్గాలు, తరగతులు అన్న విభజన సమసిపోయినట్లే. సకల జాతుల ప్రజలు అఖండ విశ్వమానవాళి అనే అస్తిత్వంలో కలిసి పోయాక ఆయా జాతులు, జాతీయతలు, దేశాలు అన్న వ్యత్యాసాలు కూడా అదృశ్యమవుతాయి.

**ప్రశ్న:** కమ్యూనిస్టులు ప్రస్తుతం ఉన్న మతాలను తిరస్కరిస్తారా?

**జవాబు:** సమాజం చారిత్రికంగా అభివృద్ధి అవుతున్న క్రమంలో ఇప్పటివరకు ఉన్న అన్ని మతాలు వ్యక్తిగతంగా, ప్రజా సమూహాల వ్యక్తీకరణలు. కానీ కమ్యూనిజం అనేది చారిత్రకంగా అభివృద్ధి అవుతున్న దశ, ఈ దశ ప్రస్తుతం ఉన్న అన్ని మతాలను నిరుపయోగం చేస్తుంది.

**(అనువాదం: కె.హరికిషోర్)**


**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

విధాన పత్రం

# నూతన విద్యా విధానం2020: సిపిఐ(ఎం) వైఖరి

**ఎ. ప్రారంభం**

1. నూతన విద్యా విధానం (ఎన్‌ఇపి) 2020 విధాన పత్రం కాదు. అది ఒక విజన్ డాక్యుమెంట్ మాత్రమే. పంచదార పూతతో వెలువడిన ఈ పత్రంలో వివరాలు లేవు, ఆచరణ ఎలా ఉండబోతోందో చెప్పే రోడ్ మ్యాప్ లేదు. ఎన్‌ఇపి లోని అనేక అంశాలు ఆచరణయోగ్యంగా లేవు. పైగా ఇవి సంస్థలకూ, విద్యార్థులకూ, ఉపాధ్యాయులకూ హాని కలిగిస్తాయి. దీనివల్ల ఇప్పటికే విద్య అందని ద్రాక్షలా ఉన్న ప్రజలు, విద్య కోసం మరింత ఖర్చు చేయాల్సి వస్తుంది. విద్యకు జిడిపిలో కేటాయింపులను క్రమంగా 6 శాతానికి పెంచుతామని ఎన్‌ఇపి చెబుతోంది. కానీ 1966లో కొఠారి కమిషన్ నివేదిక వచ్చినప్పటినుండి ఇటువంటి హామీలు హామీలుగానే మిగిలి ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వ రికార్డు గమనించినట్లయితే ఇప్పుడు కావలసింది కేంద్ర వార్షిక బడ్జెట్‌లో విద్యకు కేటాయింపులు పెంచుతామన్న నిబద్ధత. అదేసమయంలో ఎన్‌ఇపిలోని సందిగ్ధతనూ, ఇతర అనేక ప్రతిపాదనల్లోని మాటల గారడీలను పరిశీలించినట్లయితే ఇదంతా కూడా కొన్ని కేంద్ర సంస్థలను గుప్పెట్లో పెట్టుకుని విద్యా వ్యవస్థ నిర్వహణను కేంద్ర ప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకునే యత్నంలా కనిపిస్తోంది. ఆ విధంగా అది ఫెడరలిజాన్నీ, అకాడమిక్ సంస్థల స్వయం ప్రతిపత్తినీ నాశనం చేసి విద్య వ్యాపారీకరణనూ, అసమానతలనూ పెంచుతుందన్న ఆందోళన కలిగిస్తోంది. వీటితోబాటు పాఠశాల పిల్లల మనసుల్లో ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని పాదుకొల్పడం ద్వారా దేశంలోని భిన్నత్వాన్ని కూడా నాశనం చేస్తుందన్న ఆందోళన కలిగిస్తోంది. ఈ భావజాలం మన పిల్లల ఆలోచనల్లోనూ, ఆచరణలోనూ హేతు దృక్పథం స్థానంలో అహేతుకత పెంపొందిస్తుంది. మన పిల్లల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పాదుకొల్పి బలపరచడానికి బదులు, ఛాందస వాదం, అశాస్త్రీయ భావాలను పెంపొందిస్తుంది. ఈ భావజాలం భారత భవిష్యత్తు అయిన యువతరాన్ని ఇతరుల ఆలోచనలకు కట్టుబానిసలుగా మార్చేస్తుంది.

1.1 అందువల్ల 21వ శతాబ్దపు రెండవ పావుభాగంలో భారత విద్యావిధానాన్ని ఎన్‌ఇపి ఎలాంటి మార్పులకు గురిచేయనున్నది అన్న ప్రశ్నలు ఉదయిస్తాయి. ఈ కింద చర్చించబోతున్నట్లు ఎన్‌ఇపి అన్ని స్థాయిల్లో విద్యా ప్రమాణాలను దిగజార్చే అవకాశం ఉంది. విద్యా సదుపాయాల్లోనూ, అవకాశాల్లోనూ అసమానతలు పెంచే అవకాశం ఉంది. ఈ పత్రంలో రిజర్వేషన్ల గురించిగానీ, ఇతర సాధికారిక అంశాల గురించిగానీ ఒక్క మాట కూడా మాట్లాడలేదు, గనుక ముఖ్యంగా గ్రామీణ, పేద, ఎస్‌సి, ఎస్‌టి ఇతర బలహీనవర్గాలకు విద్యా అవకాశాలు తగ్గించే అవకాశం ఉంది. కింది నుండి పైవరకు విద్య ఖరీదు పెంచే అవకాశం ఉంది. అన్ని విధాలైన విజ్ఞానాన్ని సంపాదించాలనీ, ప్రపంచవ్యాపితంగా అనుసంధానమై, విజ్ఞానం నైపుణ్యాలతో కూడిన ఆధునిక ఆర్థిక వ్యవస్థలో ఉద్యోగాలు పొందాలనీ భారత బాలలు, యువతరం పడుతున్న ఆశలను నెరవేర్చడంలో ఇది విఫలమయ్యే అవకాశం ఉంది. ఈ విద్యా విధానం మానవ వనరుల సరఫరా వైపు చూస్తోంది. కానీ ప్రభుత్వం అభివృద్ధి చెందుతున్న ఆధునిక ఆర్థిక వ్యవస్థలో తగినన్ని ఉద్యోగాలు సృష్టించాల్సి ఉంది. ఎన్‌ఇపి 'ఉద్యోగార్థుల'కు బదులు 'ఉద్యోగాలు ఇచ్చేవారిని' తయారు చేస్తుందని ప్రధాన మంత్రి డాంబికాలు పలికారు. ఇది మారుతున్న ప్రపంచపు అవసరాలు తీర్చడానికి మన యువతరాన్ని సిద్ధం చేస్తుందని పెద్దపెద్ద మాటలు చెప్పారు. కానీ నేడు దేశంలో నెలకొని ఉన్న భయంకరమైన నిరుద్యోగం వారిని పాఠశాలల నుండీ, ఉన్నత విద్యా సంస్థల నుండి అనేక విధాలుగా వెళ్లగొట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**బి. పసిపిల్లల ఆలన, అభివృద్ధి, విద్య (ఇసిసిఇ)**

2. మూడు నుండి ఆరు సంవత్సరాల పిల్లలకు ఇప్పుడు కల్పిస్తున్న ఇసిసిఇ సంరక్షణను మరో మూడేళ్లు పెంచాలని ఎన్‌ఇపి ప్రతిపాదిస్తోంది. అంతర్జాతీయ నియమాల ప్రకారం ఈ కాలంలో పిల్లలను ఆటలు, పాటలు, యాక్టివిటీలు, మంచి ఆహారం వగైరాలతో ప్రాథమిక పాఠశాలకు సిద్ధం చేయాలి. ఆ విధంగా సురక్షితమైన, ఆప్యాయతతో కూడిన వాతావరణంలో వారి అర్థం చేసుకునే, జ్ఞానాన్ని గ్రహించే సామర్థ్యాన్ని పెంపొందించాలి. దీనికి తగిన విధంగా శిక్షణ పొందిన వ్యక్తులు కావాలి. దీనికోసం విద్య, శిశపాలనలో ప్రత్యేక బాధ్యతలు నిర్వహించగల వారికి తగిన గుర్తింపు ఇవ్వాలి.

2.1 ఈ పనులన్నిటినీ ప్రస్తుతం ఉన్న అంగన్‌వాడీ వ్యవస్థతోనూ, ప్రాథమిక పాఠశాలలతోనూ సరిపుచ్చేయాలని ఎన్‌ఇపి ప్రతిపాదిస్తోంది. అంగన్‌వాడీలు స్థానికంగా గ్రామాల్లో ఉంటున్నారు. తల్లి దండ్రులు పిల్లలను తీసుకువచ్చి, తీసుకు పోడానికి అవకాశంగా ఉంటున్నారు. గనుక వారిని కేంద్ర బిందువుగా చేసుకోవడం, ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేసే పనిని వారికి అప్పగించడం మంచిదే. అయితే అంగన్‌వాడీలకు ఆన్‌లైన్‌ద్వారా అవసరమైన నైపుణ్య శిక్షణ ఇచ్చి, అప్పుడప్పుడూ దగ్గరలోని పాఠశాలల్లో పునశ్చరణ తరగతులు నిర్వహిస్తామని చెబుతున్న ఎన్‌ఇపి, అంగన్‌వాడీల వేతనాలు, పని పరిస్థితులు మెరుగుపరచాలనిగానీ, వారి కొత్త నైపుణ్య స్థాయికి తగ్గ కొత్త పోస్టు ఇస్తామనిగానీ చెప్పడం లేదు.

2.2 స్థానిక పంచాయితీలు, అంగన్‌వాడీ వర్కర్లు ఇసిసిఇ కోసం అంగన్‌వాడీల వద్ద ఆటలు, యాక్టివిటీలకు తగిన సదుపాయాలు, సరంజామా ఏర్పాటు చేసుకోవాలి. ఇళ్లు, కమ్యూనిటీల్లో పారిశుధ్యం, పరిశుభ్రమైన మంచినీరు, ఆహార భద్రత, గర్భిణీ స్త్రీలకు సహాయం కూడా అందించాలి.

**సి. పాఠశాల విద్య**

3. విద్య ఉమ్మడి జాబితాలో ఉంది. కానీ విద్య కేంద్రీకరణవల్ల ఫెడరలిజం, రాష్ట్రాల హక్కులూ తీవ్రంగా కాలరాయబడతాయి. సాంస్కృతికంగా, భాషా పరంగా వైవిధ్యం గల భారత్ వంటి దేశంలో, అందులోనూ పాఠశాల విద్యలో అవసరమైన మార్పులు చేర్పులు చేసుకోడానికి రాష్ట్రాలకు అవకాశం లేకుండా చేస్తుంది. వాటిని కేవలం కేంద్ర విధానాలను అమలు చేసేవిగా మార్చేస్తుంది. ఇప్పటికే ఈ విషయంలో మనం

**❝ అభివృద్ధి చెందిన దేశాలన్నిటిలోనూ జాతీయ పాఠ్యగ్రంధాల చట్రాన్ని రూపొందిస్తారు. పాఠ్యాంశాల రూపకల్పన రాష్ట్రాలకు విడిచిపెడతారు. కానీ ఎన్ఇపి స్థానిక విషయంతో కూడిన జాతీయ పాఠ్యపుస్తకాలు తయారు చేయాలని పేర్కొంది ఇటీవల కోవిడ్ 19 మహమ్మారి పేరు చెప్పి పాఠ్యపుస్తకాల నుండి లౌకికవాదం, విమర్శనాత్మక ఆలోచన అనే అంశాలనూ, కొందరు చారిత్రక, రాజకీయ నాయకుల జీవితాలనూ తొలగించిన విషయాన్ని గమనిస్తే విద్య కేంద్రీకరణ వెనుక ఉద్దేశం ఏమిటో అర్థమవుతుంది. ❞**

వివిధ రాష్ట్రాల్లో నిరసనలు వింటున్నాం. ఉదాహరణకు భాషా విధానం విషయంలో తమిళనాడులో నిరసర వ్యక్తమవుతోంది.

3.1 అత్యంత అభివృద్ధి చెందిన దేశాలన్నిటిలోనూ జాతీయ పాఠ్యగ్రంధాల చట్రాన్ని రూపొందిస్తారు. పాఠ్యాంశాల రూపకల్పన మాత్రం రాష్ట్రాలకు విడిచిపెడతారు. కానీ ఎన్ఇపి మాత్రం స్థానిక విషయం, వాతావరణంతో కూడిన జాతీయ పాఠ్యపుస్తకాలు తయారు చేయాలని ప్రత్యేకంగా పేర్కొంది (పేరా 4.31). ఇటీవల కోవిడ్ 19 మహమ్మారి పేరు చెప్పి పాఠ్యపుస్తకాల నుండి లౌకికవాదం, విమర్శనాత్మక ఆలోచన అనే అంశాలనూ, కొందరు చారిత్రక, రాజకీయ నాయకుల జీవితాలనూ తొలగించిన విషయాన్ని గమనిస్తే విద్య కేంద్రీకరణ వెనుక ఉద్దేశం ఏమిటో అర్థమవుతుంది.

4. ఒకవైపు పాఠశాలలు వేగంగా ప్రయివేటీకరించబడుతుంటే, ప్రభుత్వ పాఠశాలలను పెద్ద ఎత్తున పటిష్ట పరిచి, చురుకుదనం కల్పించాల్సింది పోయి ఎన్ఇపి, ప్రయివేటీకరణకు మరింతగా ద్వారాలు తెరుస్తోంది. "నిజమైన దాతృత్వ సంస్థలు నడిపే"విగా చెప్పబడుతున్న (8.4) పాఠశాలలను కూడా ప్రయివేటీకరణకు గురిచేయాలని ఎన్ఇపి చెబుతోంది. ''ప్రత్యామ్నాయ విద్యా నమూనాల"ను (పేరా 3.6) కూడా ఎన్ఇపి ప్రతిపాదిస్తోంది. ఇదంతా సంఘ్ పరివార్, దాని అనుబంధ సంస్థలకు స్థానం కల్పించడానికే. ప్రభుత్వేతర సంస్థలన్నిటికీ, బోధనాంశాల్లో మార్పులు చేసుకోడానికీ, స్వీయనియంత్రణలకూ (8.5) ఎన్ఇపి అనుమతిచ్చింది. ఇదంతా కూడా ప్రభుత్వ విద్యా విధానాన్ని నీరుగారుస్తుంది. భారత దేశంలోని ప్రయివేటు విద్యా సంస్థల్లో నెలకొని ఉన్న పచ్చి వ్యాపారీకరణనూ, అవినీతినీ ఎన్ఇపి పూర్తిగా విస్మరించింది. దీనిపై అసలు చర్చే లేదు. దాన్ని పూర్తిగా ప్రయివేటు విద్యాసంస్థల స్వీయ నియంత్రణకు వదిలేసింది. తప్పులు సరిచేసుకునేందుకు ప్రయివేటు విద్యా సంస్థలు స్వీయ చైతన్యంతో కృషి చేయాలని చెబుతూ "తేలికైన కానీ గట్టి" నియంత్రణ అమలు పరచాలని పేర్కొంది.

5. ఆర్‌టిఇ 2009 చట్టం కింద 6 నుండి 14 సంవత్సరాల వరకు పిల్లలందరికీ విద్య అందించాలన్న బాధ్యత నుండి ప్రభుత్వం తప్పుకోవాలని ఎన్ఇపి ప్రతిపాదిస్తోంది. దాని స్థానంలో "3 నుండి 18 సంవత్సరాల మధ్య అన్ని స్థాయిల్లో సార్వత్రిక విద్య అందించేందుకు"(3.1) సహాయం చేయాలని పేర్కొంది. పాఠశాల డ్రాపవుట్స్‌పై చర్చ సందర్భంగా వలస కార్మికుల పిల్లలకూ, ఇతర డ్రావవుట్‌లకూ ''పౌర సమాజం సహకారంతో...ప్రత్యామ్నాయ, వినూత్న విద్యా కేంద్రాలను" నెలకొల్పాలన్న నివారణల గురించి చెప్పిందేగానీ ప్రభుత్వ విద్యా సంస్థల్లో చేర్చాలనీ, వాటిలోనే కొనసాగేట్లు చూడాలనీ చెప్పలేదు.

5.1 అదే విధంగా వికలాంగులతో సహా సామాజికంగాఆర్థికంగా వెనుకబడిన (ఎస్ఇడిజి) గ్రూపుల పిల్లలకు జాతీయ, రాష్ట్ర ఓపెన్ పాఠశాలల (ఎన్ఐఒఎస్/ఎస్ఓఎస్) ద్వారా చదువు చెప్పాలని ఎన్ఇపి ప్రతిపాదించింది. అంటే ఇప్పటికే వివక్షకు గురవుతున్న వారి కోసం ప్రభుత్వ విద్యా వ్యవస్థలోనే ప్రత్యేక ఏర్పాట్లు చేయడం కాకుండా వారు మరింత వివక్షకు గురికావడానికి, డిజిటల్ డివైడ్ పెరగడానికీ దోహదం చేస్తుంది.

5.2 సామర్థ్యం, లాభదాయకత, వనరుల గరిష్ట వినియోగం పేరుతో పెద్ద సంఖ్యలో ప్రభుత్వ పాఠశాలలను, ముఖ్యంగా చిన్న, వినిరేనినట్లుండే ప్రాంతాల్లోని పాఠశాలలను మూసేయాలని (పేరా 7) ప్రతిపాదించింది. అంటే అనేక మంది ఉపాధ్యాయులు ఉద్యోగాలు కోల్పోతారన్న మాట. పిల్లలు మరింత ఎక్కువ దూరాలు ప్రయాణించాల్సి వస్తుందన్న మాట.

5.3 ఇరుగుపొరుగు పాఠశాలల పద్ధతి ఆధారంగా ప్రభుత్వ-నిధులతో నడిచే కామన్ పాఠశాల వ్యవస్థను ఏర్పాటు చేయాలని గతంలోని విద్యా కమిషన్లు, విధానాలు కోరాయి. అభివృద్ధి చెందిన, చెందుతున్న ప్రధాన దేశాలన్నీ అమ చేస్తున్న ఈ మౌలిక లక్ష్యాన్ని ఎన్ఇపి 2020 పూర్తిగా విస్మరించినట్లు కనిపిస్తోంది.

6. ఎన్ఇపి ఆధునిక వెసులుబాటు గల విద్యావ్యవస్థ గురించి చర్చించింది. జ్ఞాన సముపార్జన క్రమం, ఫలితాల గురించి నొక్కి చెప్పింది. ఇవన్నీ చెబుతూనే ప్రస్తుత మున్న 10వ గ్రేడ్, 12వ తరగతి బోర్డు పరీక్షలకు తోడు 3,5,8 గ్రేడుల్లో అఖిల భారత ఉమ్మడి పరీక్షలుండాలని (4.40) ప్రతిపాదించింది. వీటికి అదనంగా అన్ని సబ్జెక్టుల్లోనూ అఖిల భారత విశ్వవిద్యాలయ ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుంది. దీనిలో భాగంగా సామర్థ్య మూల్యాంకనం చేయడానికీ, సమీక్షించడానికీ, సంపూర్ణాభివృద్ధి కోసం జ్ఞానాన్ని సమీక్షించడానికీ (పిఎఆర్ఎకెహెచ్) జాతీయ మూల్యాంకన కేంద్రం పేరుతో మరో కేంద్ర సంస్థను ఏర్పాటు చేయాలని (4.41) ప్రతిపాదించింది. నిజానికి పాఠశాల వార్షిక ప్రణాళిక అంతా సెమిస్టరు వారీ, కోర్సుల వారీ, సమయానుగత పరీక్షలతో నిండిపోతుంది. వీటిని కూడా పాఠశాలలు అంతర్గతంగా జరపవు, రాష్ట్రాల్లో ఉన్న కేంద్ర అధికారులు జరుపుతారు, లేక అఖిల భారత స్థాయిలో నిర్వహిస్తారు. అందువల్ల అఖిల భారత, రాష్ట్ర స్థాయి బోర్డుల పాత్ర ప్రశ్నార్థకమయిపోతుంది. ఈ "పరీక్ష రాజ్" అనేది మొత్తం ఎన్ఇపి 2020 వాదనకు భిన్నంగా నడుస్తుంది. ఇది పరస్పర విరుద్ధమైన, ప్రమాదకరమైన ఆలోచనా విధానాన్ని బట్టబయలు చేస్తోంది.

ఎ) భారతీయ సమాజం, సంస్కృతికి సంబంధించి సంఘ్ పరివార్ ఆలోచనా విధానంవైపు విద్యావ్యవస్థను ఎన్ఇపి నెడుతుంది. ఉదాహరణకు, ఎన్ఇపి విమర్శనాత్మక ఆలోచన, శాస్త్రీయ దృక్పథం, రాజ్యాంగ విలువల గురించి చెప్పినప్పటికీ అందులో ఒక్క సారి కూడా "లౌకికతత్వం" అన్న మాట రాలేదు. దేశీయ ఆటలతో సహా గిరిన, దేశీయ జ్ఞానానికి అనుమతిస్తూ "భారతీయ జ్ఞాన వ్యవస్థ''ను బోధిస్తారని (4.27) పేర్కొన్నారు. కానీ ఇదేమిటో నిర్దిష్టంగా చెప్పలేదు. 6 నుండి 8 తరగతుల మధ్య భాషా విద్య గురించి ఎన్ఇపి చెబుతూ "అత్యధిక ప్రధాన భారతీయ భాషల మధ్య చెప్పుకోదగ్గ

ఐక్యత ఉంది...అవన్నీ సంస్కృతం నుండి...ఉమ్మడిగా ఏర్పడినవే" అని పేర్కొన్నారు. ద్రవిడ, ఆదివాసీ భాషా గ్రూపులనూ, ఈశాన్య రాష్ట్రాల్లోని ఇతర భాషా గ్రూపులను పూర్తిగా విస్మరించారు. ఆ విధంగా సంఘ్ పరివార్ ఆలోచన అయిన 'ఒక దేశం, ఒకే భాష' సూత్రాన్ని బలవంతంగా రుద్దుతున్నారు. భారత దేశంలోని శాస్త్రీయ, ఇతర భాషలకు గొప్ప సాహిత్య, సాంస్కృతిక చరిత్ర ఉంది (4.18) అని పేర్కొంటూ ఎన్ఇపిలో పాళి, ప్రాకృతి, పర్షియన్ భాషలను పేర్కొన్నారు గానీ ఉర్దూ బాషను అస్సలు పేర్కొనలేదు.

**డి. ఉపాధ్యాయ విద్య**

7. అర్హతగల, శిక్షణ పొందిన ఉపాధ్యాయుల కొరత, ముఖ్యంగా ప్రభుత్వ విద్యావ్యవస్థలో అందులోనూ గిరిజన, మారుమూల ప్రాంతాల్లో ఈ కొరత తీవ్రంగా ఉందని ఎన్ఇపి 2020 గుర్తించింది కానీ దానికి తగ్గ చర్యలను మాత్రం ప్రతిపాదించలేదు. కొన్ని రాష్ట్రాల్లో చాలా మంది ఉపాధ్యాయులున్నారు కానీ ఆర్టిఇ ప్రకారం వృత్తి శిక్షణ పొందలేదు. "పాఠశాల కాంప్లెక్సులు" ఏర్పాటు చేయడం, పాఠశాలల మధ్య ఉపాధ్యాయులను మార్చిడి చేయడం (5.5) అనే ఆచరణ సాధ్యం కాని, వాస్తవ విరుద్ధమైన పరిష్కారం మినహా ఈ సమస్యకు ఎన్ఇపి ఎటువంటి ఆచరణయోగ్యమైన పరిష్కారం చెప్పలేదు. పాఠశాల ఉపాధ్యాయులను ఇష్టం వచ్చినట్లు "బదిలీచేసే పరిశ్రమ"కు చరమగీతం పాడతామని హామీ ఇచ్చారు. అయితే రాష్ట్రాల పూర్తి సహకారం లేనిదే ఈ పని కాదు. ఎన్ఇపిలో రాష్ట్రాల పాత్రను తీసి పక్కన బెట్టారు.

8. ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (టెట్) నిర్వహించాలనీ, వాటిని పునాది నుండి సెకండరీ వరకు విద్యావ్యవస్థలోని అన్ని స్థాయిలకూ విస్తరించాలని ఎన్ఇపి పేర్కొంది. ఇక్కడ కూడా ఎన్ఇపిలోని కేంద్రీకృత "పరీక్షా రాజ్" మనకు కనిపిస్తుంది.

9. నర్సరీ నుండి 12వ గ్రేడ్ వరకు ఉపాధ్యాయులందరికీ 4 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ బిఇడి, ఒక సబ్జెక్ట్ స్పెషలైజేషన్‌తో ఉండాలన్న (15.5) నిబంధన అన్నిటికన్నా సమస్యాత్మకమైనది. గతంలో 6 నుండి 8వ గ్రేడ్ వరకు ఉపాధ్యాయులు బి.ఇఎల్ ఇడి (బ్యాచులర్ ఆఫ్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్) కోర్సు చేస్తే సరిపోయేది. 9-10 గ్రేడ్ ఉపాధ్యాయులకు 2 సంవత్సరాల బిఇడి కావాలి, 11-12 ఉపాధ్యాయులకు పోస్ట్ గ్రాడ్యుయేట్ అర్హత కావల్సి ఉండేది. ప్రతి స్థాయిలో ఆయా అవసరాలకు తగ్గట్లు ఇది ఉంది. ఎన్ఇపి ప్రకారం 4 సంవత్సరాల డిగ్రీ చేసేవారు 1-సంత్సరం కోర్సు చేయాలి, 3-ఏళ్ల బిఎ చేసే వారు 2-సంవత్సరాల కోర్సు చేయాలి. ఇదంతా పూర్తి స్థాయి ఉపాధ్యాయ శిక్షణ కాకుండా అంతకు ముందు చదివిన అకడమిక్ అర్హతలకు అనవసరపు వెయిటేజీ ఇవ్వడం అవుతుంది. చివరికి 2 వారాల నుండి 3 మాసాల షార్ట్-టెర్మ్ కోర్సులు చేసేవారిని కూడా సరైన అర్హతలు లేకపోయినా ''వాలంటీర్-పార్ట్ టైమ్-సహాయ ఉపాధ్యాయులుగా'' తీసుకోవచ్చునని చెప్పారు. అంటే ఉపాధ్యాయుల నాణ్యతను నీరుగార్చడం, వ్యాపారీకరణకు అవకాశాలు కల్పించడమే.

10. ఉపాధ్యాయుల ఆన్‌లైన్ శిక్షణ కోసం అవకాశాన్ని బట్టి స్వయం-దీక్షా కార్యక్రమాలను ఉపయోగించుకోవచ్చునని (15.10) ప్రతిపాదించారు. ఇది మన దేశంలోని డిజిటల్ అసమానతలను ముఖ్యంగా, గ్రామీణ ప్రాంతాల్లోనూ, గిరిజన, మారుమూల ప్రాంతాల్లోనూ ఉన్న అసమానతలను ఏమాత్రం దృష్టిలో పెట్టుకోకుండా చేసిన ప్రతిపాదన. ఇది ఉపాధ్యాయుల, విదార్థుల నైపుణ్యాన్ని మరింత దిగజారుస్తుంది.

11. ఎస్ఇడిజి ఇతర ప్రత్యేక అవసరాల (వికలాంగ) విద్యార్థులకు సంబంధించిన ఉపాధ్యాయ శిక్షణ గురించి ఎన్ఇపి నిర్దిష్టంగా ఏమీ చెప్పలేదు. దీని వల్ల ఈ విద్యార్థి గ్రూపులు నష్ట పోతారు. ప్రత్యేక విద్యా ఉపాధ్యాయులకు పద్ధతి ప్రకారం శిక్షణ ఇవ్వాలన్న విషయాన్నే ఎన్ఇపి నిర్దిష్టంగా పేర్కొనక పోవడం ఆందోళన కలిగించే విషయం.

**" ఎస్ఇడిజి ఇతర ప్రత్యేక అవసరాల (వికలాంగ) విద్యార్థులకు సంబంధించిన ఉపాధ్యాయ శిక్షణ గురించి ఎన్ఇపి నిర్దిష్టంగా ఏమీ చెప్పలేదు. దీని వల్ల ఈ విద్యార్థి గ్రూపులు నష్టపోతారు. ప్రత్యేక విద్యా ఉపాధ్యాయులకు పద్ధతి ప్రకారం శిక్షణ ఇవ్వాలన్న విషయాన్నే ఎన్ఇపి నిర్దిష్టంగా పేర్కొనక పోవడం ఆందోళన కలిగించే విషయం. "**

**ఇ. వృత్తి విద్య**

12. యువతకు వృత్తి విద్య నేర్పడం అంటే ఏమిటి? వారికి నైపుణ్యాలు నేర్పడం, వృత్తికి సంబంధించిన భావనలనూ, జ్ఞానాన్ని విద్య ద్వారా సమకూర్చడం. ఈ విషయంలో భారత దేశం చాలా కాలంగా ప్రాచీన భావాల నుండి ముందుకు వెళ్లలేకపోతోంది. వస్తూత్పత్తి, సర్వీసు రంగాల్లో ప్రధానమైన టెక్నాలజీ మారిపోతున్న, అనేక వ్యవస్థాగత మార్పులు జరుగుతున్న ఆధునిక ఆర్థిక వ్యవస్థలో ఇది మరింత గొప్ప ప్రాముఖ్యత సంతరించుకుంది. వేల సంవత్సరాలుగా కుల, వర్గాలతో నిండిన భారతీయ సమాజంలో మధ్యతరగతి వర్గం-ఎగువ కులాలు విద్య పొందారు. కింది వర్గాలు-కులాలు వంశపారంపర్యంగా వచ్చిన నైపుణ్యాలు పొందారు. ఈ నాటికీ ఈ భావనే రాజ్యమేలుతున్నది. విద్యా వ్యవస్థకూ, నైపుణ్య వ్యవస్థకూ మధ్య ఒక కనిపించని "అడ్డుగోడ" ఉంది. ఆధునిక పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థకు ఇది పనికిరాదు. ఎందుకంటే ఈ వ్యవస్థలో ఆధునిక నైపుణ్యాలు అవసరమే కాదు వాటికి సంబంధించిన విజ్ఞానం కూడా కావాలి. భారత దేశంలో 2 శాతం కార్మికులు మాత్రమే నైపుణ్య శిక్షణ పొందుతున్నారు. అదే చైనాలో 55 శాతం, ఐరోపా యూనియన్, దక్షిణ కొరియాలో 80-85 శాతం, జపాన్‌లో 90 శాతం పైగా శిక్షణ పొందుతున్నారు. అనేక ఆధునిక అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల్లోనూ, ఆగ్నేయాసియా వంటి 'ఎదుగుతున్న' వర్ధమాన దేశాల్లోనూ వృత్తి విద్యను పాఠశాల విద్య తరువాత మూడో దశలో భాగంగా పరిగణిస్తారని అంతర్జాతీయ అనుభవాలు చెబుతున్నాయి. ఆ దేశాల్లో మాధ్యమిక విద్య పూర్తిగా పూర్తిచేసిన తరువాతగానీ లేక అక్కడ కొన్ని కనీస స్థాయిలు దాటిన తరువాతగానీ వృత్తి విద్యను చేపడతారు. పాఠశాలల్లో +2 స్థాయిలో వృత్తి విద్య ప్రారంభించాలా లేక ఐటిఐలలో ప్రారంభించాలా అన్న వాటి మధ్య ఇప్పటి వరకు భారత దేశం ఊగిసలాడుతోంది. మొదటివి డ్రాపవుట్లను కూడా ఆపలేని స్థాయిలో ఉండగా తరువాతివి చాలా బలహీనంగా ఉన్నాయి.

> **"భారత ఉన్నత విద్యలో ఇప్పటికే చాలావరకు ప్రయివేటీకరణ జరిగిపోయింది. 2018-19 సంవత్సరంలో కళాశాల విద్యార్థుల్లో 45 శాతం మంది ప్రయివేటు, అనెయిడెడ్ కాళాశాలల్లోనూ, 21 శాతం మంది ప్రయివేటు ఎయిడెడ్ కళాశాలల్లోనూ చేరారు. ప్రొఫెషనల్ కోర్సుల్లోని 72.5 శాతం మంది అండర్ గ్రాడ్యుయేట్‌లు, 60 మంది పోస్ట్ గ్రాడ్యు యేట్‌లూ ప్రయివేటు అన్‌ఎయిడెడ్ సంస్థల్లోనే ఉన్నారు."**

13. వృత్తి విద్య విషయంలో ఎన్ఇపి 2019 ముసాయిదా దీనికన్నా కొంత మేరకు మెరుగ్గా ఉంది. అక్కడ కూడా అనేక సమస్యలున్నప్పటికీ అది ఉన్నత విద్యలోని వివిధ స్థాయిలు, సమయాల్లో వృత్తి విద్య కోర్సులు ప్రవేశపెట్టాలనీ, వాటిని ఐటిఐలతోనూ, పరిశ్రమలు, ఇతర ఆచరణాత్మక శిక్షణా కేంద్రాలతోనూ టై-అప్ చేయాలనీ సూచించింది. కానీ ఎన్ఇపి దీన్ని వెనక్కు మళ్లించడమే కాకుండా గతంలో లాగా వివరాలు కూడా ఇవ్వలేదు. వృత్తి విద్యా కోర్సులను "దశలవారీగా సెకెండరీ పాఠశాల విద్యతో అనుసంధానం చేయాలి" (16.5) అని ఎన్ఇపి చెబుతూ ఈ విధంగా చేసే క్రమంలో ''సెకెండరీ పాఠశాలలను ఐటిఐలు, పాలిటెక్నిక్‌లు, స్థానిక పరిశ్రమలు వగైరాలతో" కలిసి పనిచేయాలి అని పేర్కొంది. అనేక విధాలా అది తిరోగమన చర్య.

13.1 దీని వల్ల 10వ గ్రేడు తరువాత డ్రాపవుట్స్ ఉంటారని ఎన్ఇపి పరోక్షంగా అంగీకరించడమే కాకుండా పిల్లలు పూర్తి స్థాయిలో సెకెండరీ విద్యను పొందకుండా అడ్డుకుంటుంది. సామర్థ్యం గల కార్మికులను తయారుచేయడానికే కాకుండా, సాధికారిక పౌరులను తయారు చేయడానికి కూడా సెకెండరీ విద్య అవసరమని ఆధునికమైన అనేక దేశాలు భావిస్తున్నాయి. ఈ దశలో సంపాదించిన నైపుణ్యాలు తక్కువ స్థాయిలోనూ, ప్రవేశ స్థాయిలోనూ ఉండడమే కాకుండా వాస్తవ పారిశ్రామిక, సర్వీసు రంగ ఉద్యోగాలకు సరిపోవు.

13.2 9వ గ్రేడు నుండి విద్యార్థులు వివిధ ఆధునిక వృత్తులు, హస్తకళలు, రంగాల్లో ప్రాథమిక జ్ఞానం సంపాదించాలి. కానీ ఇది ప్రారంభం మాత్రమే. ఈ దశలో విద్యార్థులు వివిధ ఆప్షన్లు ఎంచుకునే అవకాశం కలుగుతుంది. అయితే పాఠశాల విద్య తరువాత మాత్రమే ఉద్యోగాలకు పనికి వచ్చే నైపుణ్యాలు పొందడం గానీ, లేక మూడో దశ విద్యకు వెళ్లడం గానీ జరుగుతుంది.

13.3 ఇప్పటికే తీవ్రమైన భారం మోస్తున్న పాఠశాల విద్యా వ్యవస్థపై ఈ స్కీము మరింత భారం మోపుతుంది. తగినన్ని నైపుణ్యాలు, అనుభవం, అర్హతలు కలిగిన కొత్త ఉపాధ్యాయుల అవసరం ఉంది. అన్నిటికీ మించి వివిధ వృత్తులు, పనులకు సంబంధించిన ఖరీదైన మౌలిక వసతులు, యంత్రాలు అవసరమవుతాయి. నైపుణ్యాలు పెంచడం, విజ్ఞానం అందించడం..అనే రెండు లక్ష్యాలు సాధించడం ఆచరణలో సాధ్యం కాదు గనుక ఇది విఫలం కాక తప్పదు.

**ఎఫ్. ఉన్నత విద్య**

14. భారత ఉన్నత విద్యలో ఇప్పటికే చాలావరకు ప్రయివేటీకరణ జరిగిపోయింది. 2018-19 సంవత్సరంలో కళాశాల విద్యార్థుల్లో 45 శాతం మంది ప్రయివేటు, అనెయిడెడ్ కాళాశాలల్లోనూ, 21 శాతం మంది ప్రయివేటు ఎయిడెడ్ కళాశాలల్లోనూ చేరారు. ప్రొఫెషనల్ కోర్సుల్లోని 72.5 శాతం మంది అండర్ గ్రాడ్యుయేట్‌లు, 60 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్‌లూ ప్రయివేటు అన్‌ఎయిడెడ్ సంస్థల్లోనే ఉన్నారు. అయినప్పటికీ అనేక ప్రభుత్వ సంస్థలు ముఖ్యంగా ప్రొఫెషనల్ కోర్సుల్లో ఫీజులు విపరీతంగా పెంచేశారు. విశ్వ విద్యాలయాల్లో చేరే వారు ప్రధానంగా ప్రభుత్వ సంస్థల్లోనే చేరుతున్నారు. ఈ సంస్థల్లో అయిదింట నాలుగు వంతుల విద్యార్థులున్నారు. అయితే ఇక్కడ కూడా పరిస్థితులు వేగంగా మారిపోతున్నాయి. 2014-15 నుండి 2018-19 మధ్య 55 శాతం మంది యూనివర్శిటీ విద్యార్థులు ప్రయివేటు యూనివర్శిటీల్లో చేరారు. 33 శాతం మంది ప్రభుత్వ ఓపెన్ యూనివర్శిటీల్లో చేరారు. (రెగ్యులర్ కేంద్ర, రాష్ట్ర యూనివర్శిటీల్లో కాదు. ఇక్కడ చాలా కాలంగా విద్యార్థుల చేరిక నిలిచిపోయింది, లేక తగ్గింది.) ప్రయివేటు విశ్వవిద్యాలయాలు, ఇతర ఉన్నత విద్యా సంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. వీటిలో చాలా వాటికి ముఖ్యంగా ప్రొఫెషనల్, టెక్నికల్ సబ్జెక్ట్స్ చెప్పేవాటికి కనీస సదుపాయాలు లేవు. ఫీజులపై నియంత్రణ లేదు గనుక ఇవి నిరంతరం ఫీజులు, ఇతర రహస్య ఛార్జీలు పెంచేస్తుంటాయి. అయినప్పటికీ సరైన అర్హతలు, శిక్షణ గలిగిన గ్రాడ్యుయేట్‌లను అందించలేకపోతున్నాయి. మరోవైపు ప్రభుత్వ యూనివర్శిటీలు నిధులకు కటకటలాడుతున్నాయి. పరిశోధన మాట అటుంచి లెక్చరర్లకు జీతాలివ్వడానికి కూడా వీటి వద్ద డబ్బులేదు. అందువల్ల గతిలేని పరిస్థితుల్లో ఇవి ఫీజులు పెంచడమో లేక ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోవడమో జరుగుతోంది. ఎన్ఇపి 2020లో ఈ సమస్యలకు పరిష్కారం చూపకపోగా తీయటి మాటలతో ప్రయివేటీకరణ, వ్యాపారీకరణ, అసమానతలు, నైపుణ్య లేమి వైపు వాటిని తీసుకుపోయే ప్రతిపాదనలు చేసింది.

15. ఉన్నత విద్యారంగంలో తీవ్రమైన అసమానతలున్నాయన్న విషయాన్నిగానీ, పేదలు, దళితులు, గిరిజనులు, మైనారిటీ మతస్తులు, ఆడపిల్లలు, ఇతర బలహీనవర్గాలకు ఉన్నత విద్యా సంస్థలు అందుబాటులో లేవనిగానీ ఎన్ఇపి అసలు గుర్తించకపోవడం గమనించదగ్గ విషయం.

15.1. అయినప్పటికీ "రిజర్వేషన్" అనే పదం ఈ మొత్తం పత్రంలో ఒక్క చోట కూడా కనిపించలేదు. ఉన్నత విద్యలో ప్రధాన సమస్యలను గురించి చర్చించే సందర్భంగా ''సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాల్లో స్థానిక భాషల్లో బోధించే సంస్థల్లో ... అవకాశాలు తక్కువ" అని మాత్రమే ఎన్ఇపి పేర్కొంది. అంతేగానీ భారత దేశంలోని ఉన్నత విద్యను పట్టి పీడిస్తున్న అసమాతల గురించి గానీ, ఇవి ఉపాధిమీద ఎటువంటి ప్రభావం చూపిస్తున్నాయన్న దాని మీదగానీ ఒక్క మాట కూడా చెప్పలేదు.

15.2. ఎన్ఇపి ప్రకారం ఉన్నత విద్యా సంస్థల్లోకి ప్రవేశాలను జాతీయ పరీక్షా సంస్థ నిర్వహిస్తుంది (4.42). అయితే ఆయా సంస్థలు ఈ మార్కులను ఇష్టం ఉంటే పరిగణనలోకి తీసుకోవచ్చు లేకుంటే దీనితోపాటు తాము స్వంతంగా రూపొందించుకున్న ప్రమాణాను తీసుకోవచ్చు. ఇప్పటివరకు "మెరిట్ ఆధారిత వ్యవస్థలన్నీ" మనకు తెలుపుతున్నదేమంటే ఇవన్నీ ఎస్సీ, ఎస్టీ

ఇతర బలహీనవర్గాలను ఏదోఒక పద్ధతిలో వెళ్లగొడతాయి.

15.3. ప్రధాన స్రవంతి ప్రయివేటు ఉన్నత విద్యాసంస్థల్లో చేరలేనివారూ, ప్రభుత్వ సంస్థల్లో కూడా పెరుగుతున్న ఫీజులను తట్టుకోలేని వారూ ఓపెన్ లెర్నింగ్‌కు మారిపోవాలనీ, ఉన్నత విద్యలో అసమానతల సమస్యకు ప్రధానమైన పరిష్కారం కాకపోయినా ఒక ముఖ్య పరిష్కారం ఇదేననీ ఎన్ఇపి సూచించింది. దీనివల్ల స్థూల ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జిఇఆర్) పెరుగుతుందని (12.5–12.6) సూచించింది. పేదలు క్రమంగా ఉన్నత విద్యా సంస్థలకు దూరమై ఓపెన్ లెర్నింగ్ డిగ్రీలవైపు మొగ్గుతారు. దాని వల్ల ఇతర మధ్య ఆదాయ తరగతి దేశాలతో పోలిస్తే ఇప్పటికే చాలా తక్కువగా ఉన్న భారత స్థూల ఎన్‌రోల్‌మెంట్ రేషియో మరింత తగ్గుతుంది.

15.4. సామాజికా-ఆర్థిక వెనుకబాటు గలవారి (వారినే ఇప్పుడు కొత్తగా ఎస్ఇడిజి లు అని పేర్కొంటున్నారు) సమస్యకు పరిష్కారం ఉచిత షిప్పులు లేక స్కాలర్‌షిప్పులివ్వడమేనని మరో ప్రతిపాదన చేశారు. కాని దానికి ప్రభుత్వం ఏవిధంగా మద్దతిస్తుందో నిర్దిష్టమైన వివరాలు లేవు. “పెద్ద ఎత్తున ఉచిత షిప్పులు, స్కాలర్‌షిప్పులు ఇచ్చే విధంగా ప్రయివేటు ఉన్నత విద్యా సంస్థలను ప్రోత్సహించడం జరుగుతుంది” అని కూడా ఎన్ఇపి పేర్కొంది. కానీ దీనికి కూడా ప్రభుత్వం నుండి నిర్దిష్టమైన హామీలేవీ లేవు. (12.10).

16 అఫిలియేటెడ్ కళాశాలను రద్దు చేసి పెద్ద బహుళ సబ్జెక్టుల యూనివర్శిటీలకు లేక ఉన్నత విద్యా సంస్థలకు మారిపోవాలని ఎన్ఇపి ఒక పెద్ద ప్రతిపాదన చేసింది. ఈ సంస్థలు, కొన్ని అటానమస్ కాలేజీలు అనేక రకాల కోర్సులు ఆఫర్ చేస్తాయనీ, డిగ్రీలు కూడా మంజూరు చేస్తాయని ప్రతిపాదించింది.

16.1. ఈ రకమైన చర్యలు ఎంతవరకు ఆచరణసాధ్యం, ఇంత పెద్ద సంస్థలు నెలకొల్పడం సాధ్యమా అన్న విషయమై అనేక ప్రశ్నలు లేవనెత్తబడ్డాయి. ఈ చర్యలు చేపట్టడం అంటే అఫిలియేటెడ్ కళాశాలలను మూసేస్తారు కొత్త భారీ ఉన్నత విద్యా సంస్థలను నెలకొల్పుతారు. ఇవి గ్రామీణ ప్రాంతాల్లోనూ, మారుమూల ప్రాంతాల్లోనూ ఉన్న విద్యార్థులకు చాలా దూరంగా ఉంటాయి. దాంతో విద్యార్థుల చదువు ఖర్చులు పెరిగి వారికి విద్య దూరమయ్యే అవకాశం ఉంది. ఐఐటిలు, బహుశా మెడికల్ కళాశాలలు కూడా ఈ విధంగా మార్పు

> **❝ ఈ బహుళ కోర్సుల ఉన్నత విద్యా సంస్థలు 4 సంవత్సరాల అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు ఆఫర్ చేస్తాయి. ఈ కోర్సుల్లో చేరేవారికి ప్రతి ఏటా సర్టిఫికేట్లు, డిప్లమాలు, అడ్వాన్సుడు డిప్లమాలు, డిగ్రీలు జారీ చేస్తాయి. జీవిత కాలం నేర్చుకోడానికీ, పరిశ్రమల్లో ఉద్యోగాలు తాత్కాలికంగా పోయినప్పుడూ ఈ కోర్సుల్లో చేర్చుకుంటారు అంటే అర్థం చేసుకోవచ్చు. కానీ ప్రతి ఏటా సర్టిఫికేట్లు, డిప్లమాలు ఇవ్వడం అంటే అర్థం లేని విషయం. ❞**

చెందాలని ఎన్ఇపి ఒక విచిత్రమైన సూచన చేసింది. ఈ ప్రతిపాదనతో అనేక ఇతర సమస్యలు తలెత్తుతాయి.

16.2. ఈ బహుళ కోర్సుల ఉన్నత విద్యా సంస్థలు 4 సంవత్సరాల అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు ఆఫర్ చేస్తాయి. ఈ కోర్సుల్లో చేరేవారికి ప్రతి ఏటా సర్టిఫికేట్లు, డిప్లమాలు, అడ్వాన్సుడు డిప్లమాలు, డిగ్రీలు జారీ చేస్తాయి. జీవిత కాలం నేర్చుకోడానికీ, పరిశ్రమల్లో ఉద్యోగాలు తాత్కాలికంగా పోయినప్పుడూ ఈ కోర్సుల్లో చేర్చుకుంటారు అంటే అర్థం చేసుకోవచ్చు. కానీ ప్రతి ఏటా సర్టిఫికేట్లు, డిప్లమాలు ఇవ్వడం అంటే అర్థం లేని విషయం. అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులను ఈ విధంగా ఏ యేటికాయేడు పట్టాలివ్వడానికి రూపొందించలేదు. చాలా దేశాల్లో ఉన్నత విద్యా సంస్థలు తక్కువ కాలం సర్టిఫికేట్లు–డిప్లమా కోర్సులను, ముఖ్యంగా వృత్తి విద్యకు సంబంధించి ఆఫర్ చేస్తున్నాయి. అయితే ఇవి వివిధ స్థాయిల్లో నిర్దిష్టమైన జాతీయ స్టాండర్డ్ క్వాలిఫికేషన్ చట్రం (ఎన్ఎస్‌క్యూఎఫ్) స్టాండర్డ్స్‌ను అనుగుణంగా ఉండడం కోసం రూపొందించబడ్డాయి. అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు పూర్తిగా భిన్నమైనవి. అవి పైన చెప్పినట్లు పనిచేయవు. అటువంటి నిర్మాణం డిగ్రీ కోర్సులోని బోధన విషయాన్ని, డిగ్రీ విలువనూ దిగజార్చేస్తుంది.

16.3. జాతీయంగా రూపొందించబడిన విస్తృత చట్రంలోనే ప్రతి ఉన్నత విద్యా సంస్థ వివిధ కోర్సులకు తన స్వంత పాఠ్యాంశాలు రూపొందించుకోవచ్చుననీ, తద్వారా ఉన్నత విద్యలో స్వేచ్ఛాయుత వాతావరణం నెలకొంటుందని ఎన్ఇపి ప్రతిపాదించింది. దేశానికి వివిధ అభివృద్ధి దశల్లో కావాల్సిన విద్యావసరాలను లేక మానవ వనరుల అవసరాలను గుర్తించి దాని ఆధారంగా ప్రభుత్వ మార్గదర్శకత్వంలో చట్రం రూపొందించే ప్రతిపాదన ఏదీ ఎన్ఇపి చేయలేదు. వీటన్నిటినీ వ్యక్తిగత ఉన్నత విద్యాసంస్థలకు వదిలేశారు. బహుశా మార్కెట్ మార్గదర్శకత్వానికి వదిలిపెట్టి ఉంటారు.

16.4. ప్రొఫెషనల్, టెక్నికల్ ఉన్నత విద్యా సంస్థలకు కూడా స్థూలంగా ఇదే పద్ధతి పాటిస్తున్నారు. ఇక్కడ జతకలిసిన ఇంకో బలహీనత ఏమంటే ఈ కోర్సులు, పాఠ్యాంశాలు వగైరాలను నిర్ణయించేటప్పుడు జాతీయ విజ్ఞాన శాస్త్ర, పారిశ్రామిక ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకోలేదు.

16.5. ప్రస్తుతమున్న అటానమస్ కళాశాలల అనుభవాన్ని పరిశీలించినప్పుడు కళాశాలలకు ఇచ్చే గ్రేడెడ్ అటానమీ అనేది మరింత ప్రయివేటీకరణకు, అధిక ఫీజులకు దారి తీస్తుంది. షార్ట్ టెర్మ్ కోర్సులు ఏర్పాటు చేసుకోడానికి స్వేచ్ఛనివ్వడం ఉన్నత విద్యను మరింత ప్రయివేటీకరిస్తుంది.

17. పైన చెప్పిన ప్రతిపాదనలన్నిటినీ ఉన్నత విద్యలో ప్రతిపాదించిన రెగ్యులేటరీ వ్యవస్థకు లింకు చేయబడింది. “తేలికైన, పటిష్టమైన” (లైట్ అండ్ టైట్) అని చెప్పబడుతున్న చట్రం కోసమే ఈ రెగ్యులేటరీ వ్యవస్థను ప్రతిపాదించారు. అంటే దీనర్థం విస్తృతమైన అకాడమిక్ వ్యవస్థలనూ, ఫలితాల అంచనా వ్యవస్థలనూ ‘పటిష్టంగా’ పర్యవేక్షించడం మిగతా అన్నిటినీ అంటే పాఠ్యాంశాలు ఫీజులు, కోర్సుల రూపకల్పన, ఉపాధ్యాయుల జీతాలు, పని పరిస్థితులు మొదలైన వాటిని ‘తేలికగా’ వదిలేయడం అన్నమాట. అంటే ఉన్నత విద్యా సంస్థలకు వదిలేయడం అన్నమాట. ఇది ఉన్నత విద్యను కార్పొరేటీకరించడానికి, ప్రయివేటీకరించడానికి, వ్యాపారీకరించడానికి ఆహ్వానం పలకడమే.

17.1. ప్రతి ఉన్నత విద్యా సంస్థ తన బోర్డ్ ఆఫ్ గవర్నర్స్‌ను స్వతంత్రంగా ఏర్పాటు చేసుకోవాలి, తరువాత అది యూనివర్శిటీ వ్యవహారాలను పూర్తిగా చేజిక్కించుకోవచ్చు అని

> **"ఎన్ఇపి వల్ల ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున నష్టపోతారు. ఉన్నత విద్యా సంస్థల్లో కార్పొరేట్ తరహా నిర్వహణ వల్ల విద్యార్థులు గినియా పందుల మాదిరిగా నలిగి పోతారు, సమాజంలో ఎస్‌సి, ఎస్టీ, ఇతర వెనుకబడిన సెక్షన్లు బాగా దెబ్బ తింటారు. ఉపాధ్యాయుల జీతాలు, ఉద్యోగ నియామక పద్ధతి, నియామక కాలం, ప్రమోషన్లు వంటివాటినన్నిటినీ ఉన్నత విద్యా సంస్థల్లోని గవర్నింగ్ బాడీలు అంతర్గతంగా నిర్ణయిస్తాయి. దీని వల్ల ప్రభుత్వం సూచించిన యూనిఫార్మ్ ప్రమాణాలు, నిబంధనలు ఉండవు."**

ఎన్ఇపి చేసిన ప్రతిపాదన కార్పొరేట్ నిర్మాణాన్ని పోలి ఉంది.

17.2. ఉన్నత విద్యాసంస్థలు దేనికదే తన స్వంత నిధులను "దాతృత్వ" వనరుల (అంటే కార్పొరేట్ సంస్థలన్నమాట) ద్వారా సమకూర్చుకోవచ్చు. అంతే కాదు అవి తమ స్వంత ఫీజు వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవచ్చు. కాకపోతే అవి విస్తృత ప్రభుత్వ మార్గదర్శకాలు అని చెప్పబడుతున్న వాటికి లోబడి ఉండాలి. "చేసిన ఖర్చులను ఒక మోస్తరుగా రాబట్టుకునే పద్ధతిలో ఫీజులు నిర్ణయించే వ్యవస్థ ఉండాలి" అని పేర్కొంది. ఆర్థిక వ్యవస్థలోని ఇతర రంగాల్లో అంటే విద్యుత్ పంపిణీ, విమాన యానం వగైరాల్లో అనుసరిస్తున్న మార్గమే ఇది. వీటిలో కూడా కనిపించీ కనిపించని "నియంత్రణలతో" కార్పొరేట్‌లు పెట్టిన పెట్టుబడికి మంచి లాభాలు గడించేందుకు ప్రభుత్వం సదుపాయకర్తగా (ఫెసిలిటేటర్ గా) పనిచేస్తుంది.

17.3. ఈ నియంత్రణ వ్యవస్థను పరిశీలిస్తే మనకు అర్థమయ్యేదేమిటంటే, ప్రభుత్వం కేవలం "తేలికైన" నియంత్రణ ప్రమాణాలను పెడుతుంది, కానీ ఆ ప్రమాణాలను అందుకోడానికి ఉన్నత విద్యాసంస్థలకు ఎటువంటి నిధులు సమకూర్చదు. ఉన్నత విద్యా సంస్థలకు నిధులు ఎలా సమకూర్చాలి అన్న విషయాన్ని ఎన్ఇపిలో ఎక్కడా పేర్కొనలేదు. ప్రభుత్వ నిధులు సమకూర్చడంలో ప్రభుత్వ ఉన్నత విద్యాసంస్థలకు ప్రత్యేక హక్కులు ఏమైనా ఉన్నాయా లేక సమానావకాశాల హామీ అనేది నిధులకు కూడా వర్తిస్తుందా అన్న విషయం పేర్కొనలేదు. తగినన్ని ప్రభుత్వ నిధులు అందకపోతే ప్రభుత్వ ఉన్నత విద్యా సంస్థలు కూడా ప్రయివేటు విద్యాసంస్థలు అమలు చేసే పద్ధతులే అమలు చేస్తాయి. ఫలితంగా అవి కూడా వ్యాపారీకరణ చెందడం, అందరికీ అందుబాటులో లేకపోవడం జరుగుతుంది.

18. ఎన్ఇపిలో ప్రతిపాతిపాదించబడిన అన్ని చర్యల్లోనూ విస్తృతాధికారాలను కేంద్రీకరించడం కనిపిస్తుంది. రాష్ట్రాలకు వాటిని అమలు చేయడం మినహా ఇతరత్రా పాత్ర ఏమీ లేకుండా పోతుంది.

18.1. ఉన్నత విద్యా మండలి (హెచ్ఇసిఐ), ఎన్‌హెచ్ఇఆర్‌సిల నియంత్రణ కింద పనిచేసే అనేక రకాలైన కేంద్ర సంస్థలను నెలకొల్పాలని ప్రతిపాదించారు. అక్రిడిటేషన్‌లు ఇవ్వడానికి జాతీయ అక్రిడిటేషన్ మండలి (నాక్) ఉంటుంది. హెచ్ఇజిసి గ్రాంట్లు ఇస్తుంది. జిఇసి ఎంలాంటి ప్రమాణాలుండాలో నిర్ణయిస్తుంది. ఫలితాల అంచనాలను కేంద్ర స్థాయిలో చేస్తారు. ఇదే రేటింగ్స్‌నీ, అక్రిడిటేషన్లనూ, నిధులు సమకూర్చడాన్ని కూడా నిర్ధేశిస్తుంది. ఈ సంస్థల కోసం విద్యావంతులు, పేరెన్నికగన్న వ్యక్తులను ఎంపిక చేస్తామని చెబుతున్నప్పటికీ ప్రభుత్వమే నిర్ణాయకంగా ఉంటుందన్నది స్పష్టం.

18.2. ఒక కేంద్ర సంస్థ ఉన్నత విద్యాసంస్థల ప్రవేశాల కోసం ఒక జాతీయ పరీక్ష నిర్వహిస్తుంది. ఈ పరీక్ష ఫలితాలను తమ సంస్థల్లో ప్రవేశాలకు ఉపయోగించుకోవడం, ఉపయోగించుకోకపోవడం ఆయా ఉన్నత విద్యాసంస్థల ఇష్టమని చెప్పిన తరువాత ఈ పరీక్షలు ఎందుకో అర్థం కాదు. అలాగే రాష్ట్ర పరీక్షల బోర్డులు, అవి నిర్వహించే పరీక్షలు ప్రశ్నార్ధకమవుతాయి. రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, రాష్ట్ర స్థాయి ఉన్నత విద్యా సంస్థలు ఎలా పనిచేయాలి అన్నవిషయంలో ఎన్ఇపి వివరణ ఇవ్వలేదు. అంటే దేశంలోని ఉన్నత విద్యా సంస్థలన్నీ కేంద్ర సంస్థ ద్వారా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తాయన్న విషయం స్పష్టమైపోతోంది.

19. ఈ విధంగా ప్రయివేటీకరించబడిన, కార్పొరేటీకరించబడిన ఉన్నత విద్యా సంస్థలు గల నయా–ఉదారవాద వాతావరణంలో భారత దేశంలోకి విదేశీ యూనివర్శిటీలను ఆహ్వానించాలని ప్రతిపాదిస్తున్నారు. ఇదంతా ఉన్నత విద్యా రంగంలో "వైద్య టూరిజం" వంటిదాన్ని ప్రవేశపెట్టడమే. దీని వెనుక ఒక రకమైన అలోచన పనిచేస్తోంది. ఈ విదేశీ యూనివర్శిటీలు భారతీయ యూనివర్శిటీలకు ఆదర్శంగా పనిచేస్తాయి. కార్పొరేట్ తరహా నిర్వహణ, మార్కెట్ అనుకూల కోర్సులు, క్యాజువల్, కాంట్రాక్ట్ ఉద్యోగాల్లో ఉపాధ్యాయులు, అధిక ఫీజులు..ఇవీ ఈ విదేశీ యూనివర్శిటీలు చూపించే ఆదర్శం. "స్వదేశీ" భారత దేశానికి దారి చూపించేందుకు "విదేశీ" యూనివర్శిటీలను ఆహ్వానించడం నిజంగా హాస్యాస్పదం.

20. కేంద్రీకృత జాతీయ పరిశోధనా నిధి (ఎన్ఆర్ఎఫ్)ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇది ప్రభుత్వ, ప్రయివేటు యూనివర్శిటీలకు పరిశోధనల కోసం నిధులు సమకూరుస్తుంది. ఇక్కడ కూడా పైన పేర్కొన్నట్లు ఎన్ఆర్ఎఫ్‌కు ఎటువంటి జాతీయ శాస్త్ర పారిశ్రామిక ప్రాధాన్యతలు సూచించలేదు. ఇది కేవలం తనకు వచ్చిన పరిశోధనా ప్రతిపాదనల ట్రెండ్‌ను అనుసరిస్తూ పోతుంది అంతే. రెండవది, రాష్ట్రాలకు ఎటువంటి పరిశోధనా ప్రాధాన్యతలు, ఎజెండాలు బదలాయించే విషయం ఇందులో పేర్కొనలేదు. దీని వల్ల కేంద్ర రాష్ట్రాలకు మధ్య అగాధం మరింత పెరిగిపోతుంది.

21. ఎన్ఇపి వల్ల ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున నష్టపోతారు. ఉన్నత విద్యా సంస్థల్లో కార్పొరేట్ తరహా నిర్వహణ (13.4–13.7) వల్ల విద్యార్థులు గినియా పందుల మాదిరిగా నలిగి పోతారు, సమాజంలో ఎస్‌సి, ఎస్టీ, ఇతర వెనుకబడిన సెక్షన్లు బాగా దెబ్బతింటారు. ఉపాధ్యాయుల జీతాలు, ఉద్యోగ నియామక పద్ధతి, నియామక కాలం, ప్రమోషన్లు వంటివాటినన్నిటినీ ఉన్నత విద్యా సంస్థల్లోని గవర్నింగ్ బాడీలు అంతర్గతంగా నిర్ణయిస్తాయి. దీని వల్ల ప్రభుత్వం సూచించిన యూనిఫార్మ్ ప్రమాణాలు, నిబంధనలు ఉండవు. పని అంచనా అనేది వైయక్తింగా ఉంటుంది. ఎటువంటి పర్యవేక్షణ, నియంత్రణకు లోబడి ఉండదు.

22. ఉన్నత విద్యా సంస్థల అకాడమిక్, పరిపాలనా నిర్వహణలో ప్రజాస్వామిక వ్యవస్థల ప్రస్తావనే ఎన్ఇపిలో లేదు. ఉపాధ్యాయులకుగానీ, ఇతర ఉద్యోగులకుగానీ ఎటువంటి పాత్ర లేదు. అంతేకాదు ఉన్నత విద్యా సంస్థల అకాడమిక్, పరిపాలనా సంస్థల్లో విద్యార్థుల పాత్ర గురించి ప్రస్తావనే లేదు.

**(అనువాదం:ఎన్ వెంకట్రావు**

# సాహసోపేతమైన వర్లి ఆదివాసుల తిరుగుబాటు

మహారాష్ట్రలోని వర్లి ఆదివాసీ ప్రజల మూకుమ్మడి తిరుగుబాటుకు మూలం అక్కడున్న అసాధారణ, హేయాతిహేయమైన పరిస్థితులు, భూస్వాముల నిరంకుశ అణచివేత. ఆ పరిస్థితులలో వారు తమ జీవితాలను తాము అసహ్యాహించుకుంటూనే శతాబ్దాల పాటు గడిపారు, భయం, నిస్సహాయత వారి కోపాన్ని అణచిపెట్టి ఉంచింది. తీవ్రమైన అసహాయ పరిస్థితిలో ఉన్న వారు ఎప్పుడెప్పుడు ఈ పరిస్థితుల నుండి బయట పడదామా అని ఎదురు చూస్తున్నారు. కానీ ఎలా బయటపడాలో తెలియలేదు. కమ్యూనిస్టుల ఆధ్వర్యంలోని కిసాన్‌సభ అక్కడ అడుగు పెట్టగానే ఆ లోపం పూరించబడింది. 1945 మేలో ఎర్రజెండా ఆధ్వర్యంలో బానిసత్వానికి వ్యతిరేకంగా తిరగబడడంతోటే వర్లి ప్రజల విమోచనోద్యమానికి బీజం పడింది. గోదావరి పరులేకర్, ఆమె భర్త శ్యామ్ రావు పరులేకర్ వర్లిలను సంఘటితం చేయడానికి నిర్విరామంగా కృషిచేశారు.



వర్లీ ఆదివాసులనుద్దేశించి ప్రసంగిస్తున్న ఉద్యమ నేత గోదావరి పరులేకర్

థానే జిల్లాలోని ఉమ్బర్‌గావ్, దాహను, పాల్ఘర్, జవహర్ తాలుకాలలో వర్లి గిరి జనులు ఎక్కువగా ఉంటారు. ఈ అన్ని తాలుకాలలో వారు విస్తరించి ఉంటారు. అక్కడున్న ధనిక భూస్వాములు కాస్తంత డబ్బిచ్చి వారి భూమిని లాక్కున్నారు. అందువలన ఆ తరువాతి కాలంలో వారు అదే భూమిలో కౌలు చేసుకుంటూ పంటలో సగభాగం కౌలుగా చెల్లిస్తూ, భూస్వాముల భూములలో ఏ ప్రతిఫలం లేకుండా వెట్టిచాకిరి చేస్తూ నికృష్టమైన జీవితాన్ని గడిపేవారు. కొందరు భూస్వాములకు గడ్డి భూములుండేవి, కొందరు అడవుల కాంట్రాక్టర్లుగా ఉండేవారు. వారంతా ఈ గిరి జనులకు చాలీ చాలని వేతనాలిస్తూ పనులు చేయించుకునే వారు. బలవంతపు చాకిరీ చేయించుకోడం సర్వసాధారణమైన విషయంగా ఉండేది. పనులు లేని కాలంలో గిరిజనులు భూస్వాముల నుండి ధాన్యం అప్పుగా తీసుకునేవారు. దానికి వారు పంట వచ్చిన తర్వాత యాభై నుండి రెండువందల శాతం వడ్డీగా చెల్లించవలసి వచ్చేది.

1945లో థానే జిల్లాలోని తిత్వాల గ్రామంలో మహరాష్ట్ర కిసాన్‌సభ మొదటి మహాసభ జరిగింది. దానికి కిసాన్‌సభ కార్యకర్తలు, జిల్లాలోని అన్ని తాలూకాల నుండి ప్రతినిధులను సమీకరించాలని భావించారు. మహాసభ కోసం ప్రచారం జరుగుతున్న సందర్భంలోనే వారికి 1944 డిసెంబర్లో ఉమ్బర్‌గావ్ వర్లిలతో పరిచయం ఏర్పడింది. ఆ రోజుల్లో భూస్వాముల మనుషులకు, స్థానిక ప్రభుత్వాధికారులకు ఆ ప్రాంతాలలో ఎదురేలేదు. వారి ఎదురుగా వర్లీలు మాట్లాడాలంటేనే భయపడేవారు. కిసాన్‌సభ నిర్వహించిన ఒకానొక సభలో ఇటువంటి పోకడలతో వీరు కనిపించగానే నిర్వాహకులు వీరిని సభనుండి బయటికి వెళ్లి పొమ్మన్నారు. వారు తలలోంచుకుని వెళ్లిపోయారు. ఈ అనుభవం వర్లిలకు ధైర్యాన్నిచ్చింది. వారి బాధలను స్వేచ్ఛగా చెప్పుకొనే నిబ్బరాన్ని, వారి పరిస్థితులను వివరించే అవకాశాన్ని కలుగజేసింది. తిత్వాలలో జరుగుతున్న మహాసభలకు తప్పనిసరిగా ప్రతినిధులను పంపడానికి ఒప్పుకున్నారు. అయితే కిసాన్‌సభ ప్రతినిధులెవరైనా మహాసభ తరువాత కూడా వారితోనే ఉండి తీరాలనే నిబంధన పెట్టారు. తిత్వాల మహాసభకు 15 మంది వర్లి గిరిజనులు హాజరయ్యారు. మహాసభలో అన్ని జిల్లాల నుండి వచ్చిన ప్రతినిధులను చూసి వర్లి గిరిజనులు ఉత్సాహపడ్డారు. బలవంతపు చాకిరిని వ్యతిరేకించడానికి, భూస్వాములపై తిరగబడటానికి వారికి ధైర్యాన్నిచ్చింది. అలా తిరగబడడంతో మొదటిసారిగా పొందిన విజయాలు వారి నమ్మకాన్ని పెంచింది. ఆ తరువాత వారు సులభంగానే శత్రువును ఓడించగలిగారు. వారిలో ఒక కొత్త చైతన్యం ఉద్భవించింది.

కిసాన్‌సభ మహాసభలో వెట్టిచాకిరీకి, బానిసత్వానికి వ్యతిరేకంగా తీర్మానం చేయబడింది. ఆ మహాసభ నాలుగు ప్రధానమైన సమస్యలపై పోరాటాలకు పిలుపునిచ్చింది. 1. భూస్వాములు రోజువారీ వేతనాలు ఇస్తేనేగాని వారి భూమిలో పని చేయవద్దు. 2. ఏ భూస్వామికి వెట్టి చాకిరీ చేయవద్దు.. 3. ఏ భూస్వామయినా దాడి చేస్తే ప్రతిఘటించండి. 4. అందరూ ఐక్యంగా ఉండాలి.

మహాసభ ముగియడంతోనే భూస్వాములకు బలవంతపు వెట్టి చాకిరికి ప్రతిఘటన మొదలయింది. మహాసభ ముగిసిన 24 గంటలలోనే మహాసభ పిలుపులు మారుమూల ప్రాంతాలకు చేరిపోయాయి. వర్లిలు అంతా ఏకమయ్యారు. వారెంత తొందరగా, ఎంత బలంగా ప్రతిఘటించారంటే మూడు

> **“ కాబట్టి సంక్షోభం వచ్చినప్పుడు అది అందరిపై ఒకేలా ప్రభావం చూపదు. కోవిడ్ చాలా సమానత్వం పాటిస్తోంది అని చెప్పడం చాలా చెత్తవాదన. ఆకలితో వున్న వారిపై, కరువు పరిస్థితులకు దగ్గరగా ఉన్నవారిపై, అనారోగ్యంతో ఉన్న వారిపై, ఆరోగ్య సదుపాయాలు అందుబాటులో లేనివారిపై, కనీస సదుపాయాలు అందు బాటులో లేనివారిపై కోవిడ్ తీవ్ర ప్రభావం చూపుతోంది.”**

వారాలలోనే వెట్టిచాకిరీ గత కాలపు చరిత్రగా మిగిలి పోయింది. ఈ విజయంతో వర్లిలు పొలాల్లో నిర్బంధంగా పనులు చేయటాన్ని ప్రతిఘటించడం మొదలుపెట్టారు. వేతనాలు లేకుండా భూస్వాముల భూమిలో పనులు చేయటానికి నిరాకరించారు. కిసాన్‌సభ నిర్ణయించిన వేతనాలను డిమాండ్ చేశారు.

ఉమ్బర్‌గావ్‌లో సాధించిన విజయం సుడిగాలిలాగా దహనుకు వ్యాపించింది. వారు కిసాన్‌సభ కోసం ఎదురు చూడకుండా రోజువారీ సమావేశాలతో తమ పోరాటాన్ని ప్రారంభించారు. కిసాన్‌సభ కార్యకర్తలు అక్కడికి వెళ్ళేసరికి ఆ ప్రాంతంలో ప్రజా తిరుగుబాటు వాతావరణం నెలకొని ఉంది. ఎర్రజెండా నాయకత్వంలో జరుగుతున్న పోరాటం తమ విముక్తి కోసమని, అప్పులతో కట్టుబానిసలుగా మారిన వారిని కూడా విముక్తి చేస్తుందని అర్థం చేసుకున్నారు. కట్టుబానిసలను విముక్తి చేయటానికి కదిలి, దహను తాలూకాలో 1000 మంది కట్టుబానిసలకు విముక్తి కల్పించారు. ముఖ్యంగా కట్టు బానిసల భార్యలు భూస్వాముల కామవాంఛకు బలైపోవటం నుండి విముక్తి పొందారు.

500 పౌండ్ల గడ్డికోయటానికి 2.50 రూపాయలు ఇవ్వాలన్న డిమాండ్‌ను కిసాన్‌సభ ముందుకు తెచ్చింది. వేలాది ఎకరాలలో ఉన్న గడ్డిపైన భూస్వాములు విపరీతమైన లాభాలను సంపాదిస్తున్నారు. ఈ ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేయటానికి భూస్వాములు పూనుకున్నారు. గోదావరి పరులేకర్ ఉపన్యసించనున్న సభను విచ్ఛిన్నం చేయటానికి గూండాలను తీసుకొస్తున్నారని ప్రచారం చేశారు. వాస్తవానికి అటువంటి సభ ఏది జరపాలని అనుకోలేదు. ఈ ప్రచారాన్ని నమ్మిన వర్లిలు వేలసంఖ్యలో పోగయారు. రాత్రికి సాయుధ సైనికులు వచ్చి తమ వాహనంపై నుండి శాంతియుతంగా ఉన్న వర్లిలపై కాల్పులు జరిపారు. దఫదఫాలుగా తెల్లవారు ఝామున గం. 3.30 వరకు ఈ కాల్పులు కొనసాగాయి. ఐదుగురు వర్లిలు చనిపోయారు. చాలామంది గాయాల పాలయ్యారు.

వర్లీలు మరణాన్ని ఎంత నిర్లక్ష్యంగా దిక్కరించగలరో తెలిపే ఈ సంఘటన వారికి ఎర్రజండా పట్ల ఉన్న విధేయత తెలియజేసింది. వారిలో అరుదైన ధైర్యం ఆవిర్భవించింది. దాదాపు 15 గంటల పాటు వారిపై కురుస్తున్న గుళ్ల వర్షాన్ని ఎదిరించి నిలిచారు. ఆ పదిహేను గంటలు ఎర్రజెండాను కేవలం తమ దేహాలతోనే కాపాడుకున్నారు. పోలీసు వ్యాను చుట్టుముట్టగానే వారు ఎగరేసిన ఎర్రజండా చుట్టూ చేరి దానిని కాపాడుకున్నారు. పోలీసులు ఎర్రజండాను కాల్చడానికి వచ్చారని భావించారు. అందువలన తమ జీవితాలను అర్పించయినా దానిని కాపాడుకోవడం తమ బాధ్యత అనుకున్నారు. తుపాకి పేలుళ్లు వారినే మాత్రం బెదిరించలేదు. కిసాన్ సభ కార్యకర్త అక్కడికి పరిగెత్తు కెళ్లి భూస్వాముల కుతంత్రాలను తెలియజేసిన తర్వాత మాత్రమే వారక్కడి నుండి ఇళ్లకు బయలు దేరారు. ప్రభుత్వం, భూస్వాముల పన్నాగాలు తెలుసుకున్న తరువాత వారిపై మరింత అసహ్యం కలిగింది.

వర్లి ఉద్యమం యొక్క ప్రాముఖ్యతను గ్రహించగానే సామ్రాజ్యవాద అధికార గణం వైఖరి పూర్తిగా మారిపోయింది. అంతవరకు జోక్యం చేసుకోనివారు వర్లిల పోరాటాలలో జోక్యం చేసుకుని నిర్దాక్షిణ్యంగా అణచివేయడం మొదలుపెట్టారు. గిరిజన రైతులలో పెరుగుతున్న కమ్యునిస్టుల ప్రభావాన్ని చూసి స్థానిక కాంగ్రెస్ ప్రభుత్వం కూడా భయపడింది. భూస్వాములతో చేతులు కలిపి, భయోత్పాతాన్ని సృష్టించి ఉద్యమాన్ని అణిచివేయాలని ప్రయత్నించింది. ఆ ప్రాంతాలలో అయిదుగురు కంటే ఎక్కువ మంది సమావేశమవకూడదని, ప్రదర్శనలు చేయకూడదని నిషేధాజ్ఞలు విధించింది. అక్కడున్న కమ్యూనిస్టుల నందరిని బహిష్కరించింది. పోలీసులు అనుసరించిన కొన్ని విధానాలు నాజీలు అనుసరించిన విధానాలంత క్రూరంగానూ, కర్కశంగానూ ఉన్నాయి. అయినా వర్లిలు వెనకడుగు వేయలేదు. మున్ముందుకు సాగిపోయారు.

రైతులు కేవలం ఒక్క ఏడాది కౌలు మాత్రమే చెల్లిస్తారని, బకాయిలు చెల్లించరని, వ్యవసాయ కూలీల వేతనాలు పెంచాలని డిమాండ్ చేయాలని 1946 మొదట్లో జరిగిన కిసాన్‌సభ మహాసభ నిర్ణయించింది. 1946లో గడ్డి కోతలు మొదలవగానే వర్లి ఉద్యమం తారాస్థాయికి చేరుకుంది. గడ్డి భూములున్న భూస్వాములే కాక, అడవిలో ఉన్న కాంట్రాక్టర్లు కూడా గడ్డి కోయడానికి గిరిజన రైతులకు వేతనాలు చెల్లించి పనిలో పెట్టుకునేవారు. వారు గిరిజనుల డిమాండ్లను ఒప్పుకోలేదు. వెంటనే కిసాన్ సభ సమ్మెకు పిలుపునిచ్చింది.

గిరిజన రైతులు ఈ సందేశాన్ని కర్రకు చివర ఒక తాటాకు కట్టి అన్ని గ్రామాలకు పంపించారు. కర్ర గ్రామానికి చేరగానే గిరిజన రైతులు పనులు మానేయడం మొదలు పెట్టారు. ఎడ్ల బండ్లను తోలే గిరిజనులు కూడా బండ్లు తోలడం ఆపేసారు. మహారాష్ట్రలో ఇటు వంటి సమ్మె జరగడం ఇదే ప్రథమం. గిరిజనులు చేసే ఈ సమ్మె 200 గ్రామాలకు పాకింది.

నెలరోజులపాటు జరిగిన ఈ సమ్మె ఆగే సూచనలు ఎక్కడా కనిపించలేదు. కలప వ్యాపారులు, భూస్వాములు విపరీతమైన నష్టాలు చవిచూడాల్సివచ్చి ఆందోళన చెందారు. గిరిజనులతో ఒప్పందానికి సిద్ధపడ్డారు. వారి డిమాండ్లను అంగీకరించారు. 1946 నవంబర్ 10వ తేదీ సమ్మె విరమించబడింది. వర్లిలకు ఇది ఒక పెద్ద విజయం. భూస్వాముల, కలప వ్యాపారుల, ప్రభుత్వాల దాడులను వారు సమర్ధవంతంగా తిప్పికొట్టగలిగారు. వర్లిలు మరింత దృఢంగా, ఐకమత్యంతో, అవగాహనను పెంచుకున్నారు. వారికి మిత్రులెవరో శత్రువులెవరో తెలిసి వచ్చింది. సంఘమే తమ బలమని తెలిసింది. ఈ పోరాట అనుభవం వర్లిలలో సమూలమైన మార్పును త్వరగా తీసుకొచ్చింది. ఎంతగానంటే ఒక కొత్త వర్లి ఉద్భవించాడు. వారిలో జ్ఞాన తృష్ణ పెరిగింది. సోవియట్ యూనియన్, సోషలిజం అంటే తెలుసుకోవాలనే ఉత్సాహం పెరిగింది. నిజానికి భూస్వాముల తప్పుడు ప్రచారాలే వారిలో మరిన్ని విషయాలు తెలుసుకోవాలని, జ్ఞానం సంపాదించాలన్న ఆకాంక్షను పెంచాయి. ఈ పోరాటాలు ఆర్థికరంగంలో వారికున్న హక్కులను గురించిన చైతన్యాన్ని పెంచాయి. అంతే కాదు, రాజకీయ, పౌర హక్కులను కూడా అర్థం చేసుకునేటట్టు చేశాయి.

❋

# రెడ్ సెల్యూట్ కామ్రేడ్ సున్నం రాజయ్య

(2వ పేజీ తరువాయి)



మూడు సార్లు శాసన సభ్యునిగా ఎన్నికైన సున్నం రాజయ్య మోటారు సైకిల్‌పై ప్రయాణం

ఆదివాసీలకు సంబంధించి మూడు పోరాటాలు జరుగుతున్నాయి. మొదటిది, రిజర్వేషన్ సమస్య. ఇటీవల 5వ షెడ్యూల్ ప్రాంతంలో గిరిజన ఉపాధ్యాయుల నియామకాలకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు గిరిజన హక్కులకు గొడ్డలి పెట్టు. 1990వ దశకం నుండి ఆంధ్ర ప్రదేశ్‌లో గిరిజన ప్రాంతాల్లో గిరిజన ఉపాధ్యాయులను నియమించడం ఒక సంప్రదాయంగా వస్తున్నది. దీనికి వ్యతిరేకంగా సుంప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా కామ్రేడ్ రాజయ్యతోబాటు, కామ్రేడ్ బాబూరావు తదితరులు పోరాడారు. నిరాహార దీక్షలు చేశారు. కోర్టులో దీనిపై పిటిషన్ కూడా వేశారు. రెండవది, మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యావిధానం. ఇందులో ఎస్టీ, ఎస్సీ, ఇతర బలహీన వర్గాల రిజర్వేషన్ గురించి ఒక్క మాట కూడా చెప్పకపోవడం రానున్న ప్రమాదాన్ని తెలియజేస్తోంది. మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసీ విద్యార్థుల గురించి కూడా ఈ నూతన విద్యా విధానం ఒక్కటంటే ఒక్క మాట చెప్పలేదు. దానర్థం ఏమిటి? అంటే ఆదివాసీ విద్యార్థులను విద్య నేర్చుకునే హక్కుకు దూరం చేస్తున్నారన్నమాట. ఇక మూడవది, ఆన్‌లైన్ విద్య. ఇటీవల తెలంగాణా ఉపాధ్యాయ సమాఖ్య ఆదివాసీ జిల్లాల్లో ఒక సర్వే నిర్వహించింది. ఈ జిల్లాల్లో 93 శాతం ఆదివాసీ విద్యార్ధులకు ఆన్‌లైన్ విద్య అందుబాటులో లేదని తేలింది. నూతన విద్యా విధానం ఈ విషయాన్ని గురించి ఒక్క మాట కూడా చెప్పలేదు. అందువల్ల రిజర్వేషన్ల సమస్య మీద, ఆదివాసీల విద్య కోసం, నూతన విద్యావిధానానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన కర్తవ్యం నేడు ఆదివాసీల ముందు ఉంది.

బిజెపి ప్రభుత్వం ఇచ్చిన కొన్ని నోటిఫికేషన్‌లు గిరిజనులకు చాలా నష్టదాయకమైనవి. వీటిపై పెద్ద పోరాటాలు జరిగాయి. మొదటిది, తునికాకు ధర కోసం జరిగిన పోరాటం. గిరిజన సంఘంతో కలిసి ఆంధ్ర, తెలంగాణాల్లో దీని కోసం మూడు పెద్ద పోరాటాలు చేశాం. కామ్రేడ్ రాజయ్య ఇందులో చాలా చురుకుగా పాల్గన్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన వాతావరణ అంచనా నోటిఫికేషన్ గిరిజనుకు అటవీ హక్కుల చట్టం ద్వారా అటవీ భూములపై లభించిన హక్కులను కాలరాసే విధంగా ఉన్నది. ఈ నోటిఫి కేషన్ ప్రకారం అడవుల్లో ఆదివాసీల అనుమతి లేకుండా, వారితో సంప్రదించకుండా ఎన్ని ప్రాజెక్టులనైనా చేపట్టవచ్చు. ఈ నోటిఫికేషన్‌లో ఆదివాసీలు అన్న మాట కూడా లేదు. దీనికి వ్యతిరేకంగా రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటం చేయాల్సి ఉంది. కానీ ఈ పోరాటాల్లో కామ్రేడ్ రాజయ్య లేకపోవడం మనకు వెలితిగానే ఉంటుంది.

చివరిగా కామ్రేడ్ రాజయ్య ధైర్యాన్ని గురించి చెప్పాలి. ఆయన మీద అనేక సార్లు దాడులు జరిగిన విషయం మనకు తెలుసు. ఎర్రజెండా కింద పోరాడుతున్నామని చెప్పుకుని, మన కామ్రేడ్స్ అనేక మందిపై దాడులు చేయడంద్వారా ఎర్రజెండాకు ద్రోహం చేసిన వారే కామ్రేడ్ రాజయ్యపైన కూడా దాడి చేశారు. రాజయ్య అటువంటి దాడులు అనేకం ఎదుర్కొన్నారు. కానీ ఆయన ఏనాడూ తను ఎన్నుకున్న మార్గం నుండి గానీ, తన బాధ్యతల నుండి గానీ కొంచెం కూడా పక్కకు మళ్లలేదు. ఎర్రజెండాపట్ల, దానికింద పోరాటలపట్ల నిబద్ధత కొంచెం కూడా చెక్కుచెదరలేదు. ఈ ధైర్యం కామ్రేడ్ రాజయ్యకు ఎక్కడి నుండి వచ్చింది? మౌలిక సామాజిక మార్పు కోసం కట్టుబడి ఉన్నప్పుడు ఏ వ్యక్తికైనా ఎటువంటి పరిస్థితుల్లోనైనా ధైర్యం చెక్కు చెదరదు. కామ్రేడ్ రాజయ్య అటువంటి మార్పుకు కట్టుబడి పనిచేశారు గనుకనే ఆయన అంత ధైర్యంగా, నిబద్ధతతో ప్రజల్లో పనిచేయగలిగారు. మూడు సార్లు శాసన సభ్యులైనప్పటికీ ఆయన సూత్రబద్ధంగా నిలబడగలిగారు. అటువంటి రాజయ్యను మనం ఎన్నటికీ మరువలేం. బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మనం పోరాడేటప్పుడు, ఆదివాసీల హక్కులపై రాష్ట్ర ప్రభుత్వ దాడులకు వ్యతిరకంగా ఉద్యమించినప్పుడు కామ్రేడ్ రాజయ్య మనకు ఎల్లప్పుడూ స్ఫూర్తినీ, ఉత్తేజాన్నీ ఇస్తూనే ఉంటారు. కామ్రేడ్ రాజయ్యకు రెడ్ సెల్యూట్!

**(అనువాదం: ఎస్ వెంకట్రావు)**

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం,**

**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-09-2020 (36 pages) Postal Regd. No D/VJ/172/2018-20

# సంక్షోభానికి సోషలిజమే పరిష్కారం

**– అమెరికా కమ్యూనిస్టు పార్టీ**

"స్వేచ్ఛా మార్కెట్ సిద్ధాంత వేత్తలంతా కారల్ మార్క్స్ సమాధివద్ద చేరి 'డబ్బుసంపాదనే ముద్దు, మరేమీ వద్దు'..'పెట్టుబడిదారీవ్యవస్థకు ప్రత్యామ్నాయం లేదు' అంటూ గంతులేసిన రోజులు కళ్లముందు మెదులుతూనే ఉన్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ వేతన దోపిడీ మీద ఆధారపడి బతుకుతోందిరా నాయనా, ఈ వ్యవస్థలో కార్మికులు తాము ఉత్పత్తి చేసే సరుకులను కొనుక్కోగలిగేంత వేతనాన్ని ఎన్నటికీ పొందలేరు, దీనివల్లనే 'అధికోత్పత్తి' ఏర్పడి అనునిత్యం సంక్షోభాలు వస్తుంటాయి, అవి ఒక్కోసారి చాలా తీవ్రంగా, భయంకరంగా కూడా ఉంటాయి, ఒక్క సోషలిజం మాత్రమే ఇటువంటి సంక్షోభానికి పరిష్కారం చూపిస్తుంది.. అని కారల్ మార్క్స్ చెవినిల్లుకట్టుకుని చెప్పిన విషయాలు, పొట్టలు పెంచుకున్న ఈ పెద్దమనుషులకు వంటపట్టలేదు.

పెట్టుబడిదారీ వ్యవస్థే 'కమ్మనైన ప్రపంచం' అన్న కలలనుండి బయట పడడానికి ఈ సిద్ధాంతవేత్తలు నిరాకరించారు. ఇటీవల కొద్ది వారాల క్రితం కూడా జాన్ మెక్ కైన్ ఒక సభలో.."ఆర్థిక వ్యవస్థ పునాదులు బాగున్నాయి" అని దీర్ఘాలు తీశారు.

కాని దానికి కొద్ది రోజుల ముందరే ఆర్థికవేత్త డేవిడ్ మాక్ మాట్లాడుతూ ఆర్థిక పతనం అనేది గొలుసుకట్టు పరమాణు చర్యమాదిరిగా వ్యాపిస్తోందని చెప్పాడు. ఈ వినాశనం ఆపడానికి ఏం చేయాలి అని అడిగితే ఆయన "చేయాల్సింది ఒక్కటే, ఆర్థిక వ్యవస్థలో తగినంత భాగాన్ని సమాజపరం చేస్తే అప్పుడు బయటపడగలం" అన్నాడు. చూశారా ప్రళయాన్ని ఆపడానికి అకస్మాత్తుగా సోషలిజం కావాల్సి వచ్చింది. మరి ఈ మాటలు చెప్పిన మాక్ ఎవరు? ప్రపంచంలోనే అతి పెద్ద బహుళజాతి బ్యాంకు అయిన జెపి మోర్గన్ ఛేజ్‌కు చెందిన ఆర్థికవేత్త.

అయితే మాక్ చెప్పిన సోషలిజానికీ, మార్క్స్ చెప్పిన సోషలిజానికీ సంబంధం లేదు. మార్క్స్ చెప్పిన సోషలిజంలో శ్రామిక ప్రజలే బ్యాంకులతో సహా ఉత్పత్తిసాధనాలపై యాజమాన్యం కలిగి ఉండి తమ ప్రయోజనాలకు అనుగుణంగా నడుపుతారు. మాక్ పనికి మాలిన రుణాలను 'సమాజపరం' చేయాలంటున్నాడు. ఆ విధంగా వాల్ స్ట్రీట్‌ను కాపాడి భారాన్ని శ్రామిక ప్రజలమీద వేసేయాలంటున్నాడు. అంటే ధనికుల బొక్కసాల్లోకి కాసులు చేరుతాయి, లక్షలాది సామాన్యులు ఇళ్లు, ఉద్యోగాలు, వైద్య సదుపాయాలు, రిటైర్‌మెంట్ సదుపాయాలు వదులుకోవాల్సి వస్తుందన్నమాట. అందువల్ల శ్రామిక వర్గాన్ని కూడా సంక్షోభం నుండి బయటపడేసే ప్యాకేజి కావాలని మనం డిమాండ్ చేయాలి...

**(అమెరికా కమ్యూనిస్టు పార్టీ పత్రిక "పీపుల్స్ వీక్లీ వరల్డ్" సంపాదకీయం నుండి)**

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Prajasakti Printers & Publishers private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 9490098977, 9494101091.
Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.15, No.4. Published on September 1, 2020